ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
విశాఖపట్నం
సోమవారం 21 ఆగస్టు 2017 | 16



మన్యాన్ని వీడని ముసురు



ఉధృతంగా ప్రవహిస్తున్న చెరువూరు వాగు

3

ఐదు రోజుల నుంచి తెరిపివ్వని వర్షం
ఉధృతంగా ప్రవహిస్తున్న గెడ్డలు, వాగులు
చిత్తడిగా మారిన రహదారులు
జలాశయాల్లో పెరుగుతున్న నీటిమట్టం

మిగులు టీచర్ల విధులు ఎక్కడ?



పోస్టింగ్ కోసం ఎదురుచూస్తున్న డీఈవో పూల్ టీచర్లు

నగర పరిసరాల్లో చేరేందుకు పైరవీలు

ఉన్నతాధికారుల ఉత్తర్వుల కోసం నిరీక్షణ

(ఆంధ్రజ్యోతి/విశాఖపట్నం)
విద్యాశాఖకు కొత్త సమస్య ఉత్పన్నమైంది. రేషనలైజేషన్, కొన్ని కేడర్‌లలో పోస్టులు అప్‌గ్రేడ్ చేశారు. మధ్యలో గ్రేడ్-2 పండిట్‌లు, పీఈటీలకు పదోన్నతులు ఇచ్చారు. అనంతరం జిల్లాలో భారీగా టీచర్లు మిగిలిపోయారు. విద్యాశాఖ లెక్కల మేరకు ఎస్జీటీ, గ్రేడ్-2 పండిట్‌లు, స్కూల్ అసిస్టెంట్లు, పీఈటీలు కలిపి 250 మంది మిగులు వుంటారు. అన్ని కేడర్‌లకు కలిపి బదిలీల కౌన్సెలింగ్ ముగిసింది. అయితే మిగులు టీచర్లకు విధుల కేటాయింపుపై ..మిగతా 13వ పేజీలో..

యోగాయనమః

ఆకట్టుకున్న జిల్లాస్థాయి పోటీలు





విశాఖ నగరంలోని వేద ధర్మ రక్షణ సభ హాలులో ఆదివారం జరిగిన జిల్లా స్థాయి యోగా పోటీల్లో ఆసనాలు వేసిన చిన్నారులు

16

రొయ్యల చెరువులతో రోగాలు

పాల్మన్‌పేట పంచాయతీలో అనుమతులు లేకుండా హెచరీల ఏర్పాటు

కాలుష్య వ్యర్థాలు, రసాయనాలు పంపా వరద కాలువలోకి విడుదల

ఉప్పగా మారిన భూగర్భ జలాలు

క్షీణించిన మత్స్య సంపద

జీవనోపాధి కోల్పోయిన మత్స్యకారులు

తాగునీటి కోసం కాలువ దాటాల్సిన దుస్థితి

వంతెన లేకపోవడంతో రసాయన నీటిలో నుంచే రాకపోకలు

చర్మ సంబంధ వ్యాధుల బారిన ప్రజలు

6



రొయ్యల చెరువుల వ్యర్థాలతో రంగుమారిన పంపా కాలువ. (ఇన్‌సెట్‌)లో పుండ్లు చేతులు చూపుతున్న రైతు

చెరువు కాదు.. రోడ్డే!

తట్టబంద బాపనచెరువు వద్ద చెరువు మాదిరిగా మారిన రోడ్డు



దారుణంగా రావికమతం-తోటకూరపాలెం రహదారి

అడుగడుగునా గోతులే

మరమ్మతు పనులు చేపట్టని ఆర్‌అండ్‌బీ అధికారులు

నరకప్రాయంగా వాహనచోదకుల పరిస్థితి

తట్టబంద నుంచి తోటకూరపాలెం వరకు ఆనవాళ్లు లేని రోడ్డు

ఆటోలు, 108 వాహనాలు కూడా రాని పరిస్థితి

రవాణా సదుపాయం లేక కళాశాల విద్యకు స్వస్తి చెబుతున్న బాలికలు

ప్రజాప్రతినిధి దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని నేతల ఆవేదన

రావికమతం-తోటకూరపాలెం రోడ్డు అత్యంత దారుణంగా తయారైంది. సుమారు 16 కిలోమీటర్లు ఉన్న ఈ రోడ్డులో అడుగడునా గోతులే. కొన్ని చోట్లు చెరువును తలపించేలా భారీ గొయ్యిలు ఏర్పడి, వాహన చోదకుల సహనాన్ని పరీక్షిస్తున్నాయి. వర్షం పడితే రోజుల తరబడి గోతుల్లో నీరు నిలిచి పోయి, వాహనాల రాకపోకలతో అవి మరింత పెద్దవి అవుతున్నాయి. నీళ్లు నిలిచిన సమయంలో ద్విచక్రవాహన చోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. కొద్ది రోజుల నుంచి కురుస్తున్న వర్షాలతో ఈ రోడ్డు మరింత అధ్వానంగా తయారైంది. ఈ మార్గంలోని గ్రామాల్లో ఎవరైనా తీవ్ర అస్వస్థతకు గురైనా, గర్భిణులకు పురుటి నొప్పులు వచ్చినా.. ఆస్పత్రికి తరలించడానికి 108 వాహనం రాని పరిస్థితులు నెలకొన్నాయి. -సెంటర్‌స్ప్రెడ్‌లో..



రాజ్‌మా రైతుకు ఊరట

నాలుగేళ్ల తరువాత విత్తనాల పంపిణీ

అందుబాటులో 1200 క్వింటాళ్ల చింతపల్లి రెడ్ రకం

25 శాతం రాయితీపై గిరిజన రైతులకు సరఫరా

6


మాట్లాడుతున్న తోట విజయలక్ష్మి

మహిళలు భాగస్వాములు కావాలి

బీజేపీ జిల్లా అధ్యక్షురాలు విజయలక్ష్మి

మహిళా మోర్చా కార్యవర్గం ఏర్పాటు

అనకాపల్లి: బీజేపీ పటిష్టతకు మహిళలు భాగస్వాములు కావాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షురాలు తోట విజయలక్ష్మి అన్నారు. ఆదివారం స్థానిక వివేకానంద భవనంలో మహిళా మోర్చా కార్యవర్గం ఎన్నిక జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం మహిళా సంక్షేమానికి పెద్దపీట వేస్తోందన్నారు. ప్రధాని నరేంద్రమోదీ అన్నివర్గాల వారికి సమాన ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకు వెళ్లాలన్నారు. ఈ నెల 28, 29, 30 తేదీల్లో పార్టీ జాతీయ అధ్యక్షుడు రాష్ట్రంలో పర్యటించనున్నారన్నారు. 28వ తేదీన గన్నవరంలో జరిగే వెహికల్ ర్యాలీలో విశాఖ జిల్లా నుంచి 40 కార్లు పాల్గొంటున్నాయన్నారు.

మహిళా మోర్చా కార్యవర్గం

బీజేపీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలిగా శీరం రెడ్డి సావిత్రి(మాకవరపాలెం), ఉపాధ్యక్షులుగా పోతల వెంకట రాజ్యలక్ష్మి (నర్సీపట్నం), శానాపతి నాగరత్నం (ఎలమంచిలి), తాలాడ నారాయణమ్మ (అనకాపల్లి), ప్రధాన కార్యదర్శిగా తాటిపూడి రాణి (కోటవురట్ల), కార్యదర్శులుగా పల్లి రమాదేవి(పరవాడ), రొంగలి నూకాలతల్లి (నర్సీపట్నం), కోశాధికారిగా ఎల్.వరలక్ష్మి (కోటవురట్ల) ఎన్నికయ్యారు.

జిల్లా కమిటీ విస్తరణ

బీజేపీ జిల్లా కమిటీ విస్తరణలో భాగంగా జిల్లా కార్యదర్శులుగా బోయిన చిన అప్పారావు, మొల్లి శివ రామకృష్ణను, విశ్వబ్రాహ్మణ సంఘం జిల్లా కార్యదర్శిగా బేబుల సూరిబాబును నియమించినట్లు జిల్లా అధ్యక్షురాలు తోట విజయలక్ష్మి ప్రకటించారు. సమావేశంలో బీజేపీ జిల్లా నాయకులు గొంతిన భక్త సాయి రామ్, పీలా అచ్చుతరామారావు, అరిశంకల శంకర రావు, కురచా రాజారావు, గంగబాబు, గాదె శ్రీను, లోకుల గాంధీ, వీవీ రామరాజు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళా మోర్చా జిల్లా ఇన్‌చార్జి ఎస్.ఉమామహేశ్వరి, సెన్సార్ బోర్డు మెంబరు వడ్డాది వరలక్ష్మిలను సత్కరించారు.


సమావేశానికి హాజరైన పదాధికారులు


బాస్కెట్ బాల్ ప్రాక్టీస్ చేస్తున్న వంశీకృష్ణ


పతకాన్ని అందుకుంటున్న ఆకాష్

క్రీడా రత్నాలు

మైదాన్

■ చదువుల్లోనే కాదు... ఆటల్లోనూ మేటి

■ రాష్ట్ర, జాతీయ క్రీడల్లో ప్రతిభ చూపుతున్న శ్రీప్రకాష్ విద్యార్థులు

పాయకరావుపేట : అన్ని రంగాల్లోనూ విద్యార్థు లు రాణించాలన్నది ప్రతి ఒక్కరి ఆకాంక్ష. అటు తల్లిదండ్రులు, ఇటు విద్యా సంస్థలు ప్రోత్సహిస్తే విద్యార్థులు క్రీడల్లో కూడా ప్రతిభ కనబరుస్తురనడం అతిశయోక్తికాదు. అదే కోవకు చెందినవారు పాయకరావుపేట శ్రీప్రకాష్ విద్యా సంస్థల విద్యార్థులు. ప్రాథమిక స్థాయి నుంచి ఆటపాటలు, సంస్కృతి సంప్రదాయాలను అలవర్చడం, వారికి ఆసక్తి ఉ న్న రంగాల్లో ప్రోత్సహించడంతో విద్యార్థు లు మండల, జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరు స్తున్నారు.

❖ శ్రీప్రకాష్‌లో పదో తరగతి చదువుతున్న కూండ్రపు బాలవంశీ బాస్కెట్ బాల్, హ్యాండ్ బాల్, నెట్ బాల్ క్రీడల్లో రాణిస్తూ వస్తున్నాడు. 2016-17లో జాతీయ స్థాయి బాస్కెట్ బాల్ (అండర్ -14), రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ (అండర్-14), రాష్ట్ర స్థాయి నెట్ బాల్ (అండర్-14) పోటీల్లో ప్రతిభ కనబర్చి పతకాలు సాధించాడు. ఈ సందర్భంగా బాలవంశీ మాట్లాడుతూ చదువుతోపాటు రోజూ రెండు గంటలు బాస్కెట్ బాల్ ప్రాక్టీస్ చేస్తున్నానని, రానున్న రోజుల్లో జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని అత్యుత్తమ పతకాలు సాధిస్తానని తెలిపాడు.



ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్న గెడ్డం ఆకాష్ మండలం లోని గుంటపల్లి గ్రామానికి చెందిన జీసీఆర్ ఫౌండేషన్ అధినేత గెడ్డం బుజ్జి కుమారుడు. తన తండ్రి నుంచి రైఫిల్ షూటింగ్‌లో ఓనమాలు నేర్చుకుని గత ఏడాది ఆగస్టులో జరిగిన రాష్ట్రస్థాయి రైఫిల్ షూటింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో రజత పతకం సాధించాడు. రాష్ట్ర, జాతీయస్థాయి రైఫిల్ షూటింగ్ పోటీల్లో ప్రతిభ కనబరుస్తున్నాడు. గత నెలలో జరిగిన రాష్ట్ర స్థాయి టు టు రైఫిల్ షూటింగ్ పోటీల్లో జూనియర్ విభాగంలో గెడ్డం ఆకాష్ ప్రతిభ కనబరిచి కాంస్య పతకాన్ని కైవసం చేసుకున్నాడు. గుర్రపు స్వారీ కూడా ప్రావీణ్యం పొందిన ఆకాష్ రానున్న రోజుల్లో హార్స్ రైడింగ్ పోటీల్లో పాల్గొందుకు సిద్ధమవుతున్నాడు. వచ్చే ఒలింపిక్స్‌లో పతకం సాధించడమే లక్ష్యంగా ఆకాష్ పలు శిక్షణలు పొందుతూ సిద్ధ పడు తున్నాడు.



పదో తరగతి చదువుతున్న ముమ్మిడివరపు అఖిల 6వ తరగతి నుంచి ఖోఖో పోటీల్లో రాణిస్తూ జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో పతకాలు సాధించింది. ఖోఖో నేషనల్స్‌కి రెండు సార్లు ఎంపికై ఒకసారి సెమీ ఫైనల్స్‌కు చేరుకుంది. మరోమారు మూడవ స్థానం సాధించింది. జాతీయస్థాయి స్కై ఫై పోటీల్లో మూడవ స్థానం సాధించింది.



పదవ తరగతి చదువు తున్న ఆయుష్ గౌతమ్ హ్యాండ్ బాల్ పోటీల్లో ఆద్భుత ప్రతిభ కనబరుస్తున్నాడు. గత ఏడాది జరిగిన రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ పోటీలో రెండో స్థానం సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. త్వరలో జరుగనున్న జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు సిద్ధమవుతున్నాడు.



ఎనిమిదో తరగతి చదువుతున్న మోరి త్రివేష్ రెండేళ్ల కిందట నుంచి హ్యాండ్ బాల్ నేర్చుకుని జిల్లా, రాష్ట్రస్థాయి పోటీల్లో పతకాలు సాధిస్తున్నాడు. రానున్న రోజుల్లో హ్యాండ్‌బాల్ ఆటలో మరింత రాణించి జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరుస్తానం టున్నాడు.



ఎనిమిదో తరగతి చదువుతున్న ప్రేరణరాజ్ ఖోఖోలో ప్రతిభ కనబరుస్తోంది. గత ఏడాది జరిగిన నేషనల్ ఖోఖో పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబర్చింది. హ్యాండ్ బాల్, బాస్కెట్ బాల్ ఆటల్లో కూడా రాణిస్తూ జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో సత్తా చాటింది.



పదో తరగతి చదువుతున్న బిశ్వలక్ష్మి బెహరా స్కై ఫై, హ్యాండ్ బాల్, ఖోఖో, రన్నింగ్ పోటీల్లో ప్రతిభ కనబరుస్తోంది. గత ఏడాది జరిగిన స్కై ఫై నేషనల్స్‌లో మూడవ స్థానం సాధించింది. రానున్న రోజుల్లో మరిన్ని పోటీల్లో పాల్గొని సత్తాచాటుతానని ఘంటాపథంగా చెబుతోంది.

క్రీడలపట్ల ఆసక్తి చూపుతున్నారు



మా విద్యార్థులు హ్యాండ్ బాల్, బాస్కెట్ బాల్, ఖోఖో, పుట్ బాల్, క్రికెట్‌తోపాటు కబడీ, రన్నింగ్ తదితర క్రీడల్లో ఆసక్తి చూపుతున్నారు. విద్యార్థుల తల్లిదండ్రుల సహకారంతో 5వ తరగతి నుంచే శిక్షణ ఇస్తున్నాను. మా విద్యార్థులు స్కూల్, మండల, జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో పాల్గొం టున్న ప్రతి టోర్నమెంట్‌లోనూ సత్తా చాటు తున్నారు. ఇటు విద్యా సంస్థ యాజమాన్యం, అటు విద్యార్థుల తల్లిదండ్రుల ప్రోత్సహించడం వల్ల ఈ విజయాలు సాధిస్తున్నాం. **-డి.సీహెచ్.అప్పారావు,** పీఈటీ


రైఫిల్ షూటింగ్ పోటీల్లో పాల్గొన్న ఆకాష్

సింహాద్రి అప్పన్నకు గరుడసేవ

సింహాచలం: వరాహలక్ష్మీనృసింహస్వామికి ఆదివారం గరుడసేవ నిర్వహించారు. దేవస్థానం నిర్ణయించిన రూ.500 చెల్లించి నవ వధూవరులు గరుడు సేవలో పాల్గొన్నారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని రజత గరుడవాహనంపై ఆలయ బేడా మండపంలో ఉంచారు. దేవాలయ ఉపప్రధానార్చకుడు ఐ.వెంకటరమణాచార్యులు భక్తుల గోత్రనామాలతో సంకల్పం చెప్పి షోడశోపచారాలు సమర్పించి నృసింహ అష్టోత్తర శతనామావళితో పూజలు చేశారు.


గరుడసేవలో పాల్గొన్న భక్తులు

ఆధ్యాత్మికం

గ్రామదేవతలను ఆరాధిస్తే సుభిక్షం

గ్రామదేవతలను ఆరాధించడం, ఉత్సవాలు నిర్వహించడం వల్ల ఆ గ్రామాలు సుభిక్షంగా ఉంటాయన్న నమ్మకం ప్రజల్లో ఉందని చినదొడ్డిగల్లు అర్చకుడు వీరంకి శ్రీనివాస రావు అన్నారు. అందుకే ఆషాఢం నుంచి సంక్రాంతి వరకూ గ్రామాల్లో అమ్మవారి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తుంటారన్నారు. దుష్టశక్తులు గ్రామంలోకి చొరబడకుండా పొలిమేరలో గ్రామదేవతలు నిరోధిస్తారనేది భక్తుల విశ్వాసమని అన్నారు. నక్కపల్లి మండలం చినదొడ్డిగల్లు గ్రామంలో ఉన్న మరిణమ్మను దర్శించుకుంటే కార్యజయం కలుగుతుందన్న నమ్మకం చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు ఉందని చెప్పారు.


వీరంకి శ్రీనివాసరావు
అర్చకులు
చిన్నదొడ్డిగల్లు

అమ్మవారిని ఆరాధించడం వల్ల మహిళలకు చర్మవ్యాధులు రావన్నారు. పూజకు వినియోగించే ద్రవ్యాల్లో ఎక్కువ ఔషధ గుణాలు కలిగినవి వున్నందున ఎంతో మేలు చేస్తాయని చెప్పారు. మరిణమ్మ సంతాన ప్రదాతగా ప్రాచుర్యం పొందిందన్నారు. కష్టాల్లో అమ్మవారిని తలచుకున్నా, ఆ తల్లి దివ్యమంగళమూర్తిని దర్శించుకున్నా అడ్డంకులు తొలగిపోతాయని చెప్పారు. అమ్మవారి పూజలు, ఉత్సవాలు, హోమాలు జరిగే గ్రామాలు సుభిక్షంగా వుంటాయని, అంటువ్యాధులు ప్రబలవని అన్నారు.

- నక్కపల్లి


చింతపల్లి:వర్షపు నీరుతో కళకళలాడుతున్న తాజంగి రిజర్వాయర్


పాడేరులో ముసురు...

మన్యాన్ని వీడని ముసురు

పాడేరురూరల్: ఏజెన్సీలో ఆదివారం కూడా ముసురు వాతావరణం కొనసాగింది. గత ఐదు రోజులుగా ఎడతెరిపిలేకుండా జల్లులు, అప్పుడప్పుడు పెద్ద వర్షం పడుతుండటంతో జన జీవనానికి తీవ్ర అంతరాయం కలిగింది. ఆదివారం ఉదయం నుంచి ఆకాశం మేఘావృతంగా ఉండడం, అప్పుడప్పుడు చిరుజల్లులు పడడంతో రహదారులు చిత్తడిగా మారాయి. పాడేరులో జన సంచారం అధికంగా ఉండే అంబేడ్కర్ కూడలి, మెయిన్ రోడ్డు... జనం లేక బోసిపోయాయి. పట్టణంలోని వీధులు చెత్త, బురదమయంగా మారాయి. పాడేరుతోపాటు అన్ని మండలాల్లోనూ వర్షాలు కురుస్తున్నాయి.

కొయ్యూరు మండలంలో ఆదివారం అత్యధికంగా 31.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. చింతపల్లిలో 19.6 మిల్లీమీటర్లు, జి.మాడుగులలో 19.4, పెదబయలులో 1.4, డుంబ్రిగుడలో 2.2, అరకులోయలో 1.4, జి.మాడుగులలో 19.4, పాడేరులో 8.2, అనంతగిరిలో 16.4, హుకుంపేటలో 16.4, ముంచంగిపుట్టులో 15.2 మీల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

పొంగి ప్రవహిస్తున్న వాగులు

చింతపల్లి: చింతపల్లి, జీకే వీధి మండలాల్లో ఎడతెరిపిలేకుండ వర్షం పడుతున్నది. మూడు రోజుల నుంచి ఒడిశా సరిహద్దు ప్రాంతాల్లో విస్తారంగా వర్షాలు కురియడంతో వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. చింతపల్లి మండలంలో చెరువూరు, సోమవారం వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. తాజంగి జలాశయం, చౌడుపల్లి చెరువు పూర్తిగా నిండాయి. పంటపొలాల్లో నీరు నిలిచింది. ఈ వర్షాలతో వరి పైరు ఏపుగా పెరుగుతుందని, తెగుళ్ల బెడద తగ్గుతుందని రైతులు చెబుతున్నారు. కాగా బలిమెల, గుంటవాడ జలాశయాల్లోకి వరద నీటి ప్రవాహం కొనసాగుతున్నది..

ముంచంగిపుట్టులో భారీ వర్షం

ముంచంగిపుట్టు: మండలంలో గత మూడు రోజుల నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కుస్తున్నది. ఆదివారం భారీ వర్షం పడడంతో డ్రైనేజీలు నిండిపోయి, వర్షపు నీరు వీధుల్లో ప్రవహించింది. సాయంత్రానికి కాస్త తెరిపివ్వడంతో ప్రజలు ఊపిరిపీల్చుకున్నారు. ఏకధాటిగా కురుస్తున్న వర్షాలతో మత్స్యగెడ్డ పాయలు, వాగులు వంకలు వరద నీటితో కళకళలాడుతున్నాయి. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు ఖరీఫ్ పంటలకు ఎంతో మేలు చేస్తాయని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. అన్ని గ్రామాల్లో వ్యవసాయ పనుల్లో రైతులు బిజీగా వున్నారు. కాగా జోలాపుట్, డుడుమ జలాశయాల్లో నీటి మట్టాలు పెరుగుతున్నాయి. కాగా భారీ వర్షాల కారణంగా పలుచోట్ల తారురోడ్లు దెబ్బతిన్నాయి. మట్టి రహదారులు చిత్తడిగా మారాయి.


పాడేరు సమీపంలో పొలాల్లో చేరిన వర్షపు నీరు


ముంచంగిపుట్టులో భారీ వర్షం...

పాడేరు ఘాట్ రోడ్డుపై కూలిన భారీ వృక్షం

మూడు గంటలపాటు వాహనాల రాకపోకలకు అంతరాయం


కూలిన చింతచెట్టు. (ఇన్‌సెట్‌లో)నిలిచిపోయిన వాహనాలు, ప్రయాణికులు

పాడేరు రూరల్: పాడేరు-విశాఖపట్నం ఘాట్ మార్గంలో వంట్లమామిడి గ్రామానికి సమీపంలో ఆదివారం ఉదయం ఐదు గంటల ప్రాంతంలో భారీ చింత చెట్టు రోడ్డుకు అడ్డంగా పడిపోయింది. దీంతో ఇరువైపులా నుంచి వచ్చే వాహనాలు భారీగా నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న ఎస్ఐ ఎం.రామారావు పోలీసు సిబ్బందితోపాటు మోటారుతో నడిచే కోత రంపాలు, కూలీలతో సంఘటనా స్థలానికి చేరుకున్నారు. రోడ్డుకు అడ్డంగా పడిన చెట్టును యంత్రాలతో కోయించి, పక్కకు తొలగించారు. సుమారు మూడు గంటల తరువాత తొలగించి, వాహనాల రాకపోకలను పునరుద్ధరించారు. ఇదిలావుండగా శనివారం రాత్రి ఏడు గంటల సమయంలో మినుములూరు సమీపంలో ఉన్న పోతురాజు గుడి వద్ద చెట్టుపడిపోయింది. దీంతో వాహనాలు నిలిచిపోయాయి. చిన్న చెట్టుకావడంతో ప్రయాణికులే దానిని తొలగించారు. కాగా పాడేరు ఘాట్ మార్గంలో ప్రమాద భరితంగా ఉన్న భారీ వృక్షాలను తొలగించేందుకు రోడ్లు, భవనాల శాఖ అధికారులు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

గ్రామీణ యువతకు బైక్‌మెకానిక్ కోర్సుపై 28 నుంచి శిక్షణ

అనకాపల్లి రూరల్: అనకాపల్లి పూడిమడక రోడ్డులోని స్టేట్ బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థతో ఈ నెల 28వ తేదీ నుంచి బైక్ మెకానిజం(టూ వీలర్ సర్వీసింగ్) కోర్సుపై గ్రామీణ ప్రాంత యువకులకు ఉచిత శిక్షణ ప్రారంభం అవుతుందని సంస్థ డైరెక్టర్ వీవీ వీరేష్‌బాబు తెలిపారు. నెలరోజులపాటు శిక్షణ వుంటుందని, ఈ కాలంలో ఉచిత వసతి, భోజన సదుపాయలు కల్పిస్తామన్నారు.

అభ్యర్థులు గ్రామీణ ప్రాంతానికి చెందినవారై, 18 నుంచి 45 ఏళ్ల మధ్య వయస్సు కలిగినవారై ఉండాలన్నారు. శిక్షణ పూర్తిచేసిన వారికి బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పించేందుకు తోడ్పాటును అందిస్తామన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు అనకాపల్లిలోని సంస్థ కార్యాలయంలో స్వయంగాగానీ లేదా 80083 33509 నంబర్‌కు ఫోన్ చేసి సంప్రదించవచ్చని వీరేష్‌బాబు తెలిపారు.

ఇద్దరి ప్రాణాలు కాపాడిన లైఫ్ గార్డ్స్

విశాఖపట్నం, ఆగస్టు 20: బీచ్‌లో విహారానికి వచ్చి సముద్రపు అలల్లో చిక్కుకున్న ఇద్దరిని లైఫ్ గార్డ్స్ రక్షించారు. వివరాలిలా ఉన్నాయి. ఆదివారం ఉదయం తొమ్మిది గంటల ప్రాంతంలో కాళీమాత గుడి ఎదురుగా ఉన్న తీరంలో నగరానికి చెందిన కొంతమంది యువకులు సరదాగా గడపడానికి వచ్చారు. ఇంతలో వారిలో ఒక యువకుడు కెరటాల్లో కొట్టుకుపోతుండగా సమీపంలోని లైఫ్ గార్డ్స్ అప్రమత్తమయ్యారు. వెంటనే స్పందించి యువకుడిని రక్షించారు. అలాగే.. సాయంత్రం సుమారు నాలుగు గంటల సమయంలో కడప ప్రాంతానికి చెందిన కొంతమంది కుటుంబ సభ్యులతో బీచ్‌లో విహారానికి వచ్చారు. ఈ కుటుంబానికి చెందిన గుంటిక మణికంఠ అనే బాలుడు బీచ్‌లో ఆడుకుంటుండగా సముద్రపు అలలో చిక్కుకున్నాడు. కుటుంబసభ్యులు భయంతో కేకలు వేయడంతో సమీపంలోని లైఫ్ గార్డ్స్ స్పందించి బాలుడిని రక్షించారు.

మీ ప్రాంతంలో జరిగే సభలు, సమావేశాలు, ఉత్సవాలు... తదితర కార్యక్రమాల వివరాలను మాకు తెలపండి

విలేకరుల ఫోన్ నంబర్లు

అరకులోయ	94408 67497	డుంబ్రిగుడ	94918 02681
అరకు రూరల్	94401 13448	హుకుంపేట	8500097775
అనంతగిరి	73828 27555	ముంచంగిపుట్టు	94928 19993
అనంతగిరి రూరల్	94411 79874	పెదబయలు	94923 44301

ఫోరం పరిధిలోకే ఆన్‌లైన్ వినియోగదారులు

జిల్లా వినియోగదారుల సంఘం అధ్యక్షుడు కె.వెంకటరమణ



మాట్లాడుతున్న జిల్లా వినియోగదారుల సంఘం అధ్యక్షుడు కె.వెంకటరమణ

అరకులోయ: ప్రస్తుత రోజుల్లో ఆన్‌లైన్‌లో వస్తువుల కొనుగోలు చేసి మోసపోవడం పరిపాటిగా మారిందని.. జిల్లా వినియోగదారుల సంఘాల సమాఖ్య అధ్యక్షుడు కాండ్రేంగుల వెంకట రమణ అన్నారు. ఇలా మోసపోయిన బాధితులు వినియోగదారుల ఫోరంను ఆశ్రయించి న్యాయం, నష్ట పరిహారం పొందవచ్చునని తెలిపారు.

అరకులోయ మండల పరిషత్ సమావేశ మందిరంలో " సమాచార హక్కు, వినియోగదారుల రక్షణ చట్టాలు- తీర్పులు " అనే అంశమ్మై ఆదివారం చర్చ నిర్వహించారు. 11 మండలాల వినియోగదారుల సంఘాల ప్రతినిధులు హాజరైన ఈ సమావేశంలో కె.వెంకటరమణ మాట్లాడారు. వినియోగదారుల చట్టం పరిధిలోకి ఆన్‌లైన్ వినియోగదారులు కూడా వస్తారని, వినియోగదారుల హక్కులు, బాధ్యతలపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. ఆన్‌లైన్‌లో కొనుగోలు చేసిన వస్తువు బట్వాడా కాకపోవడం, ఆలస్యం కావడం, నకిలీ వస్తువులు, గ్యారంటీ, వారంటీ పత్రాలు లేకపోవడం వంటి ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం నియమావళిని కఠినతరం చేసిందన్నారు. వినియోగదారుల కోర్టులు, ఆర్టీఐ, లోకాయుక్త, లోక్ అదాలత్, వివిధ స్థాయిల్లోని యాప్‌లు, ట్విట్టర్లు, ఫేస్‌బుక్‌లు, టోల్‌ఫ్రీ నెంబర్లు, హెల్ప్ లైన్లు, అంబుడ్స్‌మెన్, ఫిర్యాదుల విభాగం, కాల్ సెంటర్లు, ఆన్‌లైన్ ఫిర్యాదులు, మీకోసం, డయల్ యువర్ కలక్టర్ వంటివన్నీ ఈ కోవకే చెందుతాయన్నారు. వీటిన్నింటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అలాగే గిరిజన కుటుంబానికి విధిగా ఐదు కిలోల గ్యాస్ సిలిండర్‌ను ప్రభుత్వం సరఫరా చేయాలన్నారు. జీసీసీ నుంచి ప్రజా పంపిణీ వ్యవస్థ వేరు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ఆహార పదార్థాల నాణ్యతను తెలియజేసే అగ్‌మార్కు గుర్తు కలిగిన వస్తువులను మాత్రమే వినియోగదారులు కొనుగోలు చేయాలన్నారు. అలాగే సమాచార హక్కు చట్టం, వినియోగదారుల రక్షణచట్టం, ప్రాధాన్యత, కేసు దాఖలు, తీర్పులు సాధించిన విజయాలు, ప్రభుత్వ ఉత్తర్వులను ఈ సందర్భంగా ఆయన వివరించారు. ఈ సమావేశంలో గిరిజన ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.మత్స్యలింగం, వినియోగదారుల హక్కుల పరిరక్షణ సంఘం మాజీ అధ్యక్షుడు దొన్నుదొర పలు అంశాలపై మాట్లాడారు. సమావేశం అనంతరం వినియోగదారుల రక్షణచట్టం అమలు చట్టాన్ని ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించడంలో కృషి చేసినందుకు పంద్రాగస్టు రోజున జిల్లా ఇన్‌చార్జి మంత్రి హోమ్ మినిస్టర్, ఉపముఖ్యమంత్రి చినరాజప్ప, జిల్లా కలెక్టర్ చేతులు మీదుగా అవార్డు పొందిన వి.ధర్మయ్యను ఈ సందర్భంగా ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో గిరిజన ఉద్యోగుల సంఘం మాజీ కార్యదర్శి ఎస్.అప్పన్న, పాడేరు డివిజన్ వినియోగదారుల సంఘాల ప్రతినిధులు కొర్రా సీతారాం, ,ఎం.కిరణ్‌కుమార్, వర్తక సంఘం గౌరవ అధ్యక్షుడు ఎం. రాజారావు, కె.విలియం తదితరులు పాల్గొన్నారు.

నూతన భవనాల నిర్మాణాలకు ప్రతిపాదనలు

వి.త్రినాథరావు, ఎంఈవో, డుంబ్రిగుడ

ఇంటర్వ్యూ



ప్రశ్న: మండలంలోని పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు ఏ విధంగా ఉన్నాయి.

జవాబు: మండలంలో ప్రమాణాలతో కూడిన విద్యను అందించేందుకు కృషి చేస్తున్నాం. మొత్తం 167 పాఠశాలలు ఉన్నాయి. అన్ని పాఠశాలలో ఉపాధ్యాయులు ఉన్నారు.

ప్రశ్న: భవనాలు లేని పాఠశాలలకు నూతన భవనాలు నిర్మించే దిశగా చర్యలు చేపట్టారా?

జవాబు: మండలంలోని మొత్తం 18 పాఠశాలలకు భవనాలు లేవు. మరికొన్ని పాఠశాలల్లో భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. నూతన భవనాలు నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించాం. శిథిలావస్థలో ఉన్న పాఠశాల భవనాల మరమ్మతులకు ఉన్నత స్థాయి అధికారులు చర్యలు తీసుకోవాలి.

ప్రశ్న: ప్రతీ నెల పాఠశాలలకు తనిఖీలు నిర్వహిస్తున్నారా? తనిఖీలో ఉపాధ్యాయులు పాఠశాలలో సక్రమంగా విధులకు హాజరు కాని వారిపై చర్యలు తీసుకుంటున్నారా?

జవాబు: ప్రతీ నెల ఆయా పాఠశాలలకు తనిఖీలు నిర్వహిస్తున్నాం. ఉపాధ్యాయులు అందరు సక్రమంగా విధులు నిర్వహిస్తున్నారు. తనిఖీ సమయంలో లేని వారికి శాఖాపరమైన చర్యలు తీసుకుని మెమోలు అందజేస్తున్నాం.

ప్రశ్న: మధ్యాహ్న భోజన పథకం ఏ విధంగా కొనసాగుతోంది? వివరాలను ఆన్‌లైన్‌లో ఉపాధ్యాయులు పొందు పరుస్తున్నారా? గతంతో మెమోలు ఇచ్చిన వారిపై చర్యలు ఉన్నాయా?

జవాబు: ప్రతీ పాఠశాలలో మధ్యాహ్నం భోజనం సక్రమంగా అందుతోంది. రిపోర్టులను ప్రతీ ఒక్కరూ ఆన్‌లైన్‌లో పొందుపరుస్తున్నారు. గతంలో 70 మంది ఉపాధ్యాయులపై శాఖాపరమైన చర్యలు తీసుకున్నాం. ఇకపై అటువంటి తప్పిదాలు జరగకుండా ఉండేందుకు చర్యలు తీసుకుంటాం.

\- డుంబ్రిగుడ



పర్యాటకులతో 'కొత్తపల్లి' కళకళ

జి.మాడుగుల: మండలంలోని ప్రముఖ పర్యాటక కేంద్రం కొత్తపల్లి జలపాతం పర్యాటకులతో కళకళలాడింది. ఆదివారం సెలవు దినం కావడంతో అధిక సంఖ్యలో పర్యాటకులు చేరుకున్నారు. కొన్ని రోజులుగా వర్షాలు కురుస్తుండడంతో పర్యాటకులు కొంతకాలంగా తగ్గారు. ఆదివారం పర్యాటకులు అధిక సంఖ్యలో జలపాతంలో చేరి ఉత్సాహంగా కేరింతలు కొడుతూ గడిపారు. కుటుంబ సభ్యులతో జలపాతంలో జలకలాడుతూ ఉత్సాహంగా గడిపారు. ఆదివారం సుమారు మూడు వేల మందికి పైగా పర్యాటకులు సందర్శించినట్టు జలపాతం నిర్వాహకులు అభి తెలిపారు. ఇదిలా ఉండగా అటు డుంబ్రిగుడ సమీపంలోని చాపరాయి జలవిహారి వద్దకు పర్యాటకులు ఆదివారం సందడి చేశారు. వారం రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో నీటి ప్రవాహం పర్యాటకులను ఆకర్షిస్తోంది.

నిర్మాణానికి మూడేళ్లు.. ప్రారంభానికి ఇంకెన్నాళ్లు?

గుమ్మకోటలో ప్రారంభానికి ఎదురుచూస్తున్న 'గురుకులం' అదనపు భవనం



ప్రారంభానికి ఎదురుచూస్తున్న అదనపు భవనం



గుమ్మకోట గురుకుల పాఠశాలలో డైనింగ్ హాల్

అనంతగిరిరూరల్: అసలే మండలానికి శివార్లలో ఏర్పాటుచేశారనే అపవాదు, అందులోనూ మలేరియా జోన్‌గా గుర్తింపు ఉన్న గుమ్మకోట గురుకుల పాఠశాలలో వసతి సమస్యతో పదేళ్లుగా ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో మూడేళ్ల క్రితం అదనపు భవనం మంజూరైంది. అలాగే సగంలో వదిలేసిన డైనింగ్ హాలు నిర్మాణానికి నిధులు విడుదలయ్యాయి. మారుమూల ప్రాంతంలో ఈ పాఠశాల ఉండడంతో సుమారు కోటిన్నర విలువ ఉన్న అదనపు పాఠశాల భవన నిర్మాణం గడిచిన మూడేళ్లుగా నత్తనడకన సాగుతూ వస్తుంది. అయితే ఇటీవల ఆ పనులను ఎట్టకేలకు పూర్తి చేశారు. కానీ భవనాన్ని లాంఛనంగా ప్రారంభించకపోవడంతో అలంకార ప్రాయంగా మారింది. అలాగే సగంలో వదిలేసిన డైనింగ్ హాలు నిర్మాణం పూర్తి చేశారు. అధికారికంగా అప్పగించకున్నా అక్కడ ఉన్న వసతి సమస్య దృష్ట్యా దానిని వినియోగంలోకి తీసుకొని వచ్చారు. ఇదే విధంగా నిర్మాణం పూర్తి చేసుకున్న అదనపు భవనాన్ని వెంటనే అందుబాటులోకి తేవాలని విద్యార్థులు కోరుతున్నారు.

ప్రకృతి వ్యవసాయంతో గిరి రైతుల ఆర్థికాభివృద్ధి

పాడేరురూరల్: ప్రకృతి వ్యవసాయంతో గిరి రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నారని వ్యవసాయశాఖ సహాయ సంచాలకుడు పి.శంకర్‌రెడ్డి తెలిపారు. చంద్రన్న రైతు క్షేత్రాలు ఉన్న మినుములూరు, చింతలవీధి, తుంపాడ, కుజ్జెలి, ఇరడాపల్లి పంచాయతీల్లోని రైతులు వరిపొలాల గట్లపై కందులను వేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో చర్యలు చేపట్టామన్నారు. ప్రకృతి వ్యవసాయం (జడ్‌బీఎన్‌ఎఫ్) చేపట్టే వంట్లమామిడి, వంజంగి, తుంపాడ, డి.గొందూరు పంచాయతీలకు చెందిన నాలుగు క్లస్టర్లకు చెందిన 17 గ్రామాల్లో రైతులకు కందులను ఉచితంగా పంపిణీ చేశామన్నారు.

యండపల్లివలసలో రహదారులు బురదమయం

సిమెంట్ రోడ్లు వేయాలని స్థానికుల వినతి



బురదమయంగా మారిన యండపల్లివలస గ్రామంలో ఒక రహదారి

అరకురూరల్: మండలంలోని మేజర్ పంచాయతీ పద్మాపురం పరిధిలో ఉన్న యండపల్లివలస గ్రామంలో వీధిరోడ్లు బురదమయంగా మారాయి. సీసీ రోడ్లు లేక గ్రామస్థులు రాకపోకలు సాగించేందుకు నానా ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని అన్ని పంచాయతీల కేంద్రాలకు, మారుమూల గ్రామాలకు సైతం సీసీ రోడ్లు నిర్మాణాలు చేస్తున్నా, మేనేజర్ పంచాయతీ పరిధిలో గ్రామంలో సీసీ రోడ్లు నిర్మాణాలు జరగకపోవడం పాలకుల నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది. సీసీ రోడ్లు లేకపోవడంతో వర్షాకాలంలో రోడ్లన్నీ బురదమయంగా తయారవుతున్నాయి. రాకపోకలకు నానా అవస్థలు ఎదుర్కోవాల్సి వస్తుందని గ్రామస్థులు వాపోతున్నారు. ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు స్పందించి గ్రామంలో సీసీ రోడ్లు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.


ఇనుప ఊచలు కనబడుతున్న బిల్లాపుట్టు వంతెన


ప్రమాదకరంగా మారిన కురిడి సమీప బ్రిడ్జి

అరకు-పాడేరు రహదారిలో వంతెనలు శిథిలం

పట్టించుకోని ఆర్ అండ్ బీ అధికారులు ● ప్రమాదర పరిస్థితిలో వాహనచోదకుల రాకపోకలు

డుంబ్రిగుడ: అరకు- పాడేరు ఆర్‌అండ్‌బీ ప్రధాన రహదారిలో మండల పరిధిలోని వంతెనలు ప్రమాదాలకు నిలయంగా మారాయి. శిథిలమై కూలిపోవటానికి సిద్ధంగా ఉన్నాయి. అయినా ఆర్‌అండ్‌బీ అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రజల భయం భయంగా రాకపోకలు సాగిస్తున్నారు. మండల పరిధిలోని కురిడి రైల్వేగేట్ సమీపంలో ఉన్న పెద్ద బ్రిడ్జి నిర్మాణం జరిగి సుమారు 40 ఏళ్లు కావస్తోంది. కానీ నిర్మాణం అయినప్పటి నుంచి నేటికీ ఒక్కసారి కూడా మరమ్మతులకు నోచుకోలేదు. వంతెన అడుగుభాగంలో పెచ్చులు ఊడిపోయి, పిల్లర్లకు పగుళ్లు వచ్చి, పక్కగోడలు పడిపోయి శిథిలమై పోయాయి. 2004వ సంవత్సరంలో అర్జున్ చిత్రం షూటింగ్ చిత్రీకరించారు.

అప్పుడు చిత్రం యూనిట్ ఈ వంతెనను కొంత మేరకు మరమ్మతులు చేసి రంగులు వేశారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు రంగులు, మరమ్మతులకు నోచుకొలేదు. ఈ ప్రాంతంలో సినిమాలు షూటింగ్ నిర్వహిస్తున్నారంటే ఈ వంతెనపై చిన్న సన్నివేశమైనా చిత్రీకరిస్తారు. అలాగే నారింజవలస సమీపంలో ఉన్న మరో వంతెన అందుబాటులోకి వచ్చి పదేళ్లు కూడా గడవక ముందే ఈ వంతెన అడుగుభాగంలో నిర్మితమై ఉన్న రక్షణగోడ చానెల్స్ గత హుద్‌హుద్ తుఫాన్‌కు, 2015లో సంభవించిన మరో తుఫాన్ కారణంగా పడిపోయి ప్రమాదకరంగా మారాయి. అంత్రిగుడ సమీపంలో ఉన్న బ్రిడ్జి పక్క గోడలు పడిపోయాయి. బిల్లాపుట్టు గ్రామ సమీపంలో ఉన్న రెండు బ్రిడ్జిలకు పక్క గోడలు లేవు. అడుగు భాగంలో శిథిలమై ప్రమాదంగా ఉన్నాయి. కించుమండలోని సంతబయలులో ఉన్న బ్రిడ్జి కూలిపోవడానికి సిద్ధంగా ఉంది. ప్రధాన రహదారి కావడం, పర్యాటక ప్రాంతం కావడంతో ఈ రహదారిలో నిత్యం బస్సులు, ప్రైవేటు వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. పర్యవేక్షణ లేక వంతెనలు కూలిపోవటానికి సిద్ధంగా ఉన్నా ఆర్ అండ్ బీ అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు విన్పిస్తున్నాయి. ప్రధాన రహదారి కావడంతోపాటు రోడ్డు నిర్మాణం జరిగినప్పుడు 1980 మధ్య కాలంలో నిర్మించిన బ్రిడ్జిలు కావడంతో ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తోందో తెలియని పరిస్థితి నెలకొంది. అరకు-పాడేరు ప్రధాన రహదారిలో ఉన్న వంతెనలను మరమ్మతులకు అధికారులు ఇప్పటి వరకు ప్రతిపాదనలు ఎందుకు పంపించ లేదో అర్థం అవ్వడం లేదని డుంబ్రిగుడ మండల వాసులు వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రధాన రహదారితో పాటు మారుమూల ప్రాంతల కాజ్‌వేలను బాగు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.


పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్న అంత్రిగుడ వంతెన

ఉపాధి బకాయి తక్షణమే చెల్లించాలి

● ప్రభుత్వానికి గిరిజన సంఘం డిమాండ్

డుంబ్రిగుడ: మండలంలోని 18 పంచాయతీల్లో 2016- 2017లో పనులు చేసిన ఉపాధి కూలీలకు బకాయి రూ. 2.50కోట్లు తక్షణమే చెల్లించాలని కోరుతూ గిరిజన సంఘం మండల కార్యదర్శి టి.సూర్యనారాయణ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఆదివారం మాట్లాడుతూ, గిరిజన ఉపాధి కూలీలకు ప్రభుత్వం మోసగించడం దారుణమని ఆరోపించారు. పని చేసిన కూలీలకు బకాయి చెల్లించి గిరిజన గ్రామాల్లో స్వచ్ఛభారత్ పేరుతో నిర్మించిన ఇంకుడు గుంతలకు రూ.3 వేలు చెల్లిస్తామని గుంతలు తవ్వించి బకాయి ఇవ్వలేదని అన్నారు. 9 పంచాయతీ పరిధిలో గల ఉపాధి కూలీలకు బ్యాంకు ఖాతా ద్వారా పంపిణీ విధానం రద్దు చేసి గ్రామ పంచాయతీ తపాలా శాఖ ద్వారా గ్రామాలకు పంపిణీ చేస్తామని అధికారులు అన్నారని నేటికీ అమలు జరపలేదని అన్నారు. 150 రోజులు ఉపాధి పని దినాలు తక్షణమే 200 రోజులకు మార్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకుల సత్యనారాయణ ఉన్నారు.

చాపరాయిలో సందడే సందడి


చాపరాయిలో పర్యాటకులు

డుంబ్రిగుడ: మండలంలోని ప్రముఖ పర్యాటక కేంద్రం చాపరాయి జలవిహారిలో ఆదివారం పర్యాటకులతో సందడి వాతావరణం నెలకొంది. గత వారం రోజులుగా భారీగా వర్షాలు కురుస్తుండటంతో పైనుంచి వరదనీరు చాపరాయిలో చేరి బురదగా ఉన్నా... పర్యాటకులకు వింతగా ఉండటంతో అందులో దిగి జలకాలాడుతూ ఉత్సాహంగా గడిపారు. మరికొంత మంది పర్యాటకులు కుటుంబాలతో సహా ఫోటోలు దిగుతూ పరవశించిపోయారు. ఆదివారం కొద్దిపాటి వర్షం పడటంతో పర్యాటకులకు ఎటువంటి ఆటంకం కలగలేదు. ఇదే సమయంలో బ్యాంబో చికెన్‌కు, చికెన్ కబాబ్‌కు విపరీతంగా డిమాండ్ ఏర్పడింది.

అనారోగ్యంతో యువకుడి మృతి

● స్వస్థలం కొశిగూడ

విశాఖపట్నం : అనారోగ్యంతో అరకు మండలానికి చెందిన వ్యక్తి నగరంలో మృతిచెందాడు. వివరాలిలా వున్నాయి...అరకు మండలం కొశిగూడ గ్రామానికి చెందిన పెదకాపు డేనియల్ (23) నగరంలోని ఒక హోటల్‌లో పనిచేస్తున్నాడు. మరో ఇద్దరి యువకులతో కలిసి సింగ్ హోటల్ జంక్షన్ సమీపంలోని మేడ మీద గదిలో అద్దెకు ఉంటున్నాడు. అతడితో పాటు ఉండే ఇద్దరు యువకులు ఆదివారం ఉద్యోగానికి వెళ్లిపోయారు. మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో డేనియల్ మెట్ల మీద అపస్మారక స్థితిలో పడి ఉండడాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. రెండో పట్టణ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించగా, డేనియల్ అప్పటికే మృతిచెంది ఉన్నాడు. మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు. కాగా అతడు కొద్ది రోజులుగా పచ్చకామెర్లతో పాటు జ్వరంతో బాధ పడుతున్నాడని అతడి సహచరులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

జంగిల్ కటింగ్ చేపట్టాలని డిమాండ్

జోలాపుట్టు, సంగడ, పెదబయలు మార్గంలో పిచ్చిమొక్కలు


సంగడ ప్రధాన రహదారి ఇరువైపులా పెరిగిపోయిన పిచ్చి మొక్కలు

ముంచంగిపుట్టు: మండల కేంద్రం నుంచి జోలాపుట్టు, సంగడ, పెదబయలు, పెదగూడ, కుమడ వెళ్లే ప్రధాన రహదారులు ఇరువైపుల పిచ్చిమొక్కలు పెరిగిపోయాయి. రహదారులు ఇరువైపులా ఎక్కడ పడితే అక్కడు గుబురుగా పిచ్చిమొక్కలు పెరగడంతో అటుగా వాహన రాకపోకలు సాగించేందుకు వాహన చోదకుల అవస్థలు పడుతున్నారు. అధికారులు జంగిల్ కటింగ్ చేపట్టాలని మండల వారులు డిమాండ్ చేస్తున్నారు. ప్రధాన రహదారులు ఇరువైపులా పిచ్చిమొక్కలు ఎత్తుగా పెరగడంతో రాకపోకలు సాగించేందుకు ఇబ్బందిగా ఉంటుందని వాహన చోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదభరిత మలుపులకు తోడు రహదారి పొడుగునా పిచ్చిమొక్కలు పెరగడంతో వానాలను నడిపేందుకు కష్టసాధ్యంగా ఉంటుందని, అలాగే పిచ్చిమొక్కలు ఎత్తుగా గుబురుగా పెరగడంతో ఎదురెదురుగా వాహనాలు దగ్గరపడితే గాని గుర్తించలేని పరిస్థితి నెలకొందని దీంతో పలు సందర్భాల్లో ప్రమాదాలకు గురవుతున్నామని వాహన డ్రైవర్లు వాపోతున్నారు. ప్రధాన రహదారులు ఇరువైపులా ఎప్పటికప్పుడు జంగిల్ కటింగ్ చేపట్టాల్సి ఉండగా అధికారులు ఆ దిశగా కనీసం దృష్టిశారించడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. మూడేళ్లకో నాలుగేళ్లకో ఒకసారి అక్కడక్కడ రహదారి పక్కన మొలిచిన పిచ్చిమొక్కలను తొలగిస్తూ అధికారులు చేతులు దులుపుకుంటున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. అధికారులు స్పందించి పెను ప్రమాదాలు జరగకముందే ప్రధాన రహదారులపై జంగిల్‌కటింగ్ జరిగే విధంగా తగు చర్యలు చేపట్టాలని మండల వాసులు డిమాండ్ చేస్తున్నారు.

స్టూడెంట్ కోఫోఖాన్ శిక్షణకు 83 మంది హాజరు


కోఫోఖాన్ కరాటే శిక్షణలో పాల్గొన్న విద్యార్థులు

పాడేరురూరల్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో ఆదివారం నిర్వహించిన ఇంటర్ నేషనల్ స్టూడెంట్ కోఫోఖాన్ కరాటే శిక్షణ కార్యక్రమానికి ఏజెన్సీ మండలాలకు చెందిన 83 మంది విద్యార్థులు హాజరయ్యారని కరాటే క్లబ్ ఇనస్ట్రక్టర్ వెలుసూరి అప్పన్న తెలిపారు. ఆదివారం ఏర్పాటు చేసిన ఈ శిక్షణ తరగతికి ముఖ్య అతిథిగా నేషనల్ కరాటే ఇనస్ట్రక్టర్ బాకూరు పాండురాజు హాజరయ్యారు. బ్లాక్‌బెల్టు సాధించిన విద్యార్థులకు సూచనలు అందించారు. అనంతరం జూనియర్ విద్యార్థులకు ప్రాథమిక కరాటే, స్కోరింగ్ పోటీలను నిర్వహించారు. ఆ పోటీల్లో ప్రతిభను కనపరిచిన 11 మంది విద్యార్థులను ఎంపికచేశారు.

రాజ్‌మా రైతుకి ఊరట

గూడెంకొత్తవీధి

ఏజెన్సీలో రాజ్‌మా పంటను సాగు చేసే రైతులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త ప్రకటించింది. నాలుగేళ్ల నుంచి రాజ్‌మా విత్తనాల పంపిణీ నిలిచిపోగా, ముఖ్యమంత్రి చంద్రబాబు చొరవతో ఈ ఏడాది రైతులకు రాయితీపై నాణ్యమైన విత్తనాలను పంపిణీ చేసేందుకు వ్యవసాయశాఖ ముందుకొచ్చింది. చింతపల్లి రెడ్ రకం విత్తనాలు 1,200 క్వింటాళ్లు అందుబాటులో వున్నాయని, 25 శాతం సబ్సిడీపై అందజేస్తామని అధికారులు తెలిపారు.



జీకే వీధి చేరుకున్న రాజ్‌మా విత్తనాలు

ఏజెన్సీలో పదేళ్ల కిందట 35 వేల ఎకరాల్లో గిరిజన రైతులు రాజ్‌మాను సాగు చేసేవారు. అయితే నాణ్యమైన విత్తనాలు లభ్యం కాకపోవడం, ప్రభుత్వం సరఫరా చేయకపోవడంతోపాటు తెగుళ్ల బెడద కారణంతో నాలుగేళ్ల నుంచి 25 వేల ఎకరాల్లో మాత్రమే సాగుచేస్తున్నారు. మొత్తం సాగు విస్తీర్ణంలో సగం చింతపల్లి, జీకే వీధి మండలాల్లోనే వుంది. జీకేవీధి మండలంలో ఎనిమిది వేలు, చింతపల్లిలో 7,500 ఎకరాల్లో రాజ్‌మాను సాగు చేస్తున్నారు. రాజ్‌మా ఉత్తర భారత దేశానికి చెందిన పంట అయినప్పటికీ, విశాఖ ఏజెన్సీలో వాతావరణం అనుకూలంగా వుండడంతో సుమారు 25 ఏళ్ల నుంచి సాగు చేస్తున్నారు. ఢిల్లీ మార్కెట్‌లో విశాఖ ఏజెన్సీ రాజ్‌మాకు గిరాకీ ఎక్కువ. మన్యంలో గిరిజన రైతులు పండించిన రాజ్‌మాను నర్సీపట్నానికి చెందిన వ్యాపారులు కొనుగోలు చేసి, ఢిల్లీకి ఎగుమతి చేస్తుంటారు. కాగా మూడేళ్ల నుంచి నాణ్యమైన విత్తనం అందుబాటులో లేకపోవడంతో రాజ్‌మా సాగు, దిగుబడి తగ్గిపోయాయి. ఈ విషయం ప్రభుత్వం దృష్టికి వెళ్లడంతో ఈ ఏడాది మేలు రకం విత్తనాలను, రాయితీపై అందజేయాలని వ్యవసాయ శాఖను ఆదేశించింది. ఏపీ సీడ్స్ ద్వారా రాజ్‌మా విత్తనాలను పంపిణీ చేయడానికి చర్యలు చేపట్టారు.

అందుబాటులో చింతపల్లి రెడ్ రకం

గిరిజన రైతులకు నాణ్యమైన రాజ్‌మా విత్తనాలను పంపిణీ చేయడానికి వ్యవసాయ శాఖ ఏర్పాట్లు చేసింది. ఈ ప్రాంతానికి అనువైన చింతపల్లి రెడ్ రకాన్ని ఏపీ సీడ్స్ అధికారులు పాడేరు ఐటీడీఏకి పంపించారు. ఈ ఏడాది 25వేల ఎకరాల్లో రాజ్‌మాను సాగుచేపట్టాలని వ్యవసాయ అధికారులు ప్రతిపాదనలు పంపడంతో ఏపీ సీడ్స్ అధికారులు ఆ మేరకు 1,200 క్వింటాళ్ల విత్తనాలను సరఫరా చేశారు. విత్తనాలను అన్ని మండలాల వ్యవసాయ శాఖ కార్యాలయాలకు పంపించారు.

25 శాతం రాయితీపై పంపిణీ

చింతపల్లి రెడ్ రకం రాజ్‌మా విత్తనాలు కిలో రూ.83 కాగా, 25 శాతం రాయితీపై గిరిజన రైతులకు అందజేస్తారు. అయితే మరో 25 శాతం రాయితీ ఇవ్వాలని వ్యవసాయ శాఖ అధికారులు ఐటీడీఏకి నివేదిక పంపించారు. ఐటీడీఏ అధికారులు గ్రీన్ సిగ్నల్ ఇస్తే, రైతులు 50 శాతం రాయితీపై విత్తనాలను పొందవచ్చు..

చింతపల్లి, జీకేవీధి మండలాలకి 685 క్వింటాళ్లు

చింతపల్లి, జీకేవీధి మండలాల్లో రాజ్‌మా పంటను 15 వేల ఎకరాల్లో సాగుచేస్తున్నారు. వ్యవసాయ శాఖ అధికారులు ఈ రెండు మండలాలకు సంహభాగం కేటాయించారు. చింతపల్లికి 310 క్వింటాళ్లు, జీకేవీధికి 375 క్వింటాళ్లు మంజూరు చేశారు.

చాలా సంతోషంగావుంది

కొండబాల బాలరాజు, రైతు, గొందిపల్లి



రాజ్‌మా విత్తనాలను వ్యవసాయ శాఖ పంపిణీ చేయడం చాలా సంతోషం. నాణ్యమైన, అధిక దిగుబడి ఇచ్చే విత్తనాలు అందుబాటులో లేక రాజ్‌మా సాగును పూర్తిగా తగ్గించాను. కేవలం ఇంటి అవసరాలకు మాత్రమే రెండేళ్ల నుంచి సాగుచేస్తున్నాం. చింతపల్లి రెడ్ రకంతోపాటు తెలుపు రకం రాజ్‌మా విత్తనాలను కూడా పంపిణీ చేస్తే బాగుంటుంది.

23వ తేదీ నుంచి విత్తనాల పంపిణీ

ఎం.నవీన్ జ్ఞానమణి, ఏడీఏ, చింతపల్లి

రాజ్‌మా విత్తనాలను ఈ నెల 23వ తేదీ నుంచి అన్ని వ్యవసాయ కార్యాలయాల్లో పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. ప్రభుత్వం ఇప్పటికే 25 శాతం రాయితీ ప్రకటించింది. మరో 25 శాతం రాయితీపై ఐటీడీఏ నుంచి ఉత్తర్వులు రావాల్సివుంది. రైతులు పట్టాదారు పాస్‌పుస్తకం, ఆధార్ కార్డులను వ్యవసాయ కార్యాలయానికి తీసుకొచ్చి విత్తనాలు పొందవచ్చు. ఎకరానికి 25 కిలోలు విత్తనం పంపిణీ చేస్తాం.

రొయ్యల చెరువులతో రోగాలు





వంతెన కూలిపోవడంతో కలుషిత నీటిలో నుంచి పంపా వరద కాలువను దాటుతున్న స్థానికులు

పాయకరావుపేట, ఆగస్టు 20: మండలంలోని పాల్మన్‌పేట పంచాయతీ పరిధిలో ఉన్న రొయ్యల చెరువుల నుంచి వెలువడే వ్యర్థాలు, విషపూరితమైన రసాయనాల వల్ల పక్కనే ఉన్న రత్నయమ్మపేట గ్రామస్థులు రోగాలబారిన పడుతున్నారు. వ్యర్థాలతో పంపా కాలువ కలుషితమై, మత్స్య సంపద తగ్గిపోయి కుమారపురం, రత్నయమ్మపేట గ్రామాలకు చెందిన మత్స్యకారులు ఉపాధి కోల్పోయారు. పంపా కాలువపై వంతెనలేకపోవడంతో రసాయనాలతో నిండిన నీటిలోనే ప్రజలు రాకపోకలు సాగిస్తూ, చర్మ సంబంధ వ్యాధులకు గురవుతున్నారు. మనుషులే కాకుండా పశువులు, మూగజీవాలు కూడా వ్యాధులబారిన పడుతున్నాయి.

పాయకరావుపేట మండలంలోని తీరప్రాంతంలో రొయ్యల చెరువులు, హేచరీలను విచ్చలవిడిగా ఏర్పాటు చేశారు. వీటిలో కొద్దివాటికి మాత్రమే అనుమతులు వున్నాయి. రొయ్యల చెరువులు, హేచరీల నిర్వాహకులు నిబంధనలను గాలికొదిలేయడంతో చుట్టుపక్కల గ్రామాల ప్రజలు కాలుష్యంతో ఇబ్బంది పడుతున్నారు. ముఖ్యంగా పాల్మన్‌పేట పంచాయతీలో సుమారు వంద ఎకరాల్లో రొయ్యల చెరువులను ఏర్పాటు చేసిన ఓ కంపెనీ యాజమాన్యం, వాటి నుంచి విడుదయ్యే వర్థ జలాలు, వ్యర్థ రసాయనాలను పైపుల ద్వారా సముద్రంలోకి పంపకుండా పక్కనే ఉన్న పంపా వరద కాలువలోకి శుద్ధిచేయకుండానే వదిలేస్తున్నారు. దీంతో కాలువలో నీరు కలుషితమై, మత్స్య సంపద నాశనం అవుతున్నది. ఫలితంగా కుమారపురం, రత్నయమ్మపేట గ్రామాలకు చెందిన మత్స్యకారులు జీవనోపాధి కోల్పోతున్నారు. పంపా కాలువను ఆనుకుని ఉన్న వ్యవసాయ భూముల్లోని సరుగుడు తోటల ఎదుగుదల మందగించింది. జీడిమామిడి తోటల్లో కాపు నిలబడక, దిగుబడి తగ్గిపోతున్నది. రత్నయమ్మపేట వద్ద పంపా వరద కాలువపై గతంలో నిర్మించిన వంతెన రెండేళ్ల క్రితం కూలిపోవడంతో ఈ రెండు గ్రామాల ప్రజలు పంపా కాలువలో రసాయన వ్యర్థాలు వున్న కలుషిత నీటిలో నుంచి రాకపోకలు సాగిస్తున్నారు. వీరి కాళ్లు, చేతులకు పుళ్లు ఏర్పడ్డాయి. గేదెలు, ఆవులు, మేకల కాళ్లు వాచిపోతున్నాయి.

ఎదుగుదల లేని సరుగుడు తోట



చేపలు తగ్గిపోవడంతో ఉపాధి కోల్పోయాం

శీలం నూకరాజు, మత్స్యకారుడు, రత్నయమ్మపేట



రొయ్యల చెరువుల కారణంగా పంపా కాలువలో నీరు కలుషితమై మత్స్య సంపద తగ్గిపోయింది. దీంతో చాలా మంది మత్స్యకారులు ఉపాధి కోల్పోయారు. సముద్రంలో చేపల వేటకు పంపా కాలువలోని కలుషిత నీటిలో నుంచి వెళ్లాల్సి రావడంతో శరీరం దురదపుట్టి, పుళ్లు ఏర్పడుతున్నాయి.

రొయ్యల చెరువుల నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలి

కాలపురెడ్డి వరహాలరావు, రైతు, కుమారపురం



రొయ్యల చెరువులు, హెచరీల నుంచి కలుషిత జలాలను నేరుగా పంపా కాలువలోకి విడిచిపెడుతున్నారు. దీనివల్ల పక్కనే వున్న సరుగుడు, జీడిమామిడి తోటలకు నష్టం వాటిల్లుతున్నది. పొలాలకు వెళ్లాలంటే కాలువలో దిగాలి. దీంతో కాళ్లు దురదలు పుడుతున్నాయి. రొయ్యల చెరువుల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలి.

భూగర్భ జలాలు ఉప్పగా మారిపోయాయి

బి.వెంకటలక్ష్మి, రత్నయమ్మపేట



రొయ్యల చెరువులు ఏర్పాటు చేయకముందు గ్రామంలోనే మంచినీరు లభించేది. ఇప్పుడు రొయ్యల చెరువుల కారణంగా భూగర్భ జలాలు ఉప్పగా మారిపోయి తాగడానికి పనికిరావడంలేదు. దీంతో తాగునీటి కోసం రోజూ పంపా కాలువ దాటి వెళ్లాలి. రసాయనాలతో కూడిన కలుషితమైన నీటిలో రాకపోకలు సాగిస్తుండడం వల్ల కాళ్లు, చేతులు దురదపుడుతున్నాయి.

పశువులు, మేకల కాళ్లకు వాపులొస్తున్నాయి

చేపల గురువులు, రత్నయమ్మపేట



మేత కోసం మేకలను పంపా కాలువ ఆవలివైపునకు తోలుకెళతాం. మధ్యలో వంతెన కూలిపోవడంతో నీళ్లలో నుంచే రాకపోకలు సాగిస్తున్నాం. మేకల కాళ్లు వాచిపోయి నడవలేకపోతున్నాయి. పశువుల కాళ్లకు కురుపులు వస్తున్నాయి. అధికారులు స్పందించి పంపా కాలువలోకి వ్యర్థ జలాలు విడుదల చేయకుండా చర్యలు చేపట్టాలి.

అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయాలి

'బస్సు యాత్ర' సభలో సంఘం గౌరవ అధ్యక్షుడు ముప్పాళ్ల నాగేశ్వరరావు

విశాఖపట్నం: అగ్రిగోల్డ్ బాధితుల రాష్ట్ర వ్యాప్త చైతన్య యాత్రకు తరలిరావాలని గౌరవ అధ్యక్షుడు ముప్పాళ్ల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. ఆదివారం సాయంత్రం జీవీఎంసీ ఎదురుగా ఉన్న గాంధీ విగ్రహం వద్ద బస్సు యాత్ర సభ నిర్వహించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ అగ్రిగోల్డ్ బాధితుల ఆత్మహత్యలను నివారించాలన్నారు. మరణించినవారికి ఎక్స్‌గ్రేషియా చెల్లించాలన్నారు. అగ్రిగోల్డ్ దొంగలను అరెస్టు చేసి వారి వ్యక్తిగత బినామీల పేరు మీద ఉన్న ఆస్తులను అటాచ్ చేయాలని డిమాండ్ చేశారు. 2017 మర్చి 6 నుంచి 23 వరకు ఆమరణ దీక్షలు చేపట్టామని గుర్తు చేశారు. అగ్రిగోల్డ్ బాధితుల్లో మరణించినవారికి ఎక్స్‌గ్రేషియా ప్రకటించి నాలుగు మాసాలైనా ఇప్పటికీ చెల్లంచలేదన్నారు. సంఘం అధ్యక్షుడు బి.విశ్వనాథరెడ్డి మాట్లాడుతూ 120 రోజుల్లో డిపాజిట్ల చెల్లింపులు ప్రారంభిస్తామని ప్రభుత్వం చెప్పిన మాటకు విలువ లేకుండాపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. అగ్రిగోల్డ్ చీలక డైరెక్టర్ అవ్వా సీతారామారావు తదితరులను ఇంతవరకు అరెస్టు చేయకపోవడం సరికాదన్నారు. బాధితులకు న్యాయం చేయాలని ధర్మాసనం ఆదేశించినా ఇప్పటికీ న్యాయం జరగలేదన్నారు. కార్యదర్శి వి.తిరుపతిరావు, సీపీఐ నేత పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

న్యూరాలజీ చికిత్సలో విప్లవాత్మక మార్పులు

ఎన్‌టీఆర్ హెల్త్ వర్సిటీ వీసీ రవిరాజ్

విశాఖపట్నం: న్యూరాలజీ చికిత్సా విధానంలో విప్లవాత్మక మార్పులు వచ్చాయని ఎన్‌టీఆర్ హెల్త్ వర్సిటీ వీసీ టి.రవిరాజ్ అన్నారు. ఆదివారం నగరంలో 'న్యూరో విజన్-2017' పేరుతో వైద్యుల సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన రవిరాజ్ మాట్లాడుతూ ప్రస్తుతం వయసుతో సంబంధం లేకుండా నరాల సంబంధ వ్యాధులు ఎక్కువగా వస్తున్నాయని అన్నారు. అమెరికా వంటి దేశాలతో పోల్చితే మన దేశంలో న్యూరాలజీ విభాగం వైద్యులు ఒక్కశాతం కూడా లేరని అన్నారు. అందువల్ల జనరల్ ఫిజీషియన్ వైద్యులకు, వైద్య విద్యార్థులు న్యూరాలజీ చికిత్సా విధానాలపై తర్ఫీదు ఇస్తున్నామన్నారు. వైద్యులకు వైద్య సదస్సులతో ఎంతో మేలు చేకూరుతుందని అన్నారు. నూతన చికిత్సా విధానాలను వైద్యులు ఎప్పటికప్పుడు తెలుసుకోవాలన్నారు. వైద్య విద్య అభ్యసించే వారు ఇటువంటి సదస్సుల్లో తప్పనిసరిగా పాల్గొనేలా మెడికల్ కౌన్సిల్ కూడా సూచిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ వైద్యులు సత్యనారాయణ. వేలుమురుగేంద్రన్, ఓఆర్‌వీ నారాయాణ తదితరులు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న వీసీ రవిరాజ్

రెవెన్యూ విభాగంలో ప్రభుత్వం వినూత్న మార్పులు

పావు గంటలో పాసు పుస్తకం


ఈ-పట్టాదారు పుస్తకాలన్ని అందిస్తున్న తహసీల్దార్(ఫైల్)

- పట్టాదారు పాసు పుస్తకాలు పొందడం సులభతరం
- మీ సేవా కేంద్రాల్లోనే ప్రింటింగ్
- అత్యవసర సమయాల్లో రైతులకు ప్రయోజనం
- రూ.25, రూ.35కే టైటిల్ డీడ్, పట్టాదారు పుస్తకాలు

రోలుగుంట : రైతు కష్టాలను తీర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం వినూత్న మార్పులు తీసుకువస్తోంది. ప్రధానంగా రెవెన్యూ శాఖ ప్రక్షాళనకు నిరంతరం పరిశోధనలు చేస్తూ తద్వారా రైతులకు సులభంగా పట్టాదారు పాసు పుస్తకాలు అందించేందుకు ఏర్పాట్లు చేసింది. ఇప్పటికే 95 శాతం సేవలను ఆన్‌లైన్ చేసి మీ సేవా కేంద్రాల ద్వారా అందిస్తోంది. గతంలో పట్టాదారు పాసుపుస్తకాలు పొందాలంటే నెలలు తరబడి వేచి చూడాల్సిన పరిస్థితి. రెవెన్యూ కార్యాలయాల చుట్టూ, అధికారుల చుట్టూ తిరగాల్సి వచ్చేది. ప్రస్తుతం నూతన విధానంలో పట్టాదారు పాసుపుస్తకాలను అందించేందుకు శ్రీకారం చుట్టింది.

బోగస్ పట్టాదారు పుస్తకాలకు అడ్డుకట్ట

బోగస్ పట్టాదారు పుస్తకాలకు అడ్డుకట్ట వేసేందుకు రాష్ట్ర ప్రభత్వం ప్రవేశపెట్టిన ఈ-పట్టాదారు పాసుపుస్తకం మంజూరు ప్రక్రియ మరింత వేగవంతం చేశారు. దరఖాస్తు చేసిన గడువు లోపే రైతులకు వీటిని అందిస్తున్నారు. గతంలో రైతులు సాగు భూమికి సంబంధించిన పాసు పుస్తకాలను పొందాలంటే అన్నదాతలు పడిన కష్టాలు వర్ణనాతీతం. సొంత భూమికి సంబంధించిన హక్కు పత్రాలను పొందాలంటే అవస్థలు పడేవారు. వీటన్నింటినీ అధిగమించేందుకు రైతులు ఇబ్బంది పడకుండా ఉండేందుకు మీసేవా కేంద్రాల ద్వారా పావు గంటలో పాసుపు స్తకం జారీ ప్రక్రియను వేగవంతం చేశారు. రెవెన్యూ అధికారులు ఆమోదం తెలిపిన వెంటనే మీసేవా కేంద్రాల ద్వారా రైతలు క్షణాల్లో ప్రింట్ తీసుకోవచ్చు. జిల్లా వ్యాప్తంగా 5,55483 మంది పట్టాదారులు ఉండగా, ఇందులో 17,62108 సర్వే నెంబర్‌లు,సబ్ డివిజన్‌లు ఉన్నాయి.

ఆధార్‌తో అనుసంధానం

రైతుల భూమి వివరాలు అతని ఆధార్‌తో అనుసంధానం చేశారు. పాసు పుస్తకాలు కావాల్సిన రైతులు సమీప మీ సేవా కేంద్రాలకు వెళ్లి అక్కడ ఆధార్ నెంబర్‌ను చెప్పి బయెమెట్రిక్ ద్వారా వేలి ముద్రలు తీసుకుంటారు. ఆధార్‌కు తప్పసరిగ్గా మొబైల్ నెంబర్ అనుసంధానం అయి ఉండాలి. మీ సేవాలో మొదట జిల్లా, మండలం, గ్రామం, ఖాతా నెంబర్, చరవాణి నెంబర్ నమోదు చేస్తారు. నమోదు జరిగిన వెంటనే చరవాణికి ఓటీపీ వస్తుంది. ఓటీపీ నమోదు చేయగానే పత్రాలు ప్రింట్ రూపంలో లభ్యమవుతాయి. 15 నిమిషాల్లో భూమి హక్కు పత్రాలు లభ్యమవుతాయి. రైతుల చేయాల్సిందల్లా వేలిముద్ర వేస్తే సరిపోతుంది. బార్‌కోడ్‌తో ధ్రువపత్రాలు అందుతాయి. రైతులు మీ సేవాలో సంప్రదిస్తే రైతు బయోమెట్రిక్ అథంటికేషన్ తీసుకుని దాని ద్వారా వెబ్‌ల్యాండ్ ద్వారా ల్యాండ్ రికార్డు వాలిడేషన్ మీ సేవా ఆపరేటర్ అథంటికేషన్, యూనిక్ ఇ-పట్టాదారు పాసుపుస్తకం నెంబర్, క్యూఆర్ కోడ్, తహసీల్దార్ డిజిటల్ సిగ్నేచర్, ఐపీ అడ్రస్, తేదీ, సమయం వంటి వివరాలను జోడించి పుస్తకాన్ని పొందాలి.

నకిలీ పుస్తకాలను ఇట్టే పసిగట్టేవచ్చు



భూశోధక్ యాప్

నకిలీ పట్టాదారు పుస్తకాలను అరికట్టేందుకు, గుర్తించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ఒక ప్రత్యేక యాప్‌ను రూపొందించింది. అదే భూశోధక్ యాప్. దీనిని పట్టాదారు పాసుపుస్తకాల కోసంమే తయారు చేశారు. పాసుపుస్తకాల్లో ఉండే క్యూఆర్ కోడ్‌ను ఈ యాప్ ద్వారా స్కాన్ చేస్తే పచ్చరంగు టిక్ వస్తే నిజమైన పుస్తకమని, ఎరు పురంగు మార్కు వస్తే నకిలీ పత్రంగా గుర్తించవచ్చు. రైతుల యొక్క వాస్తవిక పట్టాదారు పుస్తలకాల ప్రస్తుత పరిస్థితిని ఈ యాప్‌ద్వారా తెలుసుకోవచ్చు. ఈ యాప్‌ను గూగుల్ ప్లే స్టోర్ నుంచా డౌన్‌లోడ్ చేసుకోవాలి. రైతులు వివరాలు తప్పనిసరిగ్గా వెబ్‌ల్యాండ్‌లో నమోదు చేసుకోవాలి.

మీ సేవాలో ఖాతాకు అనుసంధానం చేసుకోవచ్చు

రైతుకు చెందిన భూమి ఖాతాకు చరవాణి నెంబర్ అనుసంధానం లేకపోతే మీ సేవా కేంద్రంలో ఆధార్ బయోమెట్రిక్ ద్వారా అనుసంధానం చేసుకునే అవకాశాన్ని కూడా ప్రభుత్వం కల్పించింది. దీని కోసం రైతులు రెవెన్యూ కార్యాలయాలకు వెళ్లనవసరం లేదు.

పాసు పుస్తకాలు పోయినా మళ్లీ తీసుకోవచ్చు

మీ సేవా కేంద్రాల ద్వారా తీసుకున్న పాసుపుస్తకాలు పోయినా మళ్లీ తిరిగి పొందవచ్చు. పట్టాదారు పాసుపుస్తకం, టైటిల్ డీడ్‌లను తక్షణమే తీసుకోవచ్చు. దీనికి రూ.25లు చెల్లిస్తే 24 గంటల్లో ఇస్తారు.

అన్ని వివరాలను జాగ్రత్తగా చూసుకోండి



భూములకు సంబంధించి వివరాలను వెబ్‌ల్యాండ్‌లో సరిగ్గా ఉన్నాయో లేవో రైతులు చూసుకోవాలి. దీనివల్ల రైతులు సులభంగా పట్టాదారు, టైటిల్‌డీడ్‌లను పొందవచ్చు. ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన విధానం రైతులకు ఎంతో శ్రేయస్కరం. ఇప్పటికే ఈ విధానంపై మీ సేవా నిర్వాహకులకు అవగాహన కల్పించాం. ఏ విధంగా రైతుకు అందించాలి, ఏ ఏ నిబంధనలు పాటించాలి తదితర అంశాలపై అవగాహన కల్పించాం

కోరాడ సూర్యారావు, ఆర్డీఓ నర్సీపట్నం

రైతులకు సౌలభ్యంగా ఉంటుంది



ఈ నూతన విధానం వల్ల రైతులు సులభంగా పట్టాదారు పుస్తకాలు పొందవచ్చు. కేవలం పది నిమిషాల్లో వీటిని మీ సేవా కేంద్రాల్లో పొందవచ్చు. కేవలం రూ.25 చెల్లించి తీసుకోవచ్చు. మీ సేవాలో దరఖాస్తు చేసుకున్న వెంటనే మా కార్యాలయంలో పరిశీలించి వెంటనే అమోదిస్తున్నాం

పెంటకోట అప్పలనాయుడు, తహసీల్దార్,రోలుగుంట

వెబ్‌ల్యాండ్‌లో తప్పనిసరిగ్గా నమోదై ఉండాలి



ఈ నూతన విధానంలో పట్టాదారు పుస్తకాలను పొందాలంటే పట్టాదారు వివరాలు వెబ్‌ల్యాండ్‌లో నమోదై ఉండాలి. అప్పుడే మీసేవా ద్వారా తీయడానికి అవకాశముంది. రైతులు తప్పనిసరిగా తమ ఖాతా వివరాలను నమోదు చేసుకోవాలని. అలాగే ఖాతాకు రైతుల చరవాణి నెంబర్‌ను అనుసంధానం చేయాలంటే మీ సేవా కేంద్రాల ద్వారా చేస్తున్నాం. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

జి.ప్రసాద్, మీ సేవా నిర్వాహకుడు, రోలుగుంట

రైతులకు రెండు రూపాల్లో పాసు పుస్తకాలు

ప్రభుత్వం ఏర్పాటు చేసిన నూతన విధానం ద్వారా రైతులకు రెండు రూపాల్లో పట్టాదారు పాసుపుస్తకాలు మీ సేవా కేంద్రాల్లో లభ్యమవుతున్నాయి. రైతు ఫోటోతో కూడిన ఒకే పత్రంగా ఒకటి, పుస్తకం రూపంలో ఒకటి లభ్యమవుతున్నాయి. భూమి హక్కులకు సంబంధించిన పత్రాలు పొందాలంటే మీ సేవాలో రూ.25 చెల్లించాలి. అలాగే పుస్తకం కావాలంటే రూ.135 మీసేవాలో చెల్లించాలి. ఈ రెండు కూడా పట్టాదారు పాసుపుస్త కాలుగానే పరిగణించాలి. ఇవి రెండూ కాకుండా రూ.35లతో మ్యుటేషన్ పత్రం కూడా విడిగా పొందవచ్చు.


కొత్తగా రైతులకు అందిస్తున్న ఈ-పట్టాదారు పుస్తకం

సులభంగా తీసుకుంటున్నాం

గతంలో పట్టాదారు పుస్తకాల కోసం కార్యాలయాల చుట్టూ తిరిగే వాళ్లం. ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన విధానం వల్ల మీ సేవా కేంద్రాల నుంచి సులువుగా పట్టాదారు పుస్తకాలు పొందుతున్నాం. ఈ కొత్త విధానాన్ని తీసుకువచ్చిన ప్రభుత్వానికి అభినందనలు.

వై.చినరాజు,
రైతు, కొవ్వూరు

పవర్ బ్యాంక్ బుక్ చేస్తే బంకమట్టి వచ్చింది

- ఆన్‌లైన్‌లో బుక్ చేసి మోసపోయిన యువకుడు
- ఫోన్ చేస్తే స్విచాఫ్ రావడంతో అవాక్కు


పార్శిల్‌ను విప్పి పవర్ బ్యాంక్‌లో గల బంకమట్టి చూపిస్తున్న బాధితుడు బుజ్జి


పవర్ బ్యాంక్‌లో గల బంకమట్టి

నెహ్రూచౌక్ (అనకాపల్లి) : పట్టణంలోని గూడ్సు రోడ్డు సమీపంలో గల మళ్ల వీధికి చెందిన ఓ యువకునికి ఆన్‌లైన్ ద్వారా వచ్చిన ఓ ప్యాకింగ్ ఆశ్చర్యానికి గురిచేసింది. భీశెట్టి బుజ్జి అనే వ్యక్తి సెల్‌ఫోన్లు, ల్యాప్‌టాప్‌లకు వినియోగించే పవర్ బ్యాంక్ నిమిత్తం ఆన్‌లైన్‌లో నాలుగు రోజుల క్రితం బుక్ చేశాడు. షాపింగ్ సభ వెబ్‌సైట్ నుంచి ఆదివారం ఉదయం అతనికి ఒక పార్శిల్ వచ్చింది. పవర్ బ్యాంక్ ఖరీదు రూ.1049 అని, సర్వీస్ చార్జి రూ.80 అని డెలివరీ బోయ్ చెప్పడంతో సదరు మొత్తాన్ని అతనికి అందజేశాడు. అనంతరం పార్శిల్ విప్పి చూడగా, అందులో పవర్ బ్యాంక్ బదులు బంకమట్టి వచ్చింది. దీంతో అవాక్కయాడు. వెంటనే ఆ వెబ్‌సైట్‌లో పేర్కొన్న కార్యాలయానికి ఫోన్ చేయగా ఆ నంబరు పని చేయలేదు. ఈ విష యం తెలుసుకున్న పలువురు పట్టణవాసులు ఇటువంటి మోసాన్ని చూసి ముక్కున వేలేసుకున్నారు.

కృష్ణుని సేవలో నేనూ తరిస్తా..

అనకాపల్లి మండలం సత్యనారాయణపురం పంచాయతీ పరిధి మూలపేట గోవర్ధనగిరిపై ఓ వానరం ఆదివారం సందడి చేసింది. చేసింది. సాయంత్రం ఐదు గంటల సమయంలో గోవర్ధనగిరిపై ఉన్న కృష్ణుడు విగ్రహం ముందు కూర్చొంది. ఎంత సేపటికీ అది కదల లేదు. ఆలయ కమిటీ సభ్యులతో పాటు పలువురు భక్తులు ఈ దృశ్యాన్ని ఆశ్చర్యంగా చూశారు.

- కొత్తూరు (అనకాపల్లి)


గోవర్ధనగిరిపై కృష్ణుడు విగ్రహం వద్ద కూర్చున్న వానరం


బాగున్న రోడ్డు కన్నా గోతుల విస్తీర్ణమే అధికంగా కనిపిస్తున్న దృశ్యం


తోటకూరపాలెం పాండవుల గుడి సమీపంలో...

చెరువు కాదు... రోడ్డే!

- అత్యంత దారుణంగా రావికమతం-తోటకూరపాలెం రహదారి
- అడుగడుగునా గోతులే
- మరమ్మతు పనులు చేపట్టని ఆర్‌అండ్‌బీ అధికారులు
- నరకప్రాయంగా వాహనచోదకుల పరిస్థితి

రావికమతం: రావికమతం-తోటకూరపాలెం రోడ్డు గతంలో పంచాయతీ శాఖ ఆధీనంలో వుండేది. మట్టిరోడ్డుగా ఉన్న ఈ రహదారిని కాంగ్రెస్ హయాంలో తారురోడ్డుగా అభివృద్ధి చేశారు. పనుల్లో నాణ్యత లోపం వల్ల కొద్ది కాలానికే గోతులు ఏర్పడ్డాయి. రహదారిని పటిష్టంగా పునర్నిర్మించకుండా, ఏటా గోతులను మాత్రం పూడ్చేవారు. గత ఏడాది ఈ రహదారిని ఆర్‌అండ్‌బీ శాఖకు బదలాయించారు. అప్పటి నుంచి ఇంతవరకు నిర్వహణ పనులు చేపట్టలేదు అసలే అంతంత మాత్రంగా వున్న ఈ రహదారి, మరింత అధ్వానంగా తయారైంది. తోటకూరపాలెం-తట్టబంద మధ్య ఆర్టీసీ బస్సు సదుపాయం లేదు. ఒకటీఅరా ఆటోలు నడుస్తుంటాయి. అనకాపల్లి, రావికమతం కళాశాలలకు వెళ్లాలంటే తట్టబంద వరకు సైకిళ్లపై వచ్చి, అక్కడి నుంచి ఆటోలు, ఆర్టీసీ బస్సును ఆశ్రయిస్తున్నారు. దీనివల్ల చాలా మంది ఆడపిల్లలు ఉన్నత విద్యను అభ్యసించలేక, ఇళ్లకే పరిమితం అవుతున్నారు. వెళ్లలేక మధ్యలోనే ఆపివేస్తున్నారు.

సుమారు 40 గ్రామాలకు, 50 వేల మంది జనాభా రాకపోకలకు ఇదే ప్రధాన రహదారి. దీని అభివృద్ధి గురించి అధికారులు పట్టించుకోకపోవడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కనీసం ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు అయినా స్పందించకపోవడం శోచనీయమని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రహదారి పరిస్థితి గురించి ఆర్‌అండ్‌బీ వర్క్ ఇన్‌స్పెక్టర్ దేముడునాయుడును వివరణ కోరగా, ఇటీవల తట్టబంద నుంచి తోటకూరపాలెం వరకు సర్వే చేశామని, గోతులు పూడ్చడానికి అవసరమైన నిధుల కోసం ప్రభుత్వానికి నివేదించామన్నారు.


గుడ్డిప గ్రామం మధ్యలో చెరువును తలపిస్తున్న గొయ్యి


గోతుల వద్ద ఆటోను నెడుతున్న ప్రయాణికులు

ఎన్నికల హామీని నెరవేర్చలేదని ప్రజలు అడుగుతున్నారు

శింబోతు నాయుడు, టీడీపీ మండల కార్యదర్శి, తట్టబంద



రావికమతం-తోటకూరపాలెం రహదారిలో మూడు, నాలుగు సంవత్సరాల నుంచి కనీస మరమ్మతు పనులు చేయలేదు. దీంతో మరింత అధ్వానంగా మారింది. ఎర్రవాయి ప్రాంతానికి చెందిన 40 గ్రామాల ప్రజలు రవాణా విషయంలో నరకం చూస్తున్నారు. ఈ రహదారిని అభివృద్ధి చేయిస్తామని ఎన్నికల ముందు ప్రజలకు హామీ ఇచ్చాం. మూడేళ్లయినా రోడ్డు గురించి పట్టించుకోకపోవడంతో ప్రజలు దుమ్మెత్తిపోస్తున్నారు. కనీసం అంబులెన్స్ కూడా వచ్చే పరిస్థితి లేదు. రహదారిని బాగు చేయించాలని ఎమ్మెల్యే రాజుని పలుమార్లు కోరాం. ఇదిగో అదిగో అంటూ కాలం వెళ్లబుచ్చుతున్నారు. స్థానికులకు సమాధానం చెప్పలేక మేము సతమతం అవుతున్నాం. రహదారిని అత్యవసరంగా అభివృద్ధి చేయకపోతే వచ్చే ఎన్నికల్లో నిర్భయంగా ఓటు అడిగే అర్హతను కోల్పోతాం.

ఎర్రవాయి ప్రాంతంపై చిన్నచూపు

గల్లా రాజేశ్వరరావు, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు, గుడ్డిప



ఎర్రవాయి ప్రాంత ప్రజలంటే పాలకులకు చిన్నచూపు. గ్రామాల్లో అభివృద్ధి పనులు అటుంచి, కనీసం రహదారిని అయినా బాగు చేయించకపోవడం మా దురదృష్టం. గుడ్డిప గ్రామంలో చెరువును తలపించే రీతిలో పెద్ద పెద్ద గోతులు ఏర్పడ్డాయి. వర్షాకాలంలో ఎప్పుడు చూసినా ఈ గోతుల్లో నీరు నిలిచే వుంటుంది. ఒక్క రోజు వర్షం పడితే చాలు, పది రోజుల వరకు గోతుల్లో నీరు వుంటుంది. దీనివల్ల దోమల బెడద అధికమై, గ్రామస్థులు మలేరియా జ్వరాలబారిన పడుతున్నారు. కనీసం గ్రామంలో మధ్యలో వున్న గోతుల్లో అయినా ఎప్పటికప్పుడు నీటిని తోడేలా చర్యలు చేపట్టాలి.

ఆర్మీ ర్యాలీలో పాల్గొనే అభ్యర్థులకు ఉచిత శిక్షణ

విశాఖపట్నం, ఆగస్టు 20, (ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వం, యువజన సర్వీసుల శాఖ అక్టోబర్ ఆరు నుంచి 17వ తేదీ వరకు విజయనగరంలో నిర్వహించనున్న ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీలో పాల్గొనే విద్యార్థులకు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్టు సెట్విజ్ సీఈవో ఎ.సిరి ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి, అర్హతగల అభ్యర్థులను ఎంపిక చేసి ఉచితంగా శిక్షణ ఇస్తామన్నారు. ఈ నెల 31న అనకాపల్లి మునిసిపల్ స్టేడియంలో ఉదయం తొమ్మిది నుంచి డివిజన్‌లోని అన్ని మండలాలకు చెందిన వారికి, సెప్టెంబర్ ఒకటిన నర్సీపట్నం డివిజన్‌లోని అన్ని మండలాలకు, పాడేరు డివిజన్‌లోని కొయ్యూరు, చింతపల్లి, జీకే వీధి, జి.మాడుగుల మండలాలకు చెందినవారికి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో, సెప్టెంబర్ ఆరో తేదీన విశాఖ డివిజన్‌లోని అన్ని మండలాలకు, పాడేరు డివిజన్‌లోని పాడేరు, అరకు, అనంతగిరి, హుకుంపేట, డుంబ్రిగుడ, పెదబయలు, ముంచంగిపుట్టు మండలాలకు చెందిన వారికి ఇందిరా ప్రియదర్శిని మునిసిపల్ స్టేడియంలో ఉదయం తొమ్మిది నుంచి ఎంపిక కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు.



జీవితాన్ని కాచివడపోసిన అనుభవం పెద్దరికానిది. పెద్ద వయసే కాదు పెద్ద మనసూ వారి సొంతం. పిల్లల కోసం, కుటుంబం కోసం రెక్కలు ముక్కలు చేసుకుని వారికో జీవితాన్ని ప్రసాదించాక శేషజీవితం హాయిగా గడిపేయాలనుకునే పండుటాకులకు ఆఖరి రోజులు భారంగా మారుతున్నాయి. ఆశలు పెంచుకున్న వారి ఆసరా కోసం ఎదురు చూడక తప్పని పరిస్థితి. బాధ్యత మరిచి, భారంగా భావించి చాలామంది ప్రబుద్ధులు తల్లిదండ్రుల ఆలనాపాలనను గాలికి వదిలేస్తుండడంతో ముదిమి మీదపడిన వయసులో మనసు గాయపడుతున్నా నోరు మెదపలేని అసహాయత వారిది.



భారంగా ఆఖరి మజిలీ

ఆత్మీయ పలకరింపునకు పండుటాకుల ఎదురు చూపు

- ముదిమి మీదపడే దశలో నిరాదరణ శాపం
- నిర్లక్ష్యం కారణంగా భారంగా జీవితం
- కుటుంబ సభ్యులే పట్టించుకోని వైనం
- ఆసరా కోసం అర్రులు చాస్తున్న ఎందరో
- అందరూ ఉన్నా అనాథల్లా పడిగాపులు
- బాధ్యత మర్చిపోతున్న పిల్లలు
- భారంగా భావిస్తున్న కుటుంబ సభ్యులు

నేడు సీనియర్ సిటిజన్స్ డే




(ఆంధ్రజ్యోతి-విశాఖపట్నం)

పిల్లల బాగు కోసం జీవితాంతం కష్టపడే శ్రామికుడు నాన్న. గోరుముద్దలు తినిపించే వయసు నుంచి ఓ ఇంటివారయ్యే వరకు బిడ్డను కళ్లలో పెట్టుకుని చూసుకునే మనసు తల్లిది. పిల్లల కోసం తమ సర్వస్వం ధారపోసి వారి ఔన్నత్యంకోసం తాము సమిధలుగా మారినా ఆనందంగా స్వీకరించే గొప్పగుణం తల్లిదండ్రులది. అటువంటి తల్లిదండ్రులను కంటిని రెప్ప కాపాడుకునేలా కాపాడుకోవాల్సిన పిల్లలు రెక్కలు రాగానే ఎగిరిపోయి వారిని అనాథలు చేస్తున్నారు. కొందరు అనాథాశ్రమాల పాలుచేసి ఆఖరి గడియలను భారం చేస్తున్నారు. 'వారం రోజుల నుంచి మనసు బాగోలేదు. మీవద్దకు రావాలంటే తెచ్చేవారు లేరు. పక్కింటి కుర్రాడిని ఎంతగా ప్రాధేయపడినా పట్టించుకోలేదు. ఏదోలా కష్టపడి ఈ రోజు మీ వద్దకు రాగలిగాను'...హెచ్‌బీ కాలనీకి చెందిన ఓ వృద్ధుడు వైద్యుని వద్ద వ్యక్తం చేసిన ఈ ఆవేదన ఆయన కంట కన్నీరు తెప్పించింది. 'కోట్ల రూపాయల ఆస్తి కొడుకులపాలయింది. రహదారిని ఆనుకుని ఉన్న విలువైన స్థలంలో నా కొడుకులిద్దరూ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించుకుని అద్దెకిచ్చి హాయిగా బతుకుతున్నారు. ఆ ఆస్తి వారి పరం చేసిన నాకు మాత్రం ఇంత ముద్దపడేసి అంతటితోనే సరి అని పట్టించుకోవడం మానేస్తున్నారు. చేసేదేమీలేక వారి చేష్టలు మౌనంగా భరిస్తున్నాను' అని వాపోతున్న ఓ వృద్ధురాలి దీనగాథ ఎంతటి పాషాణ హృదయాన్నైనా కరిగించక మానదు. ముదిమి మీదపడి కుటుంబ సభ్యుల నీడలో హాయిగా ఆఖరి రోజులు గడపాల్సిన వృద్ధుల దీనావస్థకు ఇవి రెండు ఉదాహరణలు మాత్రమే. వెలుగుచూసిన ఘటనలు కొన్నే అయినా వెలుగు చూడని ఘటనలు కోకొల్లలు. అయినవారి నిరాదరణ, మరో దారిలేని పరిస్థితుల్లో గుండెలనిండా భారం, కళ్లనిండా నీరు నింపుకుని మౌనంగా రోధించే పండుటాకుల వృద్ధాప్య జీవితాలు ఎన్నో. అవసరం తెలిసి, అవకాశం ఉండి తల్లిదండ్రుల పట్ల బాధ్యత మరిచే పిల్లల ప్రవర్తన వారి జీవితాలకు శాపంగా పరిణమిస్తుంటే అనుభవించడం తప్ప ఏమీ చేయలేని నిస్సహాయులు ఎందరో. 'వృద్ధాప్యంలో నూటికి 90 శాతం మంది పలు రకాల కష్టాలు అనుభవిస్తున్నారు' అన్న మాట వృద్ధుల దీనగాథకు సాక్ష్యం. నేడు సీనియర్ సిటిజన్స్ డే సందర్భంగా పండుటాకుల వృద్ధాప్యజీవిత గాథలపై 'ఆంధ్రజ్యోతి' అందిస్తున్న ప్రత్యేక కథనం ఇది.

చిన్న కుటుంబాలతో తంటాలు

ఉమ్మడి కుటుంబ వ్యవస్థ ఉన్నప్పుడు ఎటువంటి సమస్యలు ఉండేవి కావు. చిన్న కుటుంబాల కల్చర్ ప్రారంభమయ్యాక రకరకాల సమస్యలు. పట్టణీకరణ, పారిశ్రామికీకరణ పెరిగినప్పటి నుంచి వృద్ధులకు సమస్యలు మరింతగా పెరిగాయని నిపుణులు చెబుతున్నారు. గతంలో వ్యవసాయం చేసే సమయంలో పిల్లలు తల్లిదండ్రుల విలువైన సూచనలు, సలహాలు తీసుకునేవారు. వారి బాగోగులు పట్టించుకునే వారు.ఉపాధి కోసం వలస వచ్చిన కుటుంబాలు తాము, తమ పిల్లలు తప్ప మరో వ్యక్తి తమ మధ్య ఉండేందుకు ఇష్టపడడం లేదు. ఇదే వృద్ధులకు శాపంగా మారింది. పిల్లలు విదేశాల్లోనో, ఇతర రాష్ట్రాల్లోనే స్థిరపడితే వారి తల్లిదండ్రులకు ఇక్కడ ఒంటరి జీవితం తప్పడం లేదు. వీరిలో కూడా ఆర్థిక ఇబ్బందులతో జీవితాలను వెల్లదీస్తున్నవారుంటే, ఆర్థికంగా ఉన్నా తోడు, నీడ కరువై జీవితాలను అత్యంత దుర్భరంగా సాగదీస్తున్నవారు ఎందరో ఉన్నారు.

తోడుంటే కాస్త భరోసా



జీవిత చరమాంకంలో భాగస్వామి తోడుంటే మంచిది. ఇద్దరిలో ఒకరు చనిపోయినా మిగిలినవారు జీవితం దుర్భరం.. కష్టాన్ని, నష్టాన్ని, సంతోషాన్ని చెప్పుకునే పరిస్థితి లేక మానసిక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. వృద్ధాప్యంలో పెళ్లి చేసుకోవడం వల్ల ఇటువంటి సమస్యలను ధైర్యంగా ఎదుర్కోవచ్చు. ఒకిరికి ఒకరు తోడుగా ఉంటూ సమస్యలు పరిష్కరించుకోవచ్చు. ఇప్పటికే ఇటువంటి వివాహాలు ఉత్తరాదిలో జరుగుతున్నాయి. దక్షిణాదిలో హైదరాబాద్, బెంగళూరుల్లో కూడా జరుగుతున్నాయి.

- వై.వి.ఎస్.ఆర్.మూర్తి,
వింటేజ్ విశాఖ అధ్యక్షులు



ఏదో వ్యాపకం ఉండాలి



వృద్ధాప్యంలో కూడా ఆరోగ్యంగా ఉన్నంత వరకు ఏదో ఒక వ్యాపకంలో ఉండడం మంచిది. దీనివల్ల ఇంట్లోని వారికి కూడా భారంగా ఉన్నామన్న భావన కలగదు. అదే సమయంలో పిల్లల విషయంలో కూడా తల్లిదండ్రులు కొంత మేర జాగ్రత్తగా వ్యవహరించాలి. పూర్తిగా వారిపైనే ఆధారపడేలా కాకుండా తమ స్వశక్తిపై ఆధారపడి ఉండేలా చూసుకోవాలి. దీనివల్ల వృద్ధాప్యంలో ఎదురయ్యే ఇబ్బందులను సులువుగా ఎదుర్కొనేందుకు అవకాశముంది. ఒంటరిగా ఉండడం వల్ల శారీరక, మానసిక సమస్యలు వేధించవచ్చు. వీలైనంత వరకు తోడు ఉండేలా చూసుకోవాలి.

- డాక్టర్ ఎన్.ఎన్.రాజు,
మానసిక వైద్య నిపుణులు

భవిష్యత్తును ఊహించుకోవాలి

నేటి పిల్లలే రేపటి తల్లిదండ్రులు. ఈ రోజు తల్లిదండ్రుల పట్ల మనం చూపే నిర్లక్ష్యం రేపు మన పిల్లలు మనపట్ల చూపిస్తారన్న ధ్యాస ఉండాలి. అప్పుడే బాధ్యత మర్చిపోయేవారు తగ్గుతారని నిపుణులు సూచిస్తున్నారు. మన తల్లిదండ్రులకు మనం ఇచ్చే గౌరవాన్ని భవిష్యత్‌లో మన పిల్లల నుంచి మనం పొందుతాం. ముఖ్యంగా దూర ప్రాంతాల్లో ఉద్యోగాలు, వ్యాపారాలకు వెళ్లినవారు వీలైతే తమతోనే తల్లిదండ్రులను తీసుకెళ్లేందుకు ప్రయత్నించాలని, లేకపోతే వారికో తోడును అందించే ఏర్పాటు చేయాలని నిపుణులు సూచిస్తున్నారు. మనకు పిల్లలు పుట్టారు కదా అన్న ఉద్దేశంతో తల్లిదండ్రులను దూరం పెట్టడమనేది క్షమించరాని తప్పిదమని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పిల్లలు, తల్లిదండ్రులను సమభావంతో చూస్తూ వారి శేష జీవితాన్ని ఆనందంగా గడిపేలా చూసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

భారం...భారం

ఉమ్మడి కుటుంబ వ్యవస్థలో పెద్దరికానికి ప్రత్యేక గౌరవం ఉండేది. వారిపట్ల ప్రత్యేక శ్రద్ధ కనిపించేది. కాలంతోపాటు తెచ్చిన మార్పుతో 'పెద్దరికానికి' నిర్లక్ష్యం చీకట్లు కమ్ముకున్నాయి. ఒకప్పుడు పట్టణాలకే పరిమితమైన నిర్లక్ష్యం ఇప్పుడు పల్లెలను తాకింది. గ్రామీణ ప్రాంతాల్లోనూ వృద్ధుల పట్ల నిర్లక్ష్యం, నిరాదరణ ఎక్కువయిందని నిపుణులు చెబుతున్నారు. కాకుంటే నగరాలతో పోల్చుకుంటే గ్రామాల్లో పరిస్థితి కొంతలో కొంత బెటర్. బిడ్డల నిర్దయ, కపటం, స్వార్థబుద్ధి తెలిసినా కుటుంబ పరువు బజారున పడకూడదన్న ఉద్దేశంతో చాల మంది తల్లిదండ్రులు తమ చివరి మజిలీని భారంగా గడుపుతున్నారు. తినడానికి తిండి లేక, కట్టుకోవడానికి సరైన దుస్తులు లేక, ఆత్మీయ పలకరింపు లేక ఎంతోమంది వృద్ధులు తమ జీవితాలను భారంగా గడుపుతున్నారు.



ఎన్నో సమస్యలు

వృద్ధాప్యంలో పలు సమస్యలు వెన్నంటి ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. ప్రధానంగా వైద్య రంగంలో వచ్చిన మార్పులు, ఇతరత్రా కారణాల వల్ల జీవిత కాలం పెరిగింది. గతంలో 60, 70 ఏళ్లకే తనువు చాలిస్తే ప్రస్తుతం 90 ఏళ్ల వరకు జీవిస్తున్నారు. దీనివల్ల 20 నుంచి 30 ఏళ్లపాటు వృద్ధాప్య జీవితాన్ని లాగించాల్సి వస్తోంది. దీంతో పలు రకాల సమస్యలు వారిని వేధిస్తున్నాయి.

- వృద్ధాప్యంలో శారీరకంగా, మానసికంగా పలు రకాల సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తోంది.
- ఇతరులపై ఆధారపడాల్సి ఉంటుంది. ఆరోగ్య సమస్యలు ఎదురైనప్పుడు పట్టించుకునే పరిస్థితి ఉండడం లేదు.
- వృద్ధాప్యంలో ఎదురయ్యే శారీరక వ్యాధులు, గుండె సంబంధిత సమస్యలు, ఇతర అనారోగ్య సమస్యలు వేధించే అవకాశముంది. వీటితోపాటు మానసికంగా డిప్రెషన్, ఆత్మన్యూనతా భావం, ఆత్మహత్యలకు ప్రేరేపించే ఆలోచనలు, చికాకు, డిప్రెషన్ వంటి సమస్యలు మరింతగా ఇబ్బంది పెట్టే అవకాశముంది.



మార్పుకు అలవాటుపడాలి

వృద్ధులు కూడా కాలంతోపాటు వచ్చే మార్పులకు సర్దుకుపోయేతత్వాన్ని అలవర్చుకోవాలి. సానుకూల దృక్పథంతో కుటుంబ సభ్యులు అభిమానాన్ని పొందాలి. కుటుంబ యజమానిగా, ఉద్యోగంలో ఉన్న సమయంలో లభించిన గౌరవం, గుర్తింపు, మర్యాద దక్కాలని కోరుకోక పోవడం మంచిది. నగరంలో మారిన పరిస్థితులు, వృత్తి గతమైన ఒత్తిడి వంటి అంశాలను పరిగణలోకి తీసుకుని చిన్న చిన్న పనులను వీలైనంత వరకు తమంతట తామే చేసుకోవడం మంచిది. పదవీ విరమణ తరువాత వీలైనంత వరకు ఏదైనా పనిలో నిమగ్నమై ఉండేందుకు ప్రయత్నించాలి.

- సాధారణమైన వారికే కాకుండా ఉన్నత ఉద్యోగాలు, ఉన్నత స్థానాల్లో పనిచేసి రిటైర్ అయిన వారికి కూడా ఇబ్బందులు తప్పడం లేదు. వయసు మళ్లిన వారితోపాటు మహిళలు, వితంతువులు దీనావస్థ ఎదుర్కొంటున్నారని సర్వేల్లో తేలింది.
- పిల్లలు, తోడుగా ఉన్నవారు దూరం కావడం వల్ల కొంత మంది మానసిక క్షోభను అనుభవిస్తుంటారు. నిత్యం ఆలోచనల్లో ఉంటూ సమయం, ఆకలి కూడా పట్టనంత స్థాయికి వెళ్లిపోయే అవకాశముంది.
- అనారోగ్యం బారిన పడినా పట్టించుకునే వారుండరు. ప్రధానంగా కొంత వయసు దాటాక సమయానికి మందులను, ఆహారాన్ని అందించాల్సి ఉంటుంది. కానీ చేదోడు అందించే వారుండక తీవ్ర ఇబ్బందులు అనుభవిస్తుంటారు.
- ఆరోగ్యం బాగాలేదని బయటకు వెళ్లాలన్నా, బయటకు వెళ్లినప్పుడు ఎవరో ఒకరి సహాయం అవసరం ఉన్నా అందించే వారు లేక ఇబ్బందులు పడుతుంటారు. చాలామంది ఇటువంటి ఇబ్బందులను భరించలేక అత్మహత్యలకు కూడా పాల్పడుతుంటారు.

సమస్య తీవ్రంగానే ఉంది



వృద్ధాప్య సమస్యలు మన దగ్గర కూడా చాలా ఎక్కువగా ఉన్నాయి. ప్రధానంగా పారిశ్రామికీకరణ, నగరీకరణ తరువాత సమస్య మరింత పెరుగుతూ వచ్చింది. చిన్న కుటుంబాల వల్ల ఒంటరవుతున్న వృద్ధుల సంఖ్య పెరిగింది. 90 శాతం మందికి రిటైర్మెంట్ బెనిఫిట్స్ లేని వృద్ధులే ఎక్కువ.అరకొరపింఛన్‌తోనెట్టుకొస్తున్నారు.ఓల్డేజ్ హోమ్‌లకు డిమాండ్ పెరిగింది. ప్రభుత్వాలే పటిష్టమైన చర్యలు తీసుకుంటే సమస్యలు నివారించవచ్చు. పిల్లలు విలువలతోకూడిన జీవితాన్నిఅలవర్చుకోవాలి.

- ఆచార్య విశ్వేశ్వరరావు,
ఏయూ సోషల్ వర్క్ విభాగం

చివరి మజిలీలో తోడుకై...

వృద్ధాప్యంలో జీవితాన్ని సజావుగా సాగించేందుకు తోడును కోరుకుంటారు. ఏళ్లపాటు తోడు, నీడగా బతికిన సహ భాగస్వామి చనిపోవడం వల్ల శారీరకంగా, మానసికంగా కూడా కృంగిపోయే అవకాశముంది. జీవిత చరమాంకంలో ఎదురయ్యే ఇబ్బందులను, కష్టాలను, భావోద్వేగాలను పంచుకునేందుకు సరైన తోడు ఉంటే వారి జీవితం ప్రశాంతంగా సాగిపోయే అవకాశముంది. ముందుగానే భర్త/భార్య చనిపోతే అటువంటి వారికి మలిసంధ్యలో వివాహాన్ని జరిపించడం వల్ల వారి జీవితాల్లో కొంత సంతోషాలను అందించేందుకు అవకాశముందని నిపుణులు చెబుతున్నారు. పిల్లలే దగ్గరుండి వివాహాలు చేయాలని చెబుతున్నారు.

ప్రభుత్వపరమైన సహకారం

వృద్ధులకు సహాయాన్ని అందించేందుకు ప్రభుత్వం కూడా పలు కార్యక్రమాలను అమలు చేస్తోంది. కానీ, అవి చాలా వరకు సక్రమంగా అమలు కావడం లేదు. 2007లో తీసుకువచ్చిన 'పేరెంట్ అండ్ సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ యాక్ట్' ప్రకారం తల్లిదండ్రులను చూడకపోయినా, వారి ఇబ్బందులను పరిష్కరించక పోయినా పిల్లలు శిక్షార్హులు, అదే సమయంలో వారి సమస్యలను 120 రోజుల్లో పరిష్కరించాల్సి ఉంటుంది. నగరంలో ప్రస్తుతం 15కు పైగా హోమ్‌లుంటే వాటికి ప్రభుత్వం నుంచి సాయం అందుతోంది. సీనియర్ సిటిజన్స్ కోసం జిల్లాకో హోమ్, పగటిపూట విశ్రాంతి తీసుకునేందుకు డే కేర్ సెంటర్లు ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనలు ఉన్నా అడుగు ముందుకుపడడం లేదు. వృద్ధులకు తగిన రాయితీలు, పథకాల ఫలితాలు అందుతున్నాయో లేదో చూడాలి. చట్టపరమైన రక్షణ వృద్ధులకు కల్పించాలి.



205 కిలోల గంజాయి స్వాధీనం

జి.మాడుగుల: రవాణాకు సిద్ధంగా వుంచిన 205 కిలోల గంజాయి స్వాధీనం చేసినట్టు స్థానిక ఎస్‌ఐ కె.శ్రీను ఆదివారం తెలిపారు. మండలంలోని సొలభం పంచాయతీ గొందిపాడు గ్రామంలో తనిఖీలు చేపట్టగా రవాణాకు సిద్ధంగా ఉంచిన 205 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నామన్నారు. రవాణాకు సహకరిస్తున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్టు ఆయన తెలిపారు. మన్యం నుంచి మైదాన ప్రాంతానికి తరలించేందుకు గంజాయి సిద్ధంగా ఉన్నట్టు అందించి ముందస్తు సమాచారం మేరకు తనిఖీలు చేపట్టగా పట్టుబడినట్టు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది ఉన్నారు.

96 కిలోల గంజాయి పట్టివేత?

పోలీసుల అదుపులో యువకుడు


గంజాయితో దొరికిన కారు

కృష్ణాదేవిపేట: మూడు రోజుల క్రితం కేడీపేట పోలీసులు కారుతో గంజాయిని భీమవరం చెక్‌పోస్టు సమీపంలో పట్టుకున్నట్టు తెలిసింది. ఈ మేరకు ఆ కారులో 96 కిలోల గంజాయి వున్నట్టు సమాచారం. గంజాయి రవాణాలో ప్రధాన నిందితుడు హైదరా బాద్‌కు చెందిన వ్యక్తి పరారీలో వుండగా చింతపల్లి మండలం చౌడపల్లి గ్రామానికి చెందిన యువకుడిని అదుపులోకి తీసు కున్నట్టు తెలిసింది.దీంతో పట్టుకున్న కారు పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఉంది.ఈవిషయమై కేడీపేట ఎస్‌ఐ రమేష్‌ను వివరణ కోరగా ప్రస్తుతం ఏ కేసులు లేవని ఆయన తెలిపారు.

ఊయ్యాల తాడు మెడకు బిగుసుకుని యువకుడి మృతి

అనకాపల్లిటౌన్: ప్రమాదవశాత్తూ ఉయ్యాల తాడు మెడకు బిగుసుకొని యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని ఊడేరు పంచాయతీ పరిధిలోగల అల్లిఖానుడు పాలెం గ్రామంలో ఆదివారం జరిగింది. ఇందుకు సంబంధించి రూరల్ ఎస్‌ఐ ఎ.ఆదినారాయణరెడ్డి తెలిపిన వివరాలిలావున్నాయి. సిరిగిశెట్టి సత్తిబాబుకు ఇద్దరు కుమారులున్నారు. తమ్ముడు సౌకర్యార్థం కట్టిన ఉయ్యాలలో అన్న దావీద్ (19) ఊయ్యాల ఊగుతుండడంతో తల్లిదండ్రులు మందలించేవారు. ఆదివారం ఉదయం తల్లి చర్చికి, తండ్రి సత్తిబాబు పొలానికి వెళ్లిన సమయంలో దావీద్ ఉయ్యాలలో ఊగుతున్న సమయంలో ప్రమాదవశాత్తూ ఉయ్యాల తాడు మెడకు చుట్టుకొని బిగుసుకుపోవడంతో కళ్లు తేలేశాడు. రెండు గంటల సమయంలో కుటుంబసభ్యులు ఇంటికి వచ్చేసరికి ఊయ్యాలలో దావీద్ కళ్లు తేలేసి ఉండడాన్ని గమనించి ఊయ్యాల విప్పి చికిత్స కోసం ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్టు ఎస్‌ఐ తెలిపారు. తండ్రి సత్తిబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఆయన తెలిపారు.

కడుపునొప్పి తాళలేక సాక్షరభారత్ కోఆర్డినేటర్ ఆత్మహత్య


సహదేవ్ మృతదేహం

ముంచంగిపుట్టు: మండల సాక్షరభారత్ కోర్డినేటర్‌గా పని చేస్తున్న జర్రెల పంచాయతీ దాసరిపుట్టు గ్రామానికి చెందిన పొయభా సహదేవ్(34) కడుపు నొప్పి తాళలేక ఆదివారం మృతి చెందాడు. ఇందుకు సంబంధించి వివరాలిలావున్నాయి. శనివారం సాయంత్రం తీవ్రమైన కడుపునొప్పి రావడంతో భరించలేక పంట పొలాలకు వాడే పురుగుల మందును తాగేశారు. దీంతో తీవ్ర అస్వస్థతకు గురైన సహదేవ్‌ను ఆయన భార్య సత్యవతి కుటుంబ సభ్యులు స్థానిక సీహెచ్‌సీకి తరలించారు. స్థానిక వైద్య సిబ్బంది వైద్యసేవలు అందించగా పరిస్థితి విషమంగా వుందని పాడేరు ఏరియా ఆస్పత్రికి రిఫర్ చేశారు. పాడేరు ఆస్పత్రిలో వైద్యసేవలు పొందుతూ ఆదివారం తెల్లవారు జామున మృతి చెందాడు. స్థానిక ఏఎస్‌ఐ భాస్కరరావు పాడేరు ఆస్పత్రికి చేరుకుని మృతికి గల కారణాలు అడిగి తెలుసుకుని కేసు నమోదు చేశారు.మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు.


భయపెడుతున్న వృక్షాలు

ఆంధ్రజ్యోతి ప్రచురించిన వార్త కథనం(ఫైల్)


లంబసింగి ఘాట్‌లో చెట్లకొమ్మలకి తగిలి నిలిచిన ట్రాలీ(ఫైల్)


లంబసింగి ఘాట్‌లో రహదారిపై వాలిపోయిన వృక్షాలు

ప్రమాదభరితంగా లంబసింగి ఘాట్

తరచూ రాకపోకలకు అంతరాయం
కూలేందుకు సిద్ధంగా వృక్షాలు
'ఆంధ్రజ్యోతి' హెచ్చరించినా
పట్టించుకోని ఆర్‌అండ్‌బీ అధికారులు

చింతపల్లి:చింతపల్లి-నర్సీపట్నం ప్రధాన రహదారి లంబసింగి ఘాట్‌లో రాకపోకలకు తరచుగా అంతరాయం కలుగుతోంది. వర్షాల కారణంగా ఘాట్‌రోడ్డుపై చెట్లు, బండరాళ్లు పడినప్పటికీ ఆర్‌అండ్‌బీ అధికారులు తొలగించడంలో తీవ్రనిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నారు. ఈకారణంగా ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తోంది. లంబసింగి ఘాట్‌లో రహదారిపై చెట్లు వాలిపోయి కూలేందుకు సిద్ధంగా వున్నాయని, తక్షణమే తొలగించాలని జూన్ 27న ఆంధ్రజ్యోతి దినపత్రిక భయపెడుతున్న వృక్షాలు శీర్షికన వార్త కథనం ప్రచురించింది. ఈ కథనానికి ఆర్‌అండ్‌బీ అధికారులు వెంటనే స్పంధించి లంసింగి ఘాట్‌రోడ్డుపై వాలిపోయి కూలేందుకు సిద్ధంగానున్న వృక్షాలను తొలగించి వుంటే శుక్రవారం రాత్రి ప్రయాణికులకు అడవి జాగారం చేయాల్సిన పరిస్థితి తప్పేది. లంబసింగి ఘాట్‌రోడ్డులో రహదారిపైకి వాలిపోయి కూలేందుకు సిద్ధంగానున్న వృక్షాలను ఆర్‌అండ్‌బీ అధికారులు తొలగించకపోవడం వల్ల ట్రాలీ చెట్లకొమ్మలకు తగిలి రహదారికి అడ్డంగా నిలిచిపోవాల్సి వచ్చింది.

ఈకారణంగా ఇరువైపులా రాకపోకలు స్తంభించిపోవడం, రక్షిత మంచినీరు, భోజన సౌకర్యాలు కూడా అందుబాటులోని పరిస్థితిని ఎదుర్కొంటూ కారు అడవిలో 11గంటల పాటు సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సిన ప్రయాణికులు లంబసింగి ఘాట్‌లో వుండిపోవాల్సి వచ్చింది. ఇప్పటికైనా ఆర్‌అండ్‌బీ అధికారులు స్పంధించి లంబసింగి ఘాట్‌లో రహదారికి ఇరువైపులా పెరిగిపోయిన తుప్పలు, రహదారిపైకి వాలిపోయిన వృక్షాలను తొలగించి ప్రయాణికుల కష్టాలను తీర్చాలని ప్రాంతీయులు కోరుతున్నారు.

కిరాతకులు..

నగరంలో పెరుగుతున్న హత్యలు
పేట్రేగిపోతున్న ప్రేమోన్మాదం..రౌడీమూకల మధ్య ఆధిపత్య పోరు
అవకాశం చూసుకుని వ్యూహాలు అమలు
రౌడీషీటర్లపై కొరవడిన పోలీస్ నిఘా

(ఆంధ్రజ్యోతి/విశాఖపట్నం)

'పాత నగరంలోని పండావీధికి చెందిన బొందల సతీష్(23) తన ప్రియురాలు భవానీ(19)ని తన ఇంటికి పిలిపించి గత నెల ఎనిమిదిన చాకుతో గొంతుకోసి చంపేశాడు.'

'కూర్మన్నపాలెం రాజీవన్‌నగర్‌లో నివాసముంటున్న గొప్పాక గణేష్ అనే వ్యక్తి ఉన్మాదంతో తన భార్య మారుతి(25)ని నెల రోజుల కిందట కిరాతకంగా హత్య చేశాడు. అడ్డుకునేందుకు యత్నించిన అత్తపైనా దాడిచేయడంతో ఆమెకు తీవ్ర గాయాలయ్యాయి.'

'తాజాగా ఈ నెల 19న తన ప్రేమను తిరస్కరించిందనే అక్కసుతో తగరపువలస శివారు టి.నగరపాలేనికి చెందిన రూప(19) అనే యువతిని హరిసంతోష్ అనే యువకుడు సజీవదహనం చేశాడు. అడ్డుకునేందుకు యత్నించిన యువతి తమ్ముడు కూడా ఈ ఘటనలో గాయపడి ప్రాణాలు కోల్పోయాడు. అదే రోజు ఆరిలోవ వద్ద వినయ్ అనే రౌడీషీటర్‌ను కొంతమంది వెంటాడి మరీ హత్య చేశారు.'

ప్రశాంత నగరంగా పేరొందిన విశాఖలో హత్యలు ఏ స్థాయిలో పెరుగుతున్నాయనేదానికి పైన పేర్కొన్న ఉదంతాలు అద్దంపడుతున్నాయి. కొన్నాళ్ల కిందటి వరకూ ప్రశాంతంగా వున్న నగరంలో గత నెల రోజులుగా హత్యలు, హత్యాయత్నాలు పెరుగుతున్నాయి. ఈ పరిణామం నగరవాసులతోపాటు పోలీస్ వర్గాలను ఆందోళనకు గురిచేస్తోంది. గతంలో ఎన్నడూ లేనివిధంగా గత నెల రోజుల్లో పది మంది వరకూ హత్యకు గురికాగా మరో పది మందిపై హత్యాయత్నాలు జరగడం చర్చనీయాంశంగా మారింది. కొన్ని హత్యల్లో రౌడీషీటర్లు, కిరాయి వ్యక్తులు నిందితులు కాగా మరికొన్ని కేసుల్లో మాత్రం నిందితులంతా మృతులకు, బాధితులకు తెలిసినవారే. అయినప్పటికీ దీనిని ఆసరాగా తీసుకుని రౌడీ మూకలు, ఆకతాయిలు రెచ్చిపోయే ప్రమాదం వుందని పోలీసు వర్గాలు విశ్లేషిస్తున్నాయి. గతంలో నగరంలో రౌడీషీటర్ల ఆగడాలు పెచ్చుమీరడంతో పోలీసులు వారికి ముకుతాడు వేసేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించి అమలుచేశారు. పోలీస్‌స్టేషన్‌ల వారీగా రౌడీషీటర్లను గుర్తించి ఒక జాబితా రూపొందించారు. వారందరినీ ఒకచోటకు చేర్చి రౌడీ దర్బార్ నిర్వహించారు. ఒక్కొక్కరు ఎక్కడ వుంటున్నారు, వారిపై షీట్ ఏ పోలీస్ స్టేషన్‌లో వుంది.. వారి ఫోన్ నంబర్లు, ఆధార్‌కార్డు వివరాలను తీసుకున్నారు. ఎవరైనా ఇల్లు మారినట్టయితే ఆ విషయాన్ని తప్పనిసరిగా సంబంధిత పోలీసులకు తెలపాల్సిందేనని స్పష్టం చేశారు. జైలుకు వెళ్లిన నేరస్తులు తిరిగి విడుదలైనపుడు ఆ సమాచారం సంబంధిత పోలీసులకు వచ్చేలా ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటుచేశారు. ప్రతీ రౌడీషీటర్ గురించి ఎస్‌ఐలు, సీఐలకు ప్రత్యక్షంగా తెలిసేందుకు ఈ కార్యక్రమం దోహదపడింది. దీనివల్ల రౌడీషీటర్లు వారాంతంలో స్టేషన్‌కు రాకపోయినా, ఎక్కడైనా అనుమానాస్పదంగా తారసపడినా వెంటనే వారిని ప్రశ్నించేందుకు పోలీసులకు అవకాశం వుండేది. దీంతో రౌడీయిజానికి అడ్డుకట్టపడడంతో హత్యలు, దాడులు వంటి నేరాలు అదుపులోకి వచ్చాయి. అయితే కొంతకాలం తర్వాత నగరంలో అనేక సదస్సులు, కార్యక్రమాలు జరుగుతుండడంతో పోలీసులు వాటిపై ఎక్కువ దృష్టి సారించాల్సిన అవసరం ఏర్పడింది. దీనివల్ల రౌడీషీటర్లపై నిఘా కొరవడడంతో తిరిగి హత్యలు, హత్యాయత్నాలు పెరగడానికి వీలు కల్పించినట్టయింది.

పెరుగుతున్న నేరాల సంఖ్య

2014లో 27 హత్యలు, 54 హత్యాయత్నాలు జరగ్గా, 2015లో 16 హత్యలు, 47 హత్యాయత్నాలు నమోదయ్యాయి. 2016లో వీటిసంఖ్య పెరిగి 32 హత్యలు, 69 హత్యాయత్నాలు నమోదయ్యాయి. ఈ ఏడాది కూడా వీటి సంఖ్య పెరుగుతూ వస్తుండడం పోలీసులతోపాటు నగరవాసులను ఆందోళనకు గురిచేస్తోంది. కొద్దిరోజుల కిందట రెల్లివీధిలో రెండు వర్గాలు మారణాయుధాలతో నడిరోడ్డుపై కొట్లాటకు దిగాయి. ఈ ఘటనలో కొంత మంది గాయపడ్డారు కూడా. అయితే పోలీసులకు సకాలంలో సమాచారం అందడంతో పెద్దసంఖ్యలో పోలీసులు ఆ ప్రాంతాన్ని చుట్టుముట్టడంతో పెను ప్రమాదం తప్పినట్టయింది. అలాకాని పక్షంలో రెండు వర్గాల్లో ఒకరిద్దరు ప్రాణాలు కోల్పోయివుండేవారు. గత నెల ఆరున అగనంపూడిలో ఒకే అపార్ట్‌మెంట్‌లో వుంటున్న ఇద్దరు వ్యక్తుల మధ్య స్పర్ధలు ఒకరిని బలిగొన్నాయి. గాజువాక రాజీవ్‌నగర్‌లో ఉన్మాదిగా మారిన గణేష్ అనే వ్యక్తి ఈ నెల ఎనిమిదిన అతని భార్యను నిర్ధాక్షిణ్యంగా హత్యచేయడంతోపాటు అడ్డుకునేందుకు యత్నించిన అత్తను తీవ్రంగా గాయపరిచి పరారయ్యాడు. అదే రోజు పాతనగరంలోని పండావీధికి చెందిన యువకుడు తన ప్రియురాలిపై అనుమానం పెంచుకుని ఆమెను తన ఇంటికి పిలిపించి నిర్ధాక్షిణ్యంగా గొంతుకోసి హత్యచేశాడు. తాజాగా తన ప్రేమను కాదన్నందుకు ఒక యువకుడు తగరపువలస శివారులో టి.నగరపాలేనికి చెందిన ఒక యువతిని పెట్రోల్‌పోసి సజీవదహనం చేశాడు. ఆమెను కాపాడే యత్నంలో ఆమె తమ్ముడు కూడా మృతి చెందాడు. ఆరిలోవ ఆఖరి బస్టాప్ వద్ద వినయ్ అనే రౌడీషీటర్‌ను ముగ్గురు వ్యక్తులు దారికాసి ఈ నెల 19న రాత్రి సమయంలో దారుణంగా హత్య చేశారు. శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత కొంతమంది రౌడీషీటర్లు బీచ్‌రోడ్డులో పార్క్‌హోటల్ సమీపంలో కత్తులతో తిరుగాడుతుండగా రాత్రి గస్తీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆదివారం మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో ముడసర్లోవ పార్క్‌లో రెండు వర్గాల మధ్య కొట్లాట జరిగింది. ఈఘటనలో కొంతంది గాయపడ్డారు.

ప్రతీవారం కౌన్సెలింగ్ చేస్తున్నాం
నాగేంద్రకుమార్, జాయింట్ సీపీ

రౌడీషీటర్ల ఆగడాలకు అడ్డుకట్టవేసేందుకు ప్రతీ ఆదివారం పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చి కౌన్సెలింగ్ చేస్తున్నారు. గత మూడు వారాలుగా ఇదే పరిస్థితి కొనసాగుతోంది. రౌడీషీటర్లు అదుపు తప్పకుండా నిరంతరం నిఘా పెడుతున్నాం.

కట్నం వేధింపులపై ఫిర్యాదు

చోడవరంటౌన్: వరకట్నం కోసం వేధిస్తున్నారంటూ భర్త అత్తమామలపై చేతిన వరలక్ష్మి ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఇందుకు సంబంధించి వివరాలిలావున్నాయి.

మండలంలోని బెన్నవోలు గ్రామానికి చెందిన చేతిన వరలక్ష్మికి పట్టణంలోని వెంకయ్యగారిపేటకు చెందిన చేతిన శంకరరావుతో 2009లో వివాహమైంది. పెళ్లి సమయంలో మూడు లక్షల రూపాయల కట్నం, మూడు తులాల బంగారం, 20 సెంట్ల భూమి కట్నంగా ఇచ్చినప్పటికీ, అదనపు కట్నం కోసం భర్తతో పాటు అత్తమామలు వేధింపులకు గురిచేస్తుండడంతో భార్య వరలక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనిపై పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ముందుకు సాగని విద్యార్థి గణన

జిల్లా వ్యాప్తంగా బడికి వెళ్లని 38, 272 మంది పిల్లలు
గణన చేయడంలో విద్యాశాఖ విఫలం

రోలుగుంట: బడిబయట ఉన్న పిల్లలను గుర్తించేందుకు బాధ్యతలు తీసుకున్న విద్యాశాఖ ఆ పిల్లలను గుర్తించి గణన చేయడంలో పూర్తిగా విఫలమైంది. ఈ నెల 17 వరకు గడువు పొడిగించినా అనుకున్న లక్ష్యం చేరుకోవడంతో వెనుకబడింది. గడువు ముగిసినా ఇంకా జిల్లా వ్యాప్తంగా 38272 మంది పిల్లలు బడిబయటే ఉన్నారు. వారిని ఇంకా గుర్తించవల్సి ఉన్నది.

బడి బయట ఉన్న పిల్లలను గుర్తించి బడిలో చేర్పించే బాధ్యతను సర్వ శిక్షా అభియాన్ తన భుజాన వేసుకొని విద్యార్థి గణన కార్యక్రమాలను ఏర్పాటు చేస్తోంది. ఆ ఎస్ఎస్ఏ ఆధ్వర్యంలో మండల రిసోర్సు పర్సన్లచే రోజుకు ఇంత చొప్పున కేటాయించి గ్రామాల్లో బడి బయట ఉన్న పిల్లలను గుర్తించి ఏపీజీఈఆర్ యాప్‌లో నమోదు చేయాల్సి ఉంది. గత నెల 22న ప్రారంభమైన ఈ విద్యార్థి గణన అప్పటి నుంచి రెండు దఫాలుగా గడువును పొడిగించారు. గతంలో చేసిన ప్రజాసాధికార సర్వే ద్వారా 6 నుంచి 16 ఏళ్ల లోపు పిల్లలు 6 లక్షలకు పైగా ఉన్నట్టు గుర్తించారు. వీరిలో బడిలో చదువుకుంటున్న పిల్లలు విద్యాశాఖకు సంబంధించిన యూడైస్‌లో కేవలం 5.73 లక్షల మంది పిల్లలు ఉన్నారు. ఇంకా 88 వేలకు పిల్లలు లెక్క తేలాల్సి ఉంది. ఒక వేళ విద్యార్థి బడిలో ఉంటే ఏపీజీఈఆర్ యాప్‌లో వారి వివరాలను అనుసంధానం చేయాలి. అలాగే ఇందులో మరో 14 రకాల కారణాలను చూపుతూ వారి వివరాలను పొందుపరచాలి.

అయితే గ్రామాల్లో సీఆర్‌పీలు సరిగ్గా గణన చేయడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. విశాఖ జిల్లాలో బడిబయట ఉన్న పిల్లలు 92,282 మంది ఉండగా ఇప్పటి వరకు 54,010 మంది పిల్లలను గుర్తించి యూడైస్‌లో నమోదు చేశారు. ఇంకా 38,272 మంది పిల్లలు బడిబయట ఉన్నా నేటి వరకు గణన పూర్తి కాలేదు. అలాగే రోలుగుంట మండలానికి సంబంధించి ప్రస్తుతం నేటి వరకు 640 మంది పిల్లలను గుర్తించి నమోదు చేశారు. ఇంకా 116 మంది బడి బయట పిల్లలు గుర్తించాల్సి ఉంది. అయితే గ్రామాల్లో సర్వే చేస్తున్న సీఆర్పీలకు కొత్త సమస్యలు వస్తున్నాయి, విద్యార్థి వివరాలను గుర్తించి ఏపీజీఈఆర్ యాప్‌లో పొందుపరిస్తే మళ్లీ ఆన్‌లైన్‌లో అవే వివరాలు ఉన్నట్టు తెలుపుతుందని రోలుగుంట సీఆర్పీలు చెబుతున్నారు. గ్రామాల్లో సర్వే చేస్తున్న సమయంలో వారికి ఇంటి చిరునామాలు, ఇంటి నంబర్లు, ఎల్‌కేజీ విద్యార్థులు, వలసలు, ఎక్కువ వయస్సు, తక్కువ వయస్సు, తదితర కారణాల వల్ల ఈ వివరాలు ఆన్‌లైన్‌లో పొందుపరుస్తున్నా నమోదు కాలేదని ఎన్యుమనేటర్లు చెబుతున్నారు. అయితే గడువును పొడిగిస్తే గాని మిగతా పిల్లలను గుర్తించి అన్‌లైన్ చేయడం కుదరని వీరు చెబుతున్నారు. ఏదీ ఏమైనా ఈ సర్వేలో బడిబయట ఉన్న పిల్లలను గుర్తించడంలో పూర్తిగా విద్యాశాఖ విఫలమైయ్యిందని పలువురు విమర్శిస్తున్నారు.



కె.నాయుడుపాలెంలో విద్యార్థి గణన చేస్తున్న దృశ్యం(ఫైల్)



గాంధీ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న టీటీసీ సంఘం ప్రతినిధులు

డ్రాయింగ్ టీచర్ పోస్టులను భర్తీచేయాలి

నర్సీపట్నం రూరల్, ఆగస్టు 20: గత కొన్నేళ్లుగా భర్తీకాని డ్రాయింగ్, క్రాఫ్ట్ ఉపాధ్యాయుల పోస్టులను వెంటనే భర్తీ చేయాలని ఏజెన్సీ డ్రాయింగ్, క్రాఫ్ట్ టీటీసీ సంఘం జిల్లా అధ్యక్షులు జె.అప్పారావు, కార్యదర్శి డి.సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఈసందర్భంగా ఆదివారం ఎన్టీఆర్ మినీ స్టేడియంలోని మహాత్మాగాంధీ విగ్రహానికి వినతిపత్రం సమర్పించి నినాదాలు చేశారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్రంలోని జెడ్పీహైస్కూల్స్, ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లోనూ, గిరిజన ప్రాంతంలో గల ఆశ్రమ పాఠశాలల్లో భర్తీకి నోచుకోని పోస్టులకు వెంటనే నోటిఫికేషన్లు జారీచేయాలన్నారు. 1986 నుంచి ఇప్పటివరకు ఏ డీఎస్సీలోనూ తమకు న్యాయం చేయలేదన్నారు. పాడేరు ఐటీడీఏ పరిధిలో 122 ఆశ్రమ పాఠశాలల్లో డ్రాయింగ్, క్రాఫ్ట్ పార్ట్‌టైం టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. భవిష్యత్‌లో విశాఖపట్నంలోని ఏఎస్‌ఏ పీవో కార్యాలయం వద్ద ఆందోళన చేయనున్నామన్నారు. కార్యక్రమంలో ఎం.రమణబాబు, నాగు, ప్రభాకర్, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఉపాధి రికార్డుల తనిఖీ

● మండలానికి రానున్న కేంద్ర బృందం సభ్యులు: ఏపీడీ శ్రీనివాస్

మాకవరపాలెం: ఉపాధి పనులకు సంబంధించి 2016 నుండి 2017 వరకు రికార్డులను ఈ నెల 21వ తేదీ నుంచి 24వ తేదీ వరకు సెంట్రల్ టీమ్ సభ్యులు తనిఖీ చేస్తారని.. డివిజనల్ ఏపీడీ శ్రీనువాస్‌కుమార్ తెలిపారు. ఇందులో భాగంగానే సిబ్బందితో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో రూ.16కోట్లతో గత ఏడాది చేసిన ఉపాధి పనులుతో పాటు ఈ ఏడాది రూ.17కోట్లతో చేపట్టిన పనులకు సంబంధించిన రికార్డులను పరిశీలిస్తామరన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో కొనసాగుతున్న ఉపాధి పనులు పై ఎక్కువగా నిధులు ఖర్చు చేస్తున్నట్టు సోషల్ ఆడిట్ సంస్థలు రిపోర్టులు చూపడంతో కేంద్ర ప్రభుత్వం గత 20రోజులుగా చేసిన పనులకు గాను ఉపాధి నిధులను ఆపివేసింది. దీంతో కేంద్ర బృందం సభ్యులు గత ఏడాదిగా కొనసాగిన పనులకు ఖర్చు చేసిన నిధులు, ప్రస్తుతం 2017 నుంచి ఇప్పటి వరకు ఖర్చు చేసిన నిధులపై సోషల్ ఆడిట్ రిపోర్టులతో పాటు మండలాల్లో ఉన్న కూలీ మస్తర్లు నుంచి చేసిన పనులకు ఖర్చు చేసిన నిధులు వరకు తనిఖీలు చేస్తారని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాలోని ఉపాధి రికార్డులు తనిఖీలు జరుగుతున్నాయన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ తనిఖీలు పూర్తియైతే ఇప్పటి వరకు ఉన్న బకాయిలు విడుదల చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీవో ఎరకయ్య పాల్గొన్నారు.



రికార్డులను సిద్ధం చేస్తున్న ఉపాధి సిబ్బంది



చిలకలగెడ్డ పాఠశాలలో మరుగుదొడ్లను పరిశీలిస్తున్నపీవో



రికార్డులు తనిఖీ చేస్తున్న పీవో

డిజిటల్ తరగతుల నిర్వహణకు ఫైబర్ నెట్

పాడేరు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి రవిసుభాష్‌పట్టన్ శెట్టి ● వివిధ పాఠశాలల తనిఖీ


అనంతగిరిరూరల్, ఆగస్టు 20: మన్యంలో గిరిజన సంక్షేమ పాఠశాలల్లో డిజిటల్ తరగతులు నిర్వహించేందుకు ఫైబర్ నెట్‌ను వినియోగించేందుకు చర్యలు తీసుకుంటున్నామని పాడేరు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి రవిసుభాష్‌పట్టాన్ శెట్టి అన్నారు. ఆయన శనివారం అర్ధరాత్రి వరకు పాఠశాలలను తనిఖీ చేశారు. ముందుగా అనంతగిరి బాలికల పాఠశాల-2ను పరిశీలించిన తరువాత శనివారం రాత్రి శివలింగపురం, చిలకలగెడ్డ గిరిజన సంక్షేమ బాలుర పాఠశాలలను నిశితంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కలిసిన విలేకరులు డిజిటల్ తరగతులకు సామాగ్రి సిద్ధంగా ఉన్నప్పటికీ నెట్ సదుపాయం లేక ఇబ్బందులు తలెత్తుతున్నాయని ఆయన దృష్టికి తీసుకొని వెళ్లారు. మన్యంలో 214 పంచాయతీల్లో కేవలం 83 పంచాయతీల్లో మాత్రమే నామమాత్రపు నెట్‌సేవలు అందుబాటులో ఉన్నాయని ఈ సమస్య నుంచి పరిష్కారానికి ఫైబర్ నెట్ ద్వారా డిజిటల్ తరగతులను నిర్వహించేందుకు చర్యలు ప్రారంభించామన్నారు. చిలకలగెడ్డ పాఠశాలలో పాత గదులను వసతి గృహానికి వినియోగించవద్దని వాటిని ప్రయోగశాలలు, గ్రంథాలయం, జిమ్ వంటి వాటికి వినియోగించి కొత్త భవనాలను డార్మెటరీలుగా వినియోగించాలని ఏటీడబ్ల్యూవోకు ఆదేశించారు. అదే విధంగా పాఠశాలలో పాత భవనానికి ఫ్లోరింగ్ మార్చాలని, ప్రయోగశాలకు ప్రత్యేకమైన గదిని ఏర్పాటు చేయాలని టీడబ్ల్యూ డీఈఈ వంశీకి ఆదేశించారు. స్టాక్ రూం నిర్వహణపై అసంతృప్తి వ్యక్తం చేశారు. అనంతగిరిలో జూనియర్ కళాశాల విద్యార్థులకు వసతి గృహానికై మరమ్మతులు చేపడుతున్న భవనాన్ని నెలరోజుల్లో పూర్తిచేయాలని ఇంజనీర్లకు సూచించారు. మండల కేంద్రాల్లో ఉద్యోగుల వసతి గృహాలకు అవకాశం ఉన్నచోట పాతవాటిని మరమ్మతులు చేపట్టాలని, కొత్తవాటికి ప్రతిపాదనలు తయారుచేయాలని సూచించారు.

చిలకలగెడ్డ పాఠశాలలో దుర్గంధంపై 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన వార్తకు ఆయన స్పందించారు. దుర్గంధం రాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. పాఠశాలలో మరుగుదొడ్లను పరిశీలించిన ఆయన అదనంగా మరో పది బయోటాయిలెట్లు ఏర్పాటు చేస్తామన్నారు.

వృద్ధుడిపై దాడి: రూ.60 వేలు దోపిడీ

విశాఖపట్నం: ఇంట్లోకి చొరబడి వృద్ధుడిపై దాడిచేసి నగదు అపహరించుకు పోయిన సంఘటనపై నాలుగో పట్టణ పోలీసులకు ఫిర్యాదు అందింది. వివరా లిలా వున్నాయి... సుబ్బలక్ష్మినగర్ శ్రీకన్య థియేటర్ వద్ద ఒక భవనంలో కొలగొట్ల బ్రహ్మజీరావు (83) నివాసం ఉంటున్నాడు. ఇంటి పనులు చేయడం కోసం ఇద్దరు అమ్మాయిలు ఇంటర్వ్యూ నిమిత్తం బ్రహ్మజీరావు ఇంటికి ఆదివారం వచ్చారు. వారు వచ్చిన కొద్ది సేపటి తర్వాత గర్తుతెలియని మరో ముగ్గురు యువకులు బ్రహ్మజీరావు ఇంటికి వచ్చారు. ఇంట్లోకి చొరబడి ఆ ముగ్గురు యువకులు బ్రహ్మజీరావుపై దాడి చేసి గాయపరిచారు. రూ.60 వేల నగదు, బ్రహ్మజీ వద్ద గల సెల్‌ఫోన్ దోచుకుపోయారు. దీంతో బాధితుడు నాలుగో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

● హరిత వ్యాలీలో స్విమ్మింగ్‌పూల్ సిద్ధం



టూరిజం హరిత వ్యాలీలో మరమ్మతుకు గురైన స్విమ్మింగ్ పూల్ అందుబాటులోకి వచ్చింది. ఈ విషయమై మేనేజర్ ఎస్.అప్పలనాయుడు విలేకర్లతో ఆదివారం మాట్లాడారు. ఏప్రిల్ నెలలో స్విమ్మింగ్‌పూల్ మరమ్మతులకు గురైందన్నారు. దీంతో ఎనిమిది లక్షల రూపాయలు వెచ్చించి తిరిగి వినియోగంలోకి తేగలగామన్నారు. కాగా పర్యాటకులు ఆదివారం రావడంతో స్విమ్మింగ్‌పూల్ ప్రారంభించారు.

- అరకురూరల్

డబ్ల్యూహెచ్ఓ రాయబారి మిల్కాసింగ్

కరెంట్ అఫైర్స్



రామచంద్రారెడ్డి ఉప్పుల

అంతర్జాతీయం

పోలియో రహిత దేశంగా సోమాలియా

ప్రపంచ ఆరోగ్య సంస్థ సోమాలియాను పోలియో రహిత దేశంగా ఆగస్టు 13న ప్రకటించింది. మూడేళ్లగా సోమాలియాలో ఒక్క పోలియో కేసు కూడా నమోదు కాలేదు. ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా ఆఫ్ఘనిస్థాన్, నైజీరియా, పాకిస్థాన్‌లలో మాత్రమే పోలియో కేసులు నమోదవుతున్నాయి. సోమాలియాలో చివరిగా 2014లో పోలియో కేసు నమోదైంది. సోమాలియాను పోలియో రహిత దేశంగా ప్రకటించినా వ్యాధికి గురయ్యే అవకాశాలు ఉన్నందువల్ల టీకాలను నిరంతరం అందించాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచించింది.

బార్సిలోనాలో ఉగ్రదాడి



స్పెయిన్‌లోని బార్సిలోనాలో ఆగస్టు 17న ఉగ్రవాదులు జరిపిన దాడిలో 13 మంది మరణించారు. బార్సిలోనాలోని లస్ రంబ్లస్ రహదారిలో ఉగ్రవాదులు వ్యానుతో పాదచారుల పైకి దూసుకెళ్లడంతో పలువురు గాయపడ్డారు. దాడి తమ పనేనని ఐసిస్ ఉగ్రవాద సంస్థ ప్రకటించింది. పోలీసులు ఐదుగురు ఉగ్రవాదులను కాల్చి చంపారు. పర్యాటకులు, జనసంచారంతో ఉండే ఈ దారిని దాడికి ఉగ్రవాదులు ఎన్నుకొన్నారు. 2004లో స్పెయిన్‌లోని మాడ్రిడ్‌లో అల్‌ఖైదా ప్రేరేపిత ఉగ్రవాదులు రైళ్లలో పేలుళ్లకు పాల్పడటంతో 191 మంది మరణించారు.

అమెరికా ఉగ్ర జాబితాలో 'హిజ్బుల్ ముజాహిదీన్'

కశ్మీర్‌లో కార్యకలాపాలు నిర్వహిస్తున్న హిజ్బుల్ ముజాహిదీన్‌ను విదేశీ ఉగ్రవాద సంస్థగా అమెరికా ప్రకటించింది. హిజ్బుల్ అధిపతి సయ్యద్ సలావుద్దీన్‌ను రెండు నెలల క్రితం అంతర్జాతీయ ఉగ్రవాదిగా అమెరికా ప్రకటించింది. 1989లో ఏర్పాటైన హిజ్బుల్ కశ్మీర్‌లో పెద్ద ఉగ్రవాద సంస్థల్లో ఒకటి. తాజా ప్రకటనతో ఆ సంస్థకు నిధుల సమీకరణ కష్టతరం కానుంది. ఆంక్షల కారణంగా హిజ్బుల్‌పై చట్టపరమైన సంస్థలు చర్యలు చేపట్టడానికి వీలుంటుంది.

జాతీయం

రికార్డు స్థాయిలో ఆహార ధాన్యాల దిగుబడి

దేశంలో ఆహార ధాన్యాల దిగుబడి 2016-17 సంవత్సరంలో రికార్డు స్థాయిలో నమోదైంది. 2016-17 మొత్తం 27.56 కోట్ల టన్నుల ఆహార ధాన్యాలు ఉత్పత్తి అయినట్లు కేంద్రం ఆగస్టు 16న ప్రకటించింది. 2015-16లో 25.17 కోట్ల టన్నుల ఆహార ధాన్యాల దిగుబడి వచ్చింది. వరి దిగుబడి 10.41 కోట్ల టన్నుల నుంచి 11.01 కోట్ల టన్నులకు పెరిగింది. గోధుమలు 9.29 కోట్ల టన్నుల నుంచి 9.83 కోట్ల టన్నులకు, పప్పు ధాన్యాలు 1.63 కోట్ల టన్నుల నుంచి 2.29 కోట్ల టన్నులకు పెరిగింది. చెరకు ఉత్పత్తి 11.98 శాతం మేర పడిపోయింది. పత్తి ఉత్పత్తి 3.01 కోట్ల బేళ్ల నుంచి 3.30 కోట్ల బేళ్లకు పెరిగింది.

ఇన్ఫోసిస్ సీఈవో విశాల్ సిక్కా రాజీనామా



ఇన్ఫోసిస్ సీఈవో విశాల్ సిక్కా తన పదవికి ఆగస్టు 18న రాజీనామా చేశారు. సీఈవోగా తప్పుకొన్న సిక్కాను కంపెనీ ఎగ్జిక్యూటివ్ వైస్ ఛైర్మన్‌గా నియమించారు. తాత్కాలిక సీఈవో & ఎండీగా యూబీ ప్రవీణ్ రావును నియమించారు. 2014 జూన్ 12న సిక్కా ఇన్ఫోసిస్ సీఈవో & ఎండీగా బాధ్యతలు చేపట్టారు. 1986లో ఇన్ఫోసిస్‌లో చేరిన ఆయన ప్రస్తుతం చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. సీఐఐ నేషనల్ కౌన్సిల్, నాస్కామ్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్‌లో ప్రవీణ్ సభ్యుడిగా ఉన్నారు. ఇన్ఫోసిస్ బీపీవోకు కూడా ప్రవీణ్ ఛైర్మన్.

డబ్ల్యూహెచ్ఓ రాయబారి మిల్కాసింగ్

పరుగుల వీరుడు మిల్కాసింగ్ ప్రపంచ ఆరోగ్య సంస్థ సౌహార్ద రాయబారిగా నియమితులయ్యారు. దక్షిణాసియా ప్రాంతంలో శారీరక శ్రమ పెంపుదల ఆవశ్యకతపై ప్రచారం చేయడానికి మిల్కాను ప్రపంచ ఆరోగ్య సంస్థ ఎంపిక చేసింది. ఈ ప్రాంతంలో 2025 నాటికి శారీరక శ్రమ 90 శాతం ఉండేలా, అంటువ్యాధులు కాని రోగాల విస్తృతిని 25 శాతానికి పరిమితం చేసేలా డబ్ల్యూహెచ్ఓ కార్యాచరణ రూపొందించింది. దీనికి ప్రచారకర్తగా మిల్కాను నియమించింది.

పురస్కారం

శంకర్‌రావుకు రాష్ట్రపతి పోలీస్ శౌర్య పతకం

చత్తీస్‌గఢ్ పోలీస్ జవానుకు ఈ ఏడాది అత్యున్నత పోలీస్ పురస్కారం లభించింది. కమాండర్ శంకర్‌రావుకు మరణానంతరం 'రాష్ట్రపతి పోలీస్ శౌర్య' పతకాన్ని ప్రకటించారు. 2015లో నక్సల్స్‌తో జరిగిన పోరులో చత్తీస్‌గఢ్ పోలీస్ ప్లటూన్ కమాండర్ శంకర్‌రావు ప్రాణాలు కోల్పోయారు. పోలీస్ విభాగంలో అత్యున్నత పురస్కారంగా భావించే రాష్ట్రపతి పోలీస్ శౌర్య పతకాన్ని పొందారు.

ఐదుగురికి 'కీర్తిచక్ర'

శాంతి సమయంలో సైనికులకు ఇచ్చే రెండో అత్యున్నత పురస్కారం 'కీర్తిచక్ర'కి ఈ సారి ఐదుగురిని ఎంపిక చేశారు. వీరిలో ముగ్గురికి మరణానంతరం ప్రకటించారు. వారిలో గూర్ఖా రైఫిల్స్‌కి చెందిన హవాల్దార్ గిరిస్ గురుంగ్, నాగా రెజిమెంట్‌కు చెందిన మేజర్ డేవిడ్ మన్లుం, సీఆర్పీఎఫ్ 49వ బెటాలియన్ కమాండెంట్ ప్రమోద్ కుమార్ ఉన్నారు. గార్వారా రైఫిల్స్‌కు చెందిన మేజర్ ప్రీతం సింగ్, సీఆర్పీఎఫ్ సీనియర్ అధికారి చేతన్‌కుమార్ చీతా కీర్తిచక్ర పొందిన మిగిలిన ఇద్దరు.

క్రీడలు

బల్గేరియా ఓపెన్ విజేత లక్ష్యసేన్



బల్గేరియా ఓపెన్ బ్యాడ్మింటన్ పురుషుల సింగిల్స్ టైటిల్ విజేతగా భారత యువ క్రీడాకారుడు లక్ష్యసేన్ నిలిచాడు. బల్గేరియా రాజధాని సోఫియాలో జరిగిన టోర్నీ పురుషుల సింగిల్స్ ఫైనల్లో లక్ష్యసేన్ 18-21, 21-12, 21-17తో క్రోయేషియాకు చెందిన రెండో సీడ్ డుర్‌కిన్ జాక్‌పై గెలిచి టైటిల్ సొంతం చేసుకొన్నాడు. లక్ష్యకు ఇది రెండో అంతర్జాతీయ టైటిల్. గతేడాది ఇండియా ఇంటర్నేషనల్ సిరీస్ టైటిల్‌ను గెలుచుకొన్నాడు. ప్రస్తుతం జూనియర్ ప్రపంచ నెంబర్ వన్‌గా ఉన్న లక్ష్యసేన్‌కు సీనియర్ విభాగంలో ఇది రెండో అంతర్జాతీయ టైటిల్.

శ్రీలంకతో టెస్ట్ సిరీస్ క్లీన్‌స్వీప్



శ్రీలంకతో జరిగిన మూడు టెస్టుల సిరీస్‌ను భారత్ 3-0తో క్లీన్‌స్వీప్ చేసింది. విదేశీ గడ్డపై మూడు టెస్టుల సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేసిన తొలి భారత జట్టుగా కోహ్లీ సేన ఘనత సాధించింది. 'మ్యాన్ ఆఫ్ ద సిరీస్' శిఖర్ ధావన్‌కు, 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు హార్దిక్ పాండ్యకు లభించింది. చివరి టెస్టులో భారత ఇన్నింగ్స్ 171 పరుగులతో విజయం సాధించింది. తాజా విజయంతో టెస్టు ర్యాంకింగ్‌లో భారత్ 125 పాయింట్లతో అగ్రస్థానంలో కొనసాగుతోంది.

రోజర్స్ కప్ విజేత అలెగ్జాండర్

వింబుల్డన్ గెలిచి మంచి ఫామ్‌లో ఉన్న రోజర్ ఫెదరర్‌ను రోజర్స్ కప్ ఫైనల్లో జర్మనీ యువ ఆటగాడు అలెగ్జాండర్ జ్వెరెవ్ ఓడించాడు. మాంట్రియాల్‌లో జరిగిన ఫైనల్లో జ్వెరెవ్ 6-3, 6-4 తేడాతో ఫెదరర్‌ను ఓడించి కప్ గెలుచుకొన్నాడు. ఈ విజయంతో అలెగ్జాండర్ ప్రపంచ టెన్నిస్ ర్యాంకింగ్స్‌లో ఏడో స్థానానికి చేరుకొన్నాడు.

స్వయం ఉపాధి



మైనంపాటి శ్రీనివాసరావు
బిజినెస్ కన్సల్టెంట్
సెల్: 9866119816

మిక్స్‌డ్ నట్స్ స్నాక్స్

కారప్పూస, బూందీ, మురుకులు, మిక్చర్ వంటి సంప్రదాయ చిరు ఆహార పదార్థాలు; ఆలు చిప్స్, ఫ్రెంచి ఫ్రైస్, కుర్‌కురే, ఫ్రెయూమ్స్ వంటి ఆధునిక టైంపాస్ స్నాక్స్ గురించి మనందరికీ తెలుసు. వీటిలో కొన్ని వంటనూనెలో ఫ్రై చేసినవి కాగా మరికొన్ని ఎక్స్‌ట్రూడెడ్ ఆహార పదార్థాలు. మధ్యాహ్న సమయంలో టీ తోపాటు స్నాక్స్‌గా/ టైంపాస్ స్నాక్స్‌గా వీటిని ఎక్కువగా తింటుంటారు. ఈ ఆహార పదార్థాలు రుచిగా ఉన్నప్పటికీ కొన్ని రకాల అనారోగ్యాలకు కారణమౌతున్నాయి. అందుకే వీటికి ప్రత్యామ్నాయంగా సహజమైన గింజలను లేదా నట్స్‌ను తీసుకోవడం ఆరోగ్యానికి మంచిది. జీడిపప్పు, వేరుశనగ గింజలు, బఠాణీలు వంటివి మంచి బలవర్థకమైన పోషకవిలువలు ఉన్న నట్స్/ గింజలుగా పరిగణించవచ్చు. వీటిలో తక్కువ కార్బొహైడ్రేట్స్, అధిక పీచు పదార్థం, అధిక కేలరీల శక్తితోపాటు అధికంగా అన్‌శాచురేటెడ్ కొవ్వు ఉంటాయి. అందుకే ఇవి శరీరాన్ని ఆరోగ్యంగా పుష్టిగా ఉంచేందుకు తోడ్పడతాయి. వేరు శనగ గింజల్లో ఉండే మోనోశాచురేటెడ్ ఫాటీ యాసిడ్స్, రక్తంలోని చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించి మంచి కొలెస్ట్రాల్‌ను పెంచడానికి తోడ్పడుతున్నట్లు పరిశోధనల్లో వెల్లడయింది. అంతేకాకుండా వీటిలో పుష్కలంగా ఖనిజాలు, విటమిన్లు ఉండటం వల్ల ప్రతిరోజూ పిడికెడు వేరుశనగ గింజలను తినడం ఆరోగ్యానికి మంచిదని న్యూట్రిషనిస్ట్‌లు చెబుతున్నారు. జీడిపప్పులో అధిక అన్‌శాచురేటెడ్ కొవ్వు, విటమిన్ ఇ, మెగ్నీషియం, జింక్ ఖనిజాలు అధికంగా ఉంటాయి. జీడిపప్పును తినడం వల్ల గుండె సంబంధ వ్యాధులు రాకుండా నివారించవచ్చని, మధుమేహాన్ని కూడా రానివ్వదని పరిశోధకులు తెలియజేస్తున్నారు. బఠానీల్లో ఎముకల వృద్ధికి తోడ్పడే విటమిన్ కె, మాంగనీస్ ఖనిజాలు అధికంగా ఉంటాయి.



రెడీ టు ఈట్ స్నాక్స్ మార్కెట్: ఇటీవల మనదేశంలో ప్యాక్‌డ్ ఫుడ్ వినియోగం గణనీయంగా పెరుగుతూ వచ్చింది. ప్రస్తుతం రెడీ - టు - ఈట్ స్నాక్స్, నమ్‌కిన్స్ మార్కెట్ రూ.50,000 కోట్లకు పైగా ఉంది. 2014 - 19 కాలంలో సగటున ఏడాదికి 22 శాతం వృద్ధి ఉండవచ్చని పరిశ్రమ వర్గాల అంచనా. పల్లెలు, పట్టణాలు, నగరాల్లో మారుతున్న జీవన సరళి; నూతన ఉత్పత్తుల ఆవిష్కరణపై పెరుగుతున్న ఆసక్తి; పెరుగుతున్న రిటైలింగ్ ; ప్రభుత్వ ప్రోత్సాహకాల కల్పన వంటి కారణాల వల్ల రెడీ టు ఈట్ స్నాక్స్ మార్కెట్ రోజురోజుకీ వృద్ధి చెందుతోంది.

మిక్స్‌డ్ నట్స్ స్నాక్స్: పలు ఆరోగ్య అనుకూల లక్షణాలు ఉన్న అన్ని రకాల గింజలను కలిపి తినడం ద్వారా శరీరానికి మెరుగైన పలు పోషకాలు లభించడానికి అవకాశం ఉంటుంది. బఠాణీలు, జీడిపప్పు, వేరుశనగ వంటివాటిని నేరుగా తినడానికి వీలుగా ఉండేలా తయారుజేసి నిర్ణీత నిష్పత్తిలో వాటిని కలిపి ప్రత్యేకమైన ఒక ప్యాకెట్ ద్వారా అందివ్వడమే మిక్స్‌డ్ నట్స్ స్నాక్స్ యూనిట్ పని.

అవసరమైన యంత్ర పరికరాలు: ● ట్రే డ్రయ్యర్ ● రోస్టర్ ● ఫ్రయ్యింగ్ పాన్ ● కోటింగ్ పాన్ ● ప్యాకింగ్ మిషన్ ● తూనిక యంత్రాలు తదితరాలు

ముడి పదార్థాలు: ● జీడిపప్పు ● వేరుశనగ గింజలు ● డ్రై బఠాణీలు ● వంట నూనె ● ఉప్పు ● మసాలా దినుసులు ● ప్లాస్టిక్ ప్యాకింగ్ ఫిల్మ్ ● అట్టపెట్టెలు

తయారీ విధానం: బఠాణీలను ముందుగా 8 గంటలపాటు నీటిలో నానబెట్టి తరవాత నీరు తీసివేసి రోస్టింగ్ చేయాలి. బఠాణీల పై పొర తీసివేయాలి. వేరు శనగ గింజలను కూడా రోస్టింగ్ చేసి పైపొట్టు తీసివేయాలి. నాణ్యమైన జీడిపప్పును కూడా రోస్టింగ్ చేయాలి. ఈ మూడింటిని నిర్ణీత నిష్పత్తిలో కలిపి ఉప్పు చేర్చి రెడీ టు ఈట్ స్నాక్స్‌గా ప్యాక్ చేయాలి. వీటికి కొంత పరిమాణంలో మసాలా దినుసుల పొడి కలిపి మసాలా నట్స్‌గా కూడా తయారుచేయవచ్చు. మార్కెటింగ్ అవసరాల మేరకు 35గ్రా, 100గ్రా, 250గ్రా, 500గ్రా, 1 కిలో పరిమాణాల్లో ప్యాకెట్లను రూపొందించుకోవచ్చు. ఎక్కువగా 35గ్రా, 50గ్రా ప్యాకెట్స్ వినియోగదారులకు అనుకూలంగా ఉంటాయి.

మార్కెటింగ్: వినియోగదారుల సౌలభ్యం మేరకు అన్ని రకాల రిటైల్ దుకాణాల్లో, సూపర్ మార్కెట్లలో రెడి టు ఈట్ స్నాక్ ప్యాకెట్స్ అందుబాటులో ఉండే విధంగా ఏర్పాటు చేయాలి. బస్టాండ్‌లు, రైల్వే స్టేషన్లలో, బార్ & రెస్టారెంట్లలో వీటికి డిమాండ్ అధికంగా ఉంటుంది.

పరిశ్రమ వివరాలు:
ఉత్పత్తి సామర్థ్యం: 250 కేజీలు(ఒక రోజు - ఒక షిఫ్ట్‌కు)
పరిశ్రమ వ్యయం: రూ.25 లక్షలు

ఒక్క ఐడియా మార్చేసింది

● అనకాపల్లి జోనల్ కార్యాలయంలో చెత్త సమస్యకు మోక్షం
● నాడు దుర్గంధం.. నేడు నందనవనం
● జెడ్సీ సుభానీపై పట్టణవాసులు ప్రశంసల జల్లు



అనకాపల్లి పట్టణానికి గుదిబండగా మారిన చెత్త సమస్యకు జీవీఎంసీ జోనల్ కమిషనర్ షేక్ సుభానీ చెక్ పెట్టారు. జోనల్ కార్యాలయ ప్రాంగణం దుర్గంధభరితమైన వాతావరణంలో ఉండేది. ఇక్కడి పరిస్థితులను పూర్తిగా మార్పు చేసి నందన వనంలా తీర్చిదిద్దేందుకు నడుం బిగించారు.

- అనకాపల్లి

తొలుత శారదానగర్‌కు చెత్త తరలింపు

అరవయ్యేళ్ల కిందటే అనకాపల్లి మున్సిపాల్టీ. అప్పట్లో బహిరంగ మరుగుదొడ్లు, రోడ్లపైనే చెత్తకుప్పలు ఉండేవి. నాటి పాలకులు ఈ చెత్తకు శాశ్వత పరిష్కారం చూపాలన్న ఉద్దేశంతో కొంత స్థలాన్ని కేటాయించాలని భావించారు. దీంతో శారదానదికి అవతల కొత్తూరు పంచాయతీ పరిధిలో కొంత స్థలాన్ని మున్సిపాల్టీ కొనుగోలు చేసింది. సర్వే నంబరు 801/1లో 7.25ఎకరాల భూమిని తీసుకుని ఎడ్ల బండ్ల ద్వారా చెత్తను తీసుకు వెళ్లేవారు.

చెత్త పెరిగింది.. అభ్యంతరం మొదలైంది

కాలక్రమేణా అనకాపల్లి పట్టణ జనాభా పెరిగింది. చెత్త కూడా పెరిగింది. మొదట్లో టన్ను చెత్త రావడం గగనంగా ఉండేది. ప్రస్తుతం పట్టణంలో 65 మెట్రిక్ టన్నుల చెత్త ఉత్పత్తి అవుతోంది. భారీగా చెత్తను శారదానగర్‌కు తరలించడం వల్ల అక్కడ కొండలా పేరుకుపోయింది. సుమారు పదేళ్ల కిందట డంపింగ్ యార్డులో పేరుకుపోతున్న చెత్తను ఎప్పటికప్పుడు తొలగించేందుకు కోరమాండల్ కంపెనీకి మున్సిపాలిటీ కాంట్రాక్టు ఇచ్చింది. ఇందుకు సదరు కంపెనీ ఏడాదికి లక్ష రూపాయలు మున్సిపాలిటీకి చెల్లించేది. ఆ ఒప్పందం మేరకు కోరమాండల్ కంపెనీ శారదానగర్ కంపోస్టు యార్డులోనే యంత్రాలను ఏర్పాటు చేసి వారికి అవ సరమైన సేంద్రియ ఎరువును తయారు చేసి తీసుకుపోయేవారు. మిగిలిన ప్లాస్టిక్ వ్యర్థాలకు రాత్రివేళ నిప్పు అంటించేవారు. ఈపొగ వల్ల శారదానగర్ వాసులకు ఇబ్బందులకు తలెత్తండంతో దశలవారీగా ఆందోళనలు చేపట్టారు.

జెడ్సీ సుభానీ చొరవతో సమస్యకు పరిష్కారం

రెండేళ్ల క్రితం అనకాపల్లి జోనల్ కమిషనర్‌గా వచ్చిన సుభానీ కంపోస్టు యార్డు రూపురేఖల్ని మార్చేశారు. ముందుగా కార్యాలయ ప్రాంగణంలో ఉన్న చెత్తనంతటినీ పూర్తిగా తొలగించేశారు. అప్పటి నుంచి ఏ పూటకా పూట చెత్త తరలిపోయేలా చర్యలు తీసుకున్నారు.

2013 నుంచి జోనల్ కార్యాలయ ప్రాంగణంలోనే డంపింగ్

2013లో అప్పటి మంత్రి గంటా శ్రీనివాసరావు శారదానగర్ ప్రజల కష్టాలను చూసి అక్కడ చెత్త వేయడానికి వీల్లేదని తేల్చి చెప్పారు. దీంతో అప్పటి మున్సిపల్ అధికారులు ఇరుకున పడ్డారు. చెత్త ఎక్కడ వేయాలో తెలియక జోనల్ కార్యాలయ ప్రాంగణంలోనే వేసుకొని అక్కడి నుంచి విశాఖనగరంలో ఉన్న కాపులుప్పాడకు తరలించేవారు. ఎప్పటికప్పుడు చెత్త తరలించకపోవడం వల్ల స్థానికుల నుంచి తీవ్ర అభ్యంతరం వ్యక్తమయ్యేది.



జోనల్ కార్యాలయ ప్రాంగణంలో వేసిన చెత్త (ఫైల్ ఫొటో)



జోనల్ కార్యాలయ ప్రాంగణంలో నాటిన కొబ్బరి మొక్కలు

నందన వనంలా కార్యాలయ ఆవరణ

జోనల్ కార్యాలయ ఆవరణలో చెత్త వేయడానికి కేవలం ఐదారు సెంట్ల స్థలాన్ని మాత్రమే ఉంచి మిగిలిన ప్రాంతంలో మొక్కలు నాటి గార్డెన్‌లా తీర్చిదిద్దుతున్నారు. అలాగే సేంద్రియ ఎరువులు తయారీ యూనిట్, వర్మీ కంపోస్టు యూనిట్ ఏర్పాటు చేసి సారవంతమైన ఎరువులు కూడా తయారు చేస్తున్నారు. ఇదంతా చూసినవారు జోనల్ కమిషనర్‌ను ప్రశంసలతో ముంచెత్తుతున్నారు.



జోనల్ కార్యాలయ ప్రాంగణంలో నాటిన మొక్కలు

సాలూరు కంపోస్టు యార్డులో నా కుమార్తె వివాహం చేశాను

- ఎస్‌కే సుభానీ, జెడ్సీ, అనకాపల్లి



కంపోస్టు యార్డు సమస్య పరిష్కారానికి అందరి కృషి అవసరం. సాలూరులో ఇలాంటి సమస్యే ఎదురైతే అందరి సహకారంతో పరిష్కరించి అదే కంపోస్టు యార్డు ప్రాంగణంలో నా కుమార్తె వివాహం చేశాను. దేశవ్యాప్తంగా ఎన్నో ప్రశంసలు అందుకున్నాను. అదేమాదిరిగా ఇక్కడి కంపోస్టు యార్డు సమస్యను కూడా పరిష్కరించేందుకు నిర్ణయించాను. ఇప్పటికే 70శాతం శానిటేషన్‌లో మార్పు తీసుకొచ్చాను. మరో ఆరు నెలలు గడిస్తే పూర్తిస్థాయిలో సమస్య పరిష్కరిస్తాను.

నేడు అమెరికాలో సంపూర్ణ సూర్యగ్రహణం

తగ్గనున్న హరికేన్ తీవ్రత

విశాఖపట్నం, (ఆంధ్రజ్యోతి): సుమారు 100 ఏళ్ల తరువాత అమెరికాలో సంపూర్ణ సూర్యగ్రహణం సోమవారం ఏర్పడనున్నది. ఈ గ్రహణం అమెరికా సంయుక్త రాష్ట్రాల్లో సంపూర్ణంగా కనిపించనున్నది. అమెరికాలో ప్రధానంగా 12 రాష్ట్రాల్లో దీని ప్రభావం పూర్తిగా వుంటుంది. అమెరికా కాలమాన ప్రకారం మధ్యాహ్నం 12.30కు ప్రారంభమై రెండు గంటల వరకు వుంటుంది. ఆయా ప్రాంతాలను దాదాపు రెండు గంటలపాటు చీకటి కమ్మేయనున్నది. చాలాకాలం తరువాత ఏర్పడబోయే సంపూర్ణ సూర్యగ్రహణం ప్రస్తుతం అట్లాంటిక్ మహాసముద్రంలో వున్న హరికేన్ (తుఫాన్)తీవ్రత తగ్గించనున్నది. సూర్యగ్రహణం హరికేన్ మీదుగా వెళుతుండంతో అక్కడ ఉష్ణోగ్రతలు తగ్గుతాయని విశాఖకు చెందిన క్లైమేట్‌చేంజ్‌పై పరిశోధనలు చేస్తున్న నలనాగుల మనోజ్ వెల్లడించారు. సోమవారం అమెరికాలో ఏర్పడబోయే సంపూర్ణ సూర్యగ్రహణంపై ఆయన రాసిన పరిశోధనా వ్యాసం అంతర్జాతీయ సైన్స్ జర్నల్ 'రిసెర్చి గేట్'లో ప్రచురితమైంది. పరిశోధనలో అంశాలు పరిశీలిస్తే... సూర్యగ్రహణం ఏర్పడే సమయంలో దాని నుంచి వచ్చే నీడ సూపర్‌సోనిక్ వేగంతో పయనిస్తుంది. ట్రోపో ఆవరణంలో ఉష్ణోగ్రతలు రెండు డిగ్రీల వరకు తగ్గుతాయి. తద్వారా సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు కూడా తగ్గుతాయి. సూర్యగ్రహణం వల్ల అమెరికాలో వర్షం కురుస్తుంది. సూర్యగ్రహణం పయనం పరిశీలిస్తే ప్రస్తుతం అట్లాంటిక్ మహాసముద్రంలో నాలుగు రోజుల క్రితం ఏర్పడిన హరికేన్ (దీని పేరు జీఈఆర్‌టీ. సాధారణంగా జూన్ నుంచి నవంబరు వరకు అట్లాంటిక్ సముద్రంలో హరికేన్‌ల సీజన్. సెప్టెంబర్‌లో హరికేన్‌ల తీవ్రత ఎక్కువ)మీదుగా వెళ్లనున్నది. నీడ వల్ల వాతావరణంలో పీడనశక్తి, గాలిలో తేమ శాతం పెరుగుతాయి. గ్రహణంతో ట్రోపో ఆవరణం నీడతో కప్పబడుతుంది. గ్రహణం నీడ వల్ల హరికేన్‌లో ఉష్ణోగ్రతలు తగ్గుతాయి. కనీసం రెండు డిగ్రీలు ఉష్ణోగ్రతలు తగ్గడంతో హరికేన్ ఐ తీవ్రత తగ్గి దాని పరిధి మరింతగా విస్తరించనున్నది. అయితే భారత్‌లో ఆ సమయం రాత్రి కావడంతో గ్రహణం చూసే అవకాశం వుండదు.

తుఫాన్‌ల తీవ్రత తగ్గించే మోడల్ ఇది

సోమవారం అమెరికాలో కనిపించే సంపూర్ణ సూర్యగ్రహణం 12 రాష్ట్రాల్లో ప్రభావం చూపుతుంది. సూర్యగ్రహణంతో వచ్చే నీడ ఈ ప్రాంతంతోపాటు అట్లాంటిక్ మహాసముద్రంలో ప్రస్తుతం వున్న హరికేన్ మీదుగా పయనించనున్నది. దాదాపు రెండుగంటలపాటు పూర్తిగా సూర్యుడు కనిపించకపోవడంతో ఆ ప్రాంతంలో వాతావరణం అనేక మార్పులు రానున్నాయి. వాతావరణంలో ఉష్ణోగ్రతలు తగ్గుతాయి. హరికేన్ తీవ్రత తగ్గుతుంది. గతంలో సంభవించిన సూర్యగ్రహణాలు, ఇతర విపత్తుల సమయంలో వాతావరణ మార్పులపై జరిగిన పరిశోధనలను పరిగణనలోకి తీసుకున్నాను. గ్రహణం నుంచి ఏర్పడే నీడ ప్రయాణంతో హరికేన్ బలహీనపడనున్నది. అటువంటి ప్రయెగాలు తుఫాన్‌ల సమయంలో చేపట్టవచ్చు. తుఫాన్‌లు ఏర్పడే సమయంలో దానిపై కృత్రిమ నీడ సృష్టించగలిగితే తీవ్రత తగ్గించవచ్చు. నీడ వల్ల తుఫాన్ ఐ ప్రాంతంలో ఉష్ణోగ్రతలు తగ్గి తీవ్రత నెమ్మదిస్తోంది. ఇది నష్ట నివారణ చర్యలకు ఉపయోగం కలుగుతుంది.

నలనాగుల మనోజ్

మిగులు టీచర్ల విధులు ఎక్కడ?

(మొదటిపేజీ తరువాయి)

పాఠశాల విద్యాశాఖ నుంచి ఆదేశాలు రాలేదు. మిగులు టీచర్లపరిస్థితి ఎలా ఉందంటే... రేషనలైజేషన్, అప్‌గ్రేడ్ నేపథ్యంలో ఇప్పటివరకు పనిచేసిన పోస్టులు రద్దు లేదా అప్‌గ్రేడ్ అయ్యాయి. అయినా టీచర్లు గతంలో పనిచేసిన చోటే ఇంకా కొనసాగుతున్నారు. ఇలా మిగిలిన టీచర్లను కొందరు ప్రధానోపాధ్యాయులు తమ పాఠశాలల్లో పని కల్పిస్తున్నారు. మరికొందరు తమకెందుకీ తలనొప్పి అంటూ మిన్నకుండిపోతున్నారు. డీఈవో పూల్‌లో వున్న టీచర్లకు ప్రత్యేకంగా రిజిస్టర్ ఏర్పాటు చేయాలని విద్యాశాఖ ఆదేశించింది. విద్యార్థులు ఎక్కువగా వుంటూ టీచర్లు తక్కువగా వున్న పాఠశాలల్లో మిగులు టీచర్ల సేవలు వినియోగించాలని విద్యాశాఖ నిర్ణయించింది. అంతకుమించి మరో మార్గం లేదు. ఎందుకంటే వీరందరికీ కూర్చోబెట్టి వేతనాలు ఇవ్వడం సాధ్యం కాదు. కాబట్టి పని సర్దుబాటు చేయాల్సిందే. భారం ఎక్కువగావున్న పాఠశాలలకే పని సర్దుబాటు కల్పించాల్సి వున్నందున అటువంటి పాఠశాలలు విశాఖ నగర పరిసరాల్లో ఎక్కువగా వున్నాయి. ఈ నేపథ్యంలో డీఈవో పూల్‌లో వున్న మిగులు టీచర్లలో కొందరు అప్పుడే పైరవీలు ప్రారంభించారు. తమకున్న పలుకుబడితో నగర పరిసరాల పాఠశాలల్లో పోస్టింగ్‌లకు ప్రయత్నాలు చేస్తున్నారు. అధికార పార్టీ నేతల చుట్టూ ప్రదక్షిణలు కొనసాగిస్తున్నారు. జిల్లాలో మారుమూల ప్రాంతాల్లో పాఠశాలల్లో కొరత వున్నా అటువైపుగా టీచర్లు వెళ్లడానికి మొగ్గుచూపే అవకాశం వుంది. కాగా మిగులు టీచర్ల పోస్టింగ్‌లపై పాఠశాల విద్యాశాఖ షెడ్యూల్ ఖరారు చేయాల్సి వుంది. సీనియార్టీ మేరకు పోస్టింగ్‌లు ఇవ్వాలని పాఠశాల విద్యాశాఖ యోచిస్తోంది. అవసరం వున్న పాఠశాలలను గుర్తించి ఎంతమంది టీచర్లకు అక్కడకు పంపాలి అనేది విద్యాశాఖ ప్రతిపాదనలు సిద్ధం చేసే పనిలో పడింది. డీఈవో పూల్‌లో వున్న టీచర్లలో కొందరికి ప్రయోజనం కలగవచ్చు. మరికొందరు మారుమూల ప్రాంతాల్లో పాఠశాలలకు వెళ్లే అవకాశం వుంది. మిగులు టీచర్లలో ఎక్కువ మంది విశాఖ నగర పరిసరాల్లో పోస్టింగ్ తీసుకునే అవకాశం వుంది. గత నెలలో జరిగిన కౌన్సెలింగ్‌లో సీనియర్లంతా జిల్లాలో అనేక ప్రాంతాలకు బదిలీ అయ్యారు. వీరి కంటే జూనియర్లు డీఈవో పూల్‌లోకి రావడంతో ప్రస్తుతం ఇబ్బంది వున్నా తరువాత నగర పరిసరాల్లో పోస్టింగ్ లభిస్తుందని టీచర్లు కొందరు అభిప్రాయపడుతున్నారు.

వేతనాలపై ఆందోళన

జిల్లాలో నాలున్నర వేల మంది టీచర్లకు ఇటీవల బదిలీ చేశారు. వీరిలో కొందరు అప్‌గ్రేడ్ అయిన పాఠశాలల్లో పోస్టింగ్ పొందారు. బదిలీ అయిన టీచర్, అప్‌గ్రేడ్ పోస్టులోకి వచ్చిన టీచర్ల వివరాలు విద్యాశాఖ అటు ట్రెజరీకి, ఇటు సంబంధిత పాఠశాలకు పంపాలి. లేదంటే వేతనాల బట్వాడాలో సమస్య ఉత్పన్నమవుతుంది. ఈనెల 25లోగా వేతనాల బిల్లులు ట్రెజరీకి పంపాలి. డీఈవో పూల్‌లో వున్న టీచర్లకు వేతనాలు ఇవ్వాలంటే వారంతా ఎక్కడో ఒకచోట పనిచేసినట్టు చూపాలి. లేకపోతే వేతనాలు ఇవ్వడం సాధ్యంకాదు. దీనిపై విద్యాశాఖ చర్యలు తీసుకోవాలని టీచర్లు కోరుతున్నారు.

వేతనాల బట్వాడాపై చర్యలు తీసుకోవాలి

టీచర్ల వేతనాలకు 25లోగా బిల్లులు ట్రెజరీకి పంపాలి. అయితే అప్‌గ్రేడ్ అయిన పోస్టులో వచ్చిన టీచర్, మిగులులో వున్న టీచర్ల విషయంలో కొంత ఆందోళన కొనసాగుతున్నది. పోస్టుఅప్‌గ్రేడ్ అయిన విషయం ట్రెజరీకి విద్యాశాఖ సమాచారం ఇవ్వాలి. ఇంకా ఏంఈవో, సంబంధిత ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడికి ఉత్తర్వుల కాపీలు అందించాలి. ప్రధానోపాధ్యాయుడే టీచర్ల వేతనాల బిల్లులు పంపాలి కాబట్టి ప్రొసీడింగ్స్ మేరకు అప్‌లోడ్ చేస్తారు. విద్యాశాఖ అందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలి.

ఈ.పైడిరాజు, ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి

వేతనాల బట్వాడాపై ఖజానాకు సమాచారం

అప్‌గ్రేడ్ అయిన టీచర్ల నుంచి మిగులు టీచర్ల వరకు బదిలీపై కొత్త పాఠశాలలకు వెళ్లే ఉపాధ్యాయుల వేతనాల బట్వాడాకు ఇబ్బంది వుండదు. వేతనాలకు సంబంధించి ఇబ్బంది లేకుండా అందరి వివరాలు ట్రెజరీకి పంపాం. టీచర్లు ఆందోళన చెందనక్కర్లేదు. కాగా మిగులు టీచర్ల పోస్టింగ్‌పై పాఠశాల విద్యాశాఖకు నివేదించాం. రెండుమూడు రోజుల్లో పాఠశాల విద్యాశాఖ నుంచి ఆదేశాలు వస్తాయని ఆశిస్తున్నాం. మిగులు టీచర్లకు నగర పరిసరాలే కాదు మారుమూల ప్రాంతాల్లో ఖాళీల్లో నియమిస్తాం. మారుమూల ప్రాంతాల్లో విద్యార్థులకు సరిపడ టీచర్లు అవసరం వుందని గుర్తించాం.

జి.నాగమణి, డీఈవో,

వైభవంగా 108 కలశాల ఊరేగింపు

- మంగవరంలో ఘనంగా చిట్టిపైడమ్మ పండుగ
- ప్రతి ఇంటా బోనాల సంబరం


కలశాలతో ఊరేగింపుగా వెలుతున్న మహిళలు (అంతర చిత్రం) అమ్మవారు

పాయకరావుపేట : మండలంలోని మంగవరం చిట్టిపైడమ్మ (గూనాలమ్మ) పండుగ ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా గ్రామస్థులు ఉదయం పసుపునీటిని 108 కలశాలతో ఊరేగింపుగా వెళ్లి గ్రామ శివారున ఉన్న చిట్టిపైడమ్మతల్లి ఆలయంలో అమ్మవారికి అభిషేకం చేశారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతి ఇంటా బోనాల సంబరం నిర్వహించారు. అమ్మవారి పండుగ సందర్భంగా రాత్రి 9 గంటలకు నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అందరనీ అలరించాయి. మంగవరం గ్రామ వన దేవతగా వెలసిన చిట్టిపైడమ్మతల్లికి ఏటా వర్షాలు పడాలని, పంటలు బాగా పండాలని కోరుకుంటూ పండుగను జరుపుకోవడం ఆనవాయితీ. పండుగ సందర్భంగా గ్రామంలో బంధు, మిత్రులతో కళకళలాడింది.

ఉపాధ్యాయులకు పదోన్నతుల పండుగ

- ఏకీకృత సర్వీసు రూల్సు అమలు కమిటీ ఏర్పాటు
- పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి డి.జి.నాథ్


విలేకరులతో మాట్లాడుతున్న డి.జి.నాథ్

చోడవరం: ఏకీకృత సర్వీసు రూల్సు అమలుకు రాష్ట్ర ప్రభుత్వం కమిటీని ఏర్పాటు చేసిందని, త్వరలో ఉపాధ్యాయులకు పదోన్నతులు లభించే అవకాశం ఉందని పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి డి.జి.నాథ్ తెలిపారు. ఆదివారం స్థానిక కె.కాలనీ పాఠశాలలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉపాధ్యాయులు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న డిప్యూటీ డీఈవో, జూనియర్ లెక్చరర్లు, డైట్ లెక్చరర్లు తదితర క్యాడర్ల పదోన్నతులకు మార్గం సుగమం కానుందని తెలిపారు. పదవీ విరమణ చేసిన ఉపాధ్యాయులకు 300 రోజులు లీవులు నగదుగా మార్చుకునే అవకాశం ప్రభుత్వం కల్పించిందని, ఈ మేరకు త్వరలో ఉత్తర్వులు వె లువడనున్నాయని తెలిపారు. ఇందుకు సంబంధించిన ఫైలుపై సీఎం సంతకం చేశారన్నారు. ఉత్తర్వులు ఈనెలలో విడుదల కానున్నాయని చెప్పారు. జిల్లాలో పీఈటీ పండిట్ల కౌన్సెలింగ్ పూర్తయినందున వారు ఎంపిక చేసిన పాఠశాలల్లో చేరేలా అధికారులు ఉత్తర్వులు జారీ చేస్తున్నారని తెలిపారు. పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకానికి కోడిగుడ్లు సకాలంలో సరఫరా చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. హెల్త్‌కార్డులపై అన్ని ఆసుపత్రులలో నగదు రహిత వైద్యం అమలయ్యేలా చూడాలని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి కామినేని కోరినట్టు తెలిపారు. ఏపీజీఎల్ఐ, జడ్పీ పీఎఫ్ ఖాతాల అప్‌డేట్‌కు అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సర్వశిక్ష అభియాన్‌లో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ సిబ్బంది వేతనాల పెంపునకు కృషి చేసిన ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులునాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో పీఆర్‌టీయూ నాయకులు మురళి, ఎం.వి.స్వామి, జుంజూరు అప్పారావు, చీడికాడ నాయకులు డి.శ్రీనివాస్, ఈ.ప్రసాద్, టి. తారకేసు, ఆర్.గంగరాజు, వెంకట్రామ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయాభివృద్ధికి ప్రభుత్వం సహకరించాలి

- గిట్టుబాటు ధర ఇవ్వాలి
- మార్కెటింగ్ సదుపాయం కల్పించాలి
- భారతీయ కిసాన్ సంఘ్ అఖిల భారత సంఘటన కార్యదర్శి దినేశ్ దత్తాత్రేయ కులకర్ణి


మాట్లాడుతున్న కులకర్ణి

విశాఖపట్నం : దేశ వ్యాప్తంగా అనేక రాష్ట్రాలలో వివిధ కులాల వారు రిజర్వేషన్ కోసం పోరాడుతున్నారని, వారంతా ఒక్కప్పుడు రైతు కుటుంబానికి చెందిన వారేనని భారతీయ కిసాన్ సంఘ్ అఖిల భారత సంఘటన కార్యదర్శి దినేశ్ దత్తాత్రేయ కులకర్ణి అన్నారు. ఆదివారం ఏయూలోని డాక్టర్ వై.వి.ఎస్.మూర్తి ఆడిటోరియంలో నిర్వహించిన 'వ్యవసాయ, గ్రామీణ భారతం- సవాళ్ల పరిష్కారం' కార్యక్రమానికి కులకర్ణి ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ రంగం సంక్షోభంలో ఉందని, ఇబ్బందికర పరిస్థితిని ఎదుర్కొంటోందని అన్నారు. ప్రభుత్వం ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుతం రోజుకు 2500 మంది వ్యవసాయాన్ని వీడి గ్రామాల నుంచి వలసలు పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వీటిని అరికట్టాల్సిన బాధ్యత అందరిపైన ఉందన్నారు. 16, 17 శతాబ్దాలలో దేశంలో బలమైన ఆర్థిక వ్యవస్థ ఉండేదని, దీనికి వ్యవసాయం, వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు ఉండడమే కారణమన్నారు. ఆంగ్లేయులు ఈ పరిస్థితిని గమనించి వ్యవసాయ వ్యవస్థను నాశనం చేశారన్నారు. లాల్ బహుదూర్ శాస్త్రి ప్రధానిగా ఉన్నప్పుడు వ్యవసాయ రంగం బాగా అభివృద్ధి చెందిందన్నారు. రైతులను ఆదుకోవడం రుణమాఫీతో మాత్రమే పరిష్కారం కాదని, గిట్టుబాటు ధర ఇవ్వడం, మార్కెటింగ్ సదుపాయం కల్పించడం, గ్రామాలలోనే ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేయడం ద్వారా వ్యవసాయాభివృద్ధికి తోడ్పాటు అందించవచ్చని కులకర్ణి సూచించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ పి.వి.చలపతిరావు, ఎంపీ డాక్టర్ కె.హరిబాబు, గోపాలరావు ఠాగూర్ స్మారమ సమితి రాష్ట్ర అధ్యక్షులు జి.ఆర్. కరుణాకర్, ఎమ్మెల్సీ మాధవ్, ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు, సమితి కోశాధికారి టి.సుబ్బరామిరెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమంలో నగరానికి చెందిన ప్రముఖులు వడ్లమూడి బ్రహ్మానందరావు, పప్పు శ్రీరామమూర్తి, దువ్వూరి సత్యనారాయణ మూర్తిలను అతిథులు సత్కరించారు.

అనకాపల్లి మార్కెట్ ధరలు

కూరగాయలు (కిలో)



ఉల్లిపాయలు	రూ.35
బంగాళదుంపలు	రూ.15
టొమేటో	రూ.50
వంకాయలు(తెల్లవి)	రూ.30
వంకాయలు(నల్లవి)	రూ.30
బీరకాయలు	రూ.30
బెండకాయలు	రూ.30
దొండకాయలు	రూ.30
క్యారెట్	రూ.40
క్యాబేజీ	రూ.25
బీన్స్	రూ.70
కొబ్బరి కాయ(చిన్నది)	రూ.10
కొబ్బరికాయ(పెద్దది)	రూ.15
బీట్‌రూట్	రూ.40
మిర్చి	రూ.50
చిక్కుడు	రూ.--
గోరుచిక్కుడు	రూ.30
బరబాటీ	రూ.40
అల్లం	రూ.60
చేమదుంపలు	రూ.40
దోసకాయ	రూ.30
కాకరకాయలు	రూ.40
ఆనపకాయ(చిన్నది)	రూ.10
ఆనపకాయ(పెద్దది)	రూ.15
అరటికాయలు (మూడు)	రూ.20


పప్పు దినుసులు (కిలో)

కందిపప్పు	రూ.65
పెసరపప్పు	రూ.65
మినపపప్పు	రూ.70
శనగ పప్పు	రూ.75
పంచదార	రూ.44
ఇడ్లీనూక	రూ.30
గోధుమ రవ్వ	రూ.34
చింతపండు	రూ.100
మైదా	రూ.28

నూనె ధరలు (లీటర్)

పామోలిన్	రూ.62
సన్‌ఫ్లవర్	రూ.82
వేరుశనగ	రూ.120
కొబ్బరి	రూ.120
డాల్డా (కిలో)	రూ.70

కోడి గుడ్లు(నెక్)



వంద గుడ్లు రూ.లలో	
విశాఖపట్నం	362
విజయనగరం	366
శ్రీకాకుళం	366

చికెన్ ధరలు

	వెన్‌కాబ్	బ్యాగ్
లైవ్ ధర	93.00	90.00
విత్ స్కిన్	130.00	150.00
స్కిన్ లెస్	153.00	160.00

బెల్లం ధరలు(రూ.లలో)

	కనిష్ఠ	గరిష్ఠ
మొదటి రకం	--	--
రెండో రకం	--	--
మూడో రకం	--	--

దినఫలాలు

అదృష్టసంఖ్యలు : 2, 3

మేషరాశి: (మార్చి21-ఏప్రిల్20): విద్యా విషయాల్లో ఆటంకాలు ఎదురవుతాయి. ప్రేమ బెడిసికొట్టే అవకాశం ఉంది. సృజనాత్మకంగా వ్యవహరించి లక్ష్యాలు సాధిస్తారు. పొదుపు పథకాలు, పెట్టుబడుల విషయంలో ఆచితూచి ముందడుగు వేయండి.

వృషభరాశి: (ఏప్రిల్21-మే20): కుటుంబ వ్యవహారాలు మనస్తాపం కలిగిస్తాయి. బదిలీ ప్రయత్నాలు ఫలించకపోవచ్చు. కార్యాలయంలో కొంత అసౌకర్యానికి గురవుతారు. వాయిదా పడుతున్న పనులు పట్టుదలతో పూర్తి చేస్తారు.

మిథునరాశి: (మే21-జూన్21): విద్యార్థులు లక్ష్య సాధనకు పట్టుదలతో కృషి చేయాల్సి ఉంటుంది. వాహనాల కారణంగా అసౌకర్యానికి గురవుతాయి. రిప్రజెంటేటివ్‌లు, ఏజెంట్లకు శ్రమాధిక్యం. సమావేశాల్లో మాటపడాల్సి వస్తుంది.

కర్కాటకరాశి: (జూన్22-జూలై23): బ్యాంకులు, ఆర్థిక సంస్థలతో పనులకు అటంకాలు కలిగే అవకాశం ఉంది. డిపాజిట్లపై మంచి ప్రతిఫలం అందుకుంటారు. రుణప్రయత్నాలు ఫలించకపోవచ్చు. ఖర్చులు అదుపులో పెట్టుకోవాలి.

సింహరాశి: (జూలై24-ఆగస్ట్23): మనసును ఏదో వెలితి బాధిస్తుంది. చేపట్టిన పనులకు ఆటంకాలు ఎదురువుతాయి. కొత్తగా చేపట్టే పనుల ప్రారంభాన్ని వాయిదా వేయండి. అన్ని విషయాల్లో శ్రమాధిక్యం తప్పకపోవచ్చు.

కన్యారాశి: (ఆగస్ట్24-సెప్టెంబర్23): ఉన్నత విద్య, విదేశీ వ్యవహారాల్లో అవాంతరాలు ఎదురవుతాయి. దీర్ఘకాలంగా వాయిదా పడుతున్న పనులు పట్టుదలతో పూర్తి చేస్తారు. రహస్య సమాచారం అందుకుంటారు.

తులారాశి: (సెప్టెంబర్24-అక్టోబర్23): మ్యూచువల్ ఫండ్స్, బ్యాంక్ డిపాజిట్లు, పొదుపు పథకాల వ్యవహారాలకు అనుకూల సమయం కాదు. సన్నిహితుల సహకారంతో ఆర్థికపరమైన లక్ష్యాలు సాధిస్తారు. స్నేహానుబంధాలు బలపడతాయి.

వృశ్చికరాశి: (అక్టోబర్24-నవంబర్22): ఉద్యోగ, వ్యాపారాల్లో అనుకోని చికాకులు ఎదురవుతాయి. పెద్దల ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపించాలి. గౌరవ, ప్రతిష్ఠలకు భంగం కలిగే అవకాశం ఉంది. సంకల్ప సాధనకు పట్టుదలతో కృషి చేస్తారు.

ధనూరాశి: (నవంబర్23-డిసెంబర్21): ప్రణాళిక లోపించడం వల్ల లక్ష్యాలు సాధించలేకపోతారు. న్యాయపరమైన వివాదాలకు ఆస్కారం ఉంది. సమావేశాలు, చర్చలు, వ్యూహరచనలకు అనుకూలం. విద్యార్థులకు శుభప్రదం.

మకరరాశి(డిసెంబర్22-జనవరి21): ఆస్పత్రులు, బ్యాంకులు, చిట్‌ఫండ్‌లు, మ్యూచ్యువల్ ఫండ్ రంగాల వారికి ఆర్థికంగా నిరుత్సాహకరం. గ్రాట్యుటీ, బీమా, పింఛన్ వ్యవహారాలు కొలిక్కి వస్తాయి. బాధాకరమైన సమాచారం అందుకుంటారు.

కుంభరాశి: (జనవరి22-ఫిబ్రవరి18): ఆర్థిక విషయాల్లో భాగస్వామి వైఖరి మనస్తాపం కలిగిస్తుంది. వేడుకల్లో ఖర్చులు అంచనాలు మించుతాయి. స్పెక్యులేషన్లు, పెట్టుబడుల్లో నష్టాలు తప్పకపోవచ్చు. సమావేశాల్లో కీలకపాత్ర పోషిస్తారు.

మీనరాశి:(ఫిబ్రవరి19మార్చి20): వ్యవసాయం, పరిశ్రమలు, హోటల్ రంగాల వారు లక్ష్య సాధనకు అధికంగా శ్రమించాలి. విందుల్లో పరిమితి పాటించాలి. ఇంటర్వ్యూలలో నిరాశ తప్పకపోవచ్చు. ఆస్పత్రులు సందర్శించాల్సి రావచ్చు.

-బిజుమళ్ళ బిందుమాధవ శర్మ

జంబ్లింగ్ వర్డ్స్

1. WLKA ▸ ....
2. NGKI ▸ ....
3. DMBU ▸ ....
4. MEUT ▸ ....

జంతర్‌మంతర్

1. ద్భుఅతం ▸ ....
2. తణంక్ష ▸ ....
3. త్తిడిఒ ▸ ....
4. సంవికా ▸ ....

చెప్పగలరా?

పాలులో ఉన్నా కానీ వేలులో లేను
యతిలో ఉన్నా కానీ గతిలో లేను
సందులో ఉన్నా కానీ విందులో లేను
అయితే ఇంతకీ నేనెవర్నో చెప్పగలరా?

సూక్తి

మనం ఉన్నతంగా ఎదగడానికీ, నష్టపోవడానికీ కారణం మన ఆలోచనలే.

రోబోల రికార్డ్ బ్రేక్ డ్యాన్స్

రోబో స్టెప్పు వేస్తే.. అదిరి పోతుంది కదూ! మరి ఒకేసారి వెయ్యికి పైగా రోబోలు కదం తొక్కితే.. డ్యాన్సులు చేసి అదరగొడితే అద్భుతం కదా! ఒకే సైజులోని రోబోలన్నీ కాలంలో ఒకే రీతిలో డ్యాన్స్ చేసి 'గిన్నిస్ పుటల్లో' స్థానం పొందాయి.

సాంకేతిక పరిజ్ఞానంతో అభివృద్ధి పరిచిన 1069 రోబోలు విభిన్నంగా డ్యాన్స్ చేసి చూపరులను ఆకట్టుకున్నాయి. ప్రపంచ రికార్డును సాధించి గిన్నిస్ పుటలకెక్కాయి. డబ్ల్యు.ఎల్ ఇంటిలెజెంట్ టెక్నాలజీ కంపెనీ లిమిటెడ్ వీటిని రూపొందించింది. 'వన్ గ్రూప్ కంట్రోల్ సిస్టమ్' ప్రోగ్రామ్ ఆధారంగా ఇవి ఏకకాలంలో డ్యాన్స్ చేశాయి. చిందులతో కదం తొక్కిన ఆ రోబోల పేరు 'దోబి'. చైనాలో గతంలో జరిగిన బీర్ ఫెస్టివల్ సందర్భంగా నిర్వహించిన వేడుకల్లో 1007 రోబోలు బ్రేక్ డ్యాన్స్ చేసి గిన్నిస్ రికార్డు సృష్టించాయి. ఆ రికార్డును 'దోబి' రోబోలు ప్రస్తుతం బద్దలుకొట్టాయి. ఈ దోబి రోబోల ఎత్తు - 47.3 సెంటిమీటర్లు. ఇవి పాటలు పాడటంతో పాటు, ఫుట్‌బాల్ కూడా ఆడతాయి. కుంగ్‌ఫూ కూడా చేయడం విశేషం. వీటి డ్యాన్సింగ్ వీడియోను యూట్యూబ్‌లో గంట వ్యవధిలోనే లక్షల మంది చూశారు.

మీకు తెలుసా?

షాంగై ఎక్స్‌పో పార్క్‌లో గత సంవత్సరం జరిగిన 'ఫ్రాన్స్ నేషనల్ పెవిలియన్ డే'లో సందర్శకులను అలరించేందుకు నిర్వాహకులు 20 రోబోలతో డ్యాన్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. అంతేకాదు వాటితో సాకర్ కూడా ఆడించారు.





'రోబో' స్టెప్పుల రికార్డు

ప్రభుదేవా డ్యాన్స్ మెరుపులు, చిరంజీవి స్టెప్పులు అందరికీ తెలుసు. మరి చిందులేసే రోబోలు తెలుసా? చైనా కొత్త సంవత్సర వేడుకల్లో భాగంగా 540 రోబోలు ఒకే వేదికపై డ్యాన్సులు చేసి అలరించాయి. అంతేకాదు ప్రపంచంలోనే అత్యధిక మంది వీక్షించిన టీవీ ప్రోగ్రామ్‌గా అది రికార్డులకెక్కింది. రోబోలు చిందేస్తుంటే 26 డ్రోన్లు ఆ నృత్యాన్ని వీడియో తీశాయి. చైనా సెంట్రల్ టెలివిజన్(సీసీటీవీ) ఈ కార్యక్రమాన్ని ప్రసారం చేయగా 70 కోట్ల మంది వీక్షించటం విశేషం. ప్రపంచంలోనే అత్యధిక ప్రజలు చూసిన కార్యక్రమంగా రోబో డ్యాన్స్ నిలిచింది. సాహిత్యాన్ని, సంగీతాన్ని అనుసరించి కొరియోగ్రాఫర్లు డ్యాన్స్ కంపోజ్ చేస్తారు. అదే విధంగా రోబోలు సంగీతానికనుగుణంగా నృత్యం చేసేలా వీటిని రూపొందించారు. 'ప్రతి రోబోలో 16 స్టీరింగ్ ఇంజిన్లు ఉన్నాయి. మానవుడి తల, కాళ్లు, చేతులు ఏ విధంగా అయితే కదుపుతారో అదే విధంగా రోబోలు కదలడానికి వీలుగా ఈ స్టీరింగ్ ఇంజిన్స్ ఉపయోగపడతాయి.

రోబోట్ డ్యాన్స్

రోబోలను ఇమిటేట్ చేస్తూ చేసే డ్యాన్సే 'రోబోట్ డ్యాన్స్'. మైఖేల్ జాక్సన్‌తో ఈ డ్యాన్స్ బాగా ప్రాచుర్యంలోకి వచ్చింది. 'డ్యాన్సింగ్ మెషిన్' పాటలో - మైఖేల్, తన సోదరులతో కలిసి 'రోబోట్ డ్యాన్స్' చేశారు. 'బిల్లి జీన్' అనే పాటలో కూడా 'రోబోట్ డ్యాన్స్' చేసి అలరించాడు.


మెల్‌బోర్న్ యూనివర్సిటీలో 'రోబోగాల్స్' అనే బృందం, 318 మంది 'రోబోట్ డ్యాన్స్' చేసి వరల్డ్ రికార్డ్స్‌లో స్థానం పొందారు.

ఔనా!



వాసన పసిగట్టే శక్తి శునకాల కన్నా, చీమలకే ఎక్కువ.

బొమ్మ గీయండి



దారి కనుక్కోండి



రంగులు వేయండి



నవ్వుల్ నవ్వుల్

అప్పారావు : ఏరా! వెళ్లినప్పుడు నాలుగు గంటల్లో విజయవాడ వెళ్లావు కదా! వచ్చేటప్పుడు ఎనిమిది గంటలు పట్టిందేం?

సుబ్బారావు : కారు తయారు చేసిన వెధవ ఎవడో గానీ, ముందుకు వెళ్లడానికి నాలుగు గేర్లు ఇచ్చాడు. వెనక్కి రావడానికి రెండు గేర్లు మాత్రమే ఇచ్చాడు రా!

అప్పారావు : !!!!!!!!

టంగ్ ట్విస్టర్స్

1. Upper roller lower roller Upper roller lower roller. ..
2. Swan swam over the sea,
   Swim, swan, swim!
   Swan swam back again
   Well swum, swan!
3. I saw a saw that could out saw any other saw I ever saw.

చుక్కలు కలపండి



మీకు తెలుసా?



ప్రపంచంలో రెండు శాతం మందికి మాత్రమే ఆకుపచ్చ రంగు కళ్లు ఉంటాయి.

జవాబులు

జంబ్లింగ్ వర్డ్స్ : 1. WALK 2. KING 3. DUMB 4. MUTE
జంతర్‌మంతర్ : 1. అద్భుతం 2. తక్షణం 3. ఒత్తిడి 4. వికాసం
చెప్పగలరా? : పాయసం




తిరుమల సమాచారం



వసతి గదులు: రూ.500 : అక్టోబర్ 24 నుంచి డిసెంబర్ 19 వరకు ఉన్నాయి.
రూ.100 : అక్టోబర్ 24 నుంచి డిసెంబర్ 19 వరకు ఉన్నాయి.
శ్రీనివాసమ్: అక్టోబర్ 24 నుంచి డిసెంబర్ 19 వరకు ఉన్నాయి.
రూ.300 దర్శనం : ఆగస్టు 30 నుంచి డిసెంబర్ 2 వరకు ఉన్నాయి. (మధ్యలో సెప్టెంబరు 2, 5,19, 23, 28, 29, 30 అక్టోబర్ 1,7, 14 తప్ప)
రూ.50 దర్శనం : ఖాళీలు లేవు.
ఆర్జిత సేవలు : అక్టోబర్ 21వ తేదీ ఉన్నాయి.

రైల్వే సమాచారం



రైళ్ల రాకపోకల వేళలు, రిజర్వేషన్ ఖాళీల వివరాలు, టికెట్ చార్జీలు,
ఇతర సమాచారం కోసం... 139
ప్రయాణికుల భద్రతకు రైల్వే రక్షణ దళం (ఆర్పీఎఫ్) టోల్ ఫ్రీ నంబరు 182
అనకాపల్లి ఆర్పీఎఫ్ పోస్ట్ ఫోన్... 08924-226965

ఆర్టీసీ సమాచారం



అనకాపల్లి ఎంక్వైరీ	77300 37027
నర్సీపట్నం ఎంక్వైరీ	94932 11969
పాడేరు ఎంక్వైరీ (డీఎం)	73829 14859

ఘాట్.. బ్యూటిఫుల్ స్పాట్


అనంతగిరి మండలం గాలికొండ వద్ద నీలాకాశంలో కనిపించిన సుందర దృశ్యం


అనంతగిరిపై మంచు అందాలను కెమెరాలో బంధిస్తున్న పర్యాటకులు


పాడేరు ఘాట్‌లో కొండలను కమ్ముకున్న మబ్బులు

- మైమరపిస్తున్న నీలి మేఘాలు.. మంచు తెరలు..
- ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్న జలపాతాలు
- కన్నులారా వీక్షించి పరవశించిపోతున్న పర్యాటకులు
- కట్టిపడేస్తున్న ప్రకృతి అందాలు

ప్రకృతి రమణీయతకు పాడేరు, అనంతగిరి ఘాట్ రోడ్లు ఆదివారం ప్రధాన వేదికయ్యాయి. ఓ చోట నీలి మేఘాలు.. మరో చోట మంచు తెరలు.. వెరసి పర్యాటకులను సంభ్రమాశ్చర్యంలో ముంచెత్తాయి. పాడేరు ఘాట్‌లో మధ్యాహ్నం మేఘాలు మైమరపించాయి. కొండలను తాకుతూ తీస్తున్న పరుగు చూపరులను కట్టిపడేసింది. అదే సమయంలో రహదారి కనిపించక వాహనచోదకులు లైట్లు వేసుకుని రాకపోకలు సాగించడం మరో వింతైంది. ఇదిలావుంటే, అనంతగిరిలో దట్టంగా కురిసిన మంచు భూమ్యాకాశం ఒక్కటయ్యాయా అన్నట్టు అనిపించింది. సుంకరమెట్ట, గన్నెల జంక్షన్‌లలో ఈ దృశ్యాలు దర్శనమిచ్చాయి. దీనికితోడు నీలాకాశంలో వెండి మబ్బులు మరింత మనసు దోచాయి. ఈ ముగ్ధమనోహర అందాలను పర్యాటకులతో పాటు పలువురు ప్రయాణికులు తమ కెమెరాల్లో బంధించి పదిలపరచుకున్నారు. ఇవన్నీ ఇలా ఉంటే.. జలపాతాల హొయలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. వాతావరణంలో మార్పుల కారణంగా ఎగువ ప్రాంతాల్లో తాజాగా కురుస్తున్న వర్షాలకు పాల నురగను తలపిస్తూ కొత్త నీటితో ఉరకలేస్తున్నాయి. సీలేరు జలపాతం మరింత కనువిందు చేస్తోంది. జీకే వీధి మండలంలో విశాఖపట్నం- భద్రాచలం ప్రధాన రహదారిలో సీలేరుకు నాలుగు కిలో మీటర్ల సమీపంలో ఉన్న ఈ జలపాతాన్ని ఐస్‌గెడ్డగా పిలుస్తుంటారు. మండు వేసవిలో సైతం ఇక్కడ ప్రవహించే నీరు అతి చల్లగా ఉంటుండడం విశేషం. ఈ సుందర దృశ్యం అందరినీ అలరిస్తోంది.

- పాడేరు/ అనంతగిరి/ సీలేరు


అనంతరం ఘాట్ రోడ్డు వద్ద మంచు


సీలేరు సమీపంలో ఐస్‌గెడ్డ నుంచి జల జాలా జారుతున్న నీరు


లైట్లు వేసుకుని పాడేరు ఘాట్‌లో వాహనాల రాకపోకలు


మంచు ముసుగులో అనంతగిరి ఘాట్‌లోని బీసుపురం

యోగాయనమః

ఆకట్టుకున్న జిల్లా స్థాయి యోగా పోటీలు



వేడుకలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ మాధవ్

విశాఖపట్నం, ఆగస్టు 20 : యోగాసనాలతో చిన్నారులు, పెద్దలు ఆహూతులను ఎంతగానో ఆకట్టుకున్నారు. జిల్లా స్థాయిలో నిర్వహించిన యోగాసనాల పోటీలు ఆసక్తికరంగా సాగాయి. సీతమ్మధార బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లో గల శ్రీకృష్ణ మందిరం పక్కనున్న వేద ధర్మ రక్షణ సభ హాలులో జిల్లా యోగ సంఘం, విజయసాయి యోగా చారిటబుల్ ట్రస్ట్, నేచర్‌కూయర్ ఆస్పత్రి సంయుక్త ఆధ్వర్యంలో 11వ జిల్లా స్థాయి యోగాసానాల పోటీలను ఆదివారం నిర్వహించారు. ఈ పోటీల్లో ఎనిమిదేళ్ల నుంచి అరవై ఏళ్ల వయస్సు వారు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్సీ పీవీ ఎన్ మాధవ్ పోటీలను ప్రారంభించి మాట్లాడారు. నిత్య జీవితంలో యోగా అందరికీ అవసరమన్నారు. పిల్లలను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడానికి, వ్యక్తిత్వ వికాసానికి యోగా ఎంతో తోడ్పడుతుందన్నారు. కాగా గ్రూపులుగా విభజించి పది యోగాసానాల్లో పోటీలను నిర్వహించినట్టు జిల్లా యోగా సంఘం అధ్యక్షుడు కేఏ రాజు తెలిపారు. ఈ పోటీల్లో గెలుపొందిన వారు వచ్చేనెల 9, 10, 11 తేదీల్లో తిరుపతిలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. పోటీలకు న్యాయ నిర్ణేతలుగా ఏయూ యోగా అధ్యాపకులు తొమ్మిది మంది వ్యవహరించారు. పోటీల్లో పాల్గొన్నవారందరికీ సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో యోగా సంఘం ప్రతినిధులు ఎస్.శ్రీలక్ష్మి, జి.సర్వేశ్వరరావు, జి.హనుమంతురావు తదితరులు పాల్గొన్నారు.





యోగాసనాలు వేస్తున్న దృశ్యం

ఘనంగా రాజీవ్ జయంతి వేడుకలు

పాడేరురూరల్: మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్ గాంధీ 75వ జన్మదిన వేడుకలను స్థానిక కాంగ్రెస్ నాయకులు ఆదివారం నిర్వహించారు. మాజీ మంత్రి పి.బాలరాజు గృహంలో రాజీవ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు బూరా దేముళ్లు, టి.కృష్ణవేణి, కృష్ణకుమారి, టి.అశోక్ తదితరులు పాల్గొన్నారు.

జీపు యూనియన్ నూతన కార్యవర్గం



జీపు యూనియన్ డ్రైవర్ల నూతన కార్యవర్గం

జి.మాడుగుల: జి.మాడుగుల- పాడేరు తిరిగే ప్రైవేటు జీపుల డ్రైవర్స్ నూతన కార్యవర్గం ఎన్నిక ఆదివారం వెన్నెలమ్మ గుడి వద్ద నిర్వహించారు. నూతన అధ్యక్షుడిగా మద్దెల సింహాచలం, ఉపాధ్యక్షుడిగా పాంగి బాబురావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జీపు అసోషియేషన్ యూనియన్ నాయకుడు సత్తిబాబు (బాషా) మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ డ్రైవింగ్ లైసెన్స్, ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కలిగి ఉండాలన్నారు. అధికవేగంతో ప్రయాణించరాదని, పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించవద్దని ఆయన సూచించారు. నూతనంగా 15 మందితో కూడిన కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో జీప్ డ్రైవర్లు, యజమానులు తదితరులు పాల్గొన్నారు.

జీకేవీధిలో ముసురు



జీకేవీధిలో వర్షం కురుస్తున్న దృశ్యం

గూడెంకొత్తవీధి: మండలంలో రెండు రోజులుగా ముసురుపట్టింది. ఏకధాటిగా కురుస్తున్న వర్షాలకు రైతులు వ్యవసాయ పనులు చేసేందుకు ఇబ్బందులు పడుతున్నారు. వర్షం కారణంగా ప్రధాన రహదారులు, వాగులు, లోతట్టు ప్రాంతాలు వర్షపు నీటితో నిండాయి.

పర్యాటకులతో 'కొత్తపల్లి' కళకళ



జలపాతంలో ఉత్సాహంగా కేరింతలు కొడుతున్న యువకులు

జి.మాడుగుల: మండలంలోని ప్రముఖ పర్యాటక కేంద్రం కొత్తపల్లి జలపాతం పర్యాటకులతో కళకళలాడింది. ఆదివారం సెలవు దినం కావడంతో అధిక సంఖ్యలో పర్యాటకులు చేరుకున్నారు. కొన్ని రోజులుగా వర్షాలు కురుస్తుండడంతో పర్యాటకులు కొంతకాలంగా తగ్గారు. ఆదివారం పర్యాటకులు అధిక సంఖ్యలో జలపాతంలో చేరి ఉత్సాహంగా కేరింతలు కొడుతూ గడిపారు. కుటుంబ సభ్యులతో జలపాతంలో జలకలాడుతూ ఉత్సాహంగా గడిపారు. ఆదివారం సుమారు మూడు వేల మందికి పైగా పర్యాటకులు సందర్శించినట్టు జలపాతం నిర్వాహకులు అభి తెలిపారు.

ప్రకృతి వ్యవసాయంతో గిరి రైతుల ఆర్థికాభివృద్ధి

వ్యవసాయశాఖ సహాయ సంచాలకుడు శంకర్‌రెడ్డి

పాడేరురూరల్: ప్రకృతి వ్యవసాయంతో గిరి రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నారని వ్యవసాయశాఖ సహాయ సంచాలకుడు పి.శంకర్‌రెడ్డి తెలిపారు. చంద్రన్న రైతు క్షేత్రాలు ఉన్న మినుములూరు, చింతలవీధి, తుంపాడ, కుజ్జెలి, ఇరడాపల్లి పంచాయతీల్లోని రైతులు వరిపొలాల గట్లపై కందులను వేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో చర్యలు చేపట్టామన్నారు. ప్రకృతి వ్యవసాయం (జడ్‌బీఎన్‌ఎఫ్) చేపట్టే వంట్లమామిడి, వంజంగి, తుంపాడ, డి.గొందూరు పంచాయతీలకు చెందిన నాలుగు క్లస్టర్లకు చెందిన 17 గ్రామాల్లో రైతులకు కందులను ఉచితంగా పంపిణీ చేశామన్నారు. శ్రీవరి పద్ధతిలో వ్యవసాయం చేస్తున్న కిండంగి, తుంపాడ రైతులకు కంది విత్తనాలు అందించామన్నారు. ఈ గ్రామాల్లో రైతులు వ్యవసాయ రంగంలో మరింత ముందుకు సాగేందుకు నూతన పద్ధతుల్లో వ్యవసాయం చేసేందుకు అవసరమైన పరికరాలను అందించామన్నారు. గతంలో కూలీలను పెట్టి కలుపుతీసే రైతులు నేడు కోనోవీడర్‌లను ఉపయోగించి కలుపుతీసుకుంటున్నారన్నారు. కోనోవీడర్‌లు వినియోగించడం, రసాయనాలు వినియోగించడం, కాలిబాటలు వేసుకోవడం, లైన్స్ తీయడం, జింక్, సూడోమోనాస్ వినియోగించడం వల్ల పంటల్లో అధిక దిగుబడులు వస్తాయని శంకర్‌రెడ్డి వివరించారు. సూడోమోనాస్‌ను రైతులకు అందుబాటులో ఉంచి రాయితీపై రూ.18.75 పైసలకే అందిస్తున్నామన్నారు. మండలంలో వ్యవసాయ శాఖ సూచనలపై ప్రకృతి వ్యవసాయాన్ని 250 ఎకరాల్లో 500 మంది రైతులు వ్యవసాయం చేపట్టి ఆధునిక పద్ధతిలో ముందుకు వెళుతున్నారని శంకర్‌రెడ్డి తెలిపారు.



వరి పొలంలో కోనోవీడర్‌తో కలుపు తీస్తున్న రైతులు

శిథిలావస్థలో మాదిమళ్ళు వంతెన

సీలేరు: ధారకొండ-గుమ్మిరేవుల రహదారిలో ఉన్న మాదిమళ్ళు వంతెన శిథిలావస్థలో ఉండడంతో వర్షాలు కురిస్తే చాలు ఎక్కడ కొట్టుకుపోయి రాకపోకల నిలిచిపోతాయోనని గిరిజనులు భయాందోళన చెందుతున్నారు. రూ.14 కోట్లతో జరుగుతున్న ధారకొండ-గుమ్మిరేవుల రహదారి పనుల్లో మాదిమళ్ళు వంతెన లేకపోవడంతో కాంట్రాక్టర్ ఈ వంతెన నిర్మాణ పనులు చేపట్టడం లేదు. రెండు సంవత్సరాల క్రితం సంభవించిన హుద్‌హుద్ తుఫాన్ తాకిడికి వంతెనకు రెండు వైపులా అప్రోచ్‌కొట్టుకుపోయి సుమారు వారం రోజుల పాటు ధారకొండ,గుమ్మిరేవుల పంచాయతీల్లోని గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో అప్పట్లో తాత్కాలికంగానే మరమ్మతు పనులు చేపట్టి రాకపోకలు పునరుద్ధరించారు. అప్పటి నుంచి ఎప్పుడు భారీ వర్షాలు కురిసినా ఈ వంతెన ఎప్పుడు కూలిపోయి రాకపోకలు నిలిచిపోతాయోనని ఈప్రాంత గిరిజనులు భయాందోళనతో కాలం గడుపుతున్నారు. రెండు రోజులుగా అల్పపీడన ద్రోణి ప్రభావంతో కొండలపై కురిసిన భారీ వర్షాలకు భారీగా నీరు ప్రవహించింది. అధికారులు చొరవ తీసుకుని శిథిలావస్థలో ఉన్న మాదిమళ్ళు వంతెన కొత్తది ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకోవాలని గుమ్మిరేవుల,ధారకొండ ప్రాంతాల గిరిజనులు కోరుతున్నారు.



శిథిలావస్థలో ఉన్న మాదిమళ్ళు వంతెన

ఫోరం పరిధిలోకే ఆన్‌లైన్ వినియోగదారులు

జిల్లా వినియోగదారుల సంఘం అధ్యక్షుడు కె.వెంకటరమణ

అరకులోయ: ఫోరం పరిధిలోకే ఆన్‌లైన్ వినియోగదారులు వస్తారని జిల్లా వినియోగదారుల సంఘాల సమాఖ్య అధ్యక్షుడు కాండ్రేంగుల వెంకటరమణ అన్నారు. ఆన్‌లైన్‌లో మోసపోయిన బాధితులు వినియోగదారుల ఫోరంను ఆశ్రయించి న్యాయం, నష్ట పరిహారం పొందవచ్చునని తెలిపారు. అరకులోయ మండల పరిషత్ సమావేశ మందిరంలో సమాచార హక్కు, వినియోగదారుల రక్షణ చట్టాలు- తీర్పులు అనే అంశమై ఆదివారం చర్చ నిర్వహించారు. 11 మండలాల వినియోగదారుల సంఘాల ప్రతినిధులు హాజరైన ఈ సమావేశంలో కె.వెంకటరమణ మాట్లాడారు. వినియోగదారుల చట్టం పరిధిలోకి ఆన్‌లైన్ వినియోగదారులు కూడా వస్తారని, వినియోగదారుల హక్కులు, బాధ్యతలపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. ఆన్‌లైన్‌లో కొనుగోలు చేసిన వస్తువు బట్వాడా కాకపోవడం, ఆలస్యం కావడం, నకిలీ వస్తువులు, గ్యారంటీ, వారంటీ పత్రాలు లేకపోవడం వంటి ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం నియమావళిని కఠినతరం చేసిందన్నారు. వినియోగదారుల కోర్టులు, ఆర్టీఐ,లోకాయుక్త, లోక్ అదాలత్, వివిధ స్థాయిల్లోని యాప్‌లు, ట్విట్టర్లు, ఫేస్‌బుక్‌లు, టోల్‌ఫ్రీ నెంబర్లు,హెల్ప్ లైన్లు, అంబుడ్స్‌మెన్, ఫిర్యాదుల విభాగం, కాల్ సెంటర్లు, ఆన్‌లైన్ ఫిర్యాదులు, మీకోసం, డయల్ యువర్ కలక్టర్ వంటివన్నీ ఈ కోవకే చెందుతాయన్నారు. వీటిన్నింటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. గిరిజన కుటుంబానికి విధిగా ఐదు కిలోల గ్యాస్ సిలిండర్‌ను ప్రభుత్వం సరఫరా చేయాలన్నారు. జీసీసీ నుంచి ప్రజా పంపిణీ వ్యవస్థ వేరు చేయాలని డిమాండ్ చేశారు. ఆహార పదార్థాల నాణ్యతను తెలియజేసే అగ్‌మార్కు గుర్తు కలిగిన వస్తువులను మాత్రమే వినియోగదారులు కొనుగోలు చేయాలన్నారు. సమాచార హక్కు చట్టం, వినియోగదారుల రక్షణచట్టం, ప్రాధాన్యత, కేసు దాఖలు, తీర్పులు సాధించిన విజయాలు, ప్రభుత్వ ఉత్తర్వులను ఈ సందర్భంగా ఆయన వివరించారు. ఈసమావేశంలో గిరిజన ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.మత్స్యలింగం, వినియోగదారుల హక్కుల పరిరక్షణ సంఘం మాజీ అధ్యక్షుడు దొన్నుదొర పలు అంశాలపై మాట్లాడారు. సమావేశం అనంతరం వినియోగదారుల రక్షణచట్టం అమలు చట్టాన్ని ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించడంలో కృషి చేసినందుకు పంద్రాగస్టు రోజున జిల్లా ఇన్‌చార్జి మంత్రి హోమ్ మినిస్టర్, ఉపముఖ్యమంత్రి చినరాజప్ప, జిల్లా కలెక్టర్ చేతులు మీదుగా అవార్డు పొందిన వి.ధర్మయ్యను ఘనంగా సత్కరించారు. గిరిజన ఉద్యోగుల సంఘం మాజీ కార్యదర్శి ఎస్.అప్పన్న, పాడేరు డివిజన్ వినియోగదారుల సంఘాల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా వినియోగదారుల సంఘం అధ్యక్షుడు కె.వెంకటరమణ

ఓపెన్ స్కూల్ పరీక్షలకు 620 మంది వయోజనులు హాజరు

పాడేరురూరల్: సాక్షారభారత్ ఆధ్వర్యంలో వయోజన విద్య అక్షరాస్యత స్థాయిని గుర్తించేందుకు ఆదివారం నిర్వహించిన నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఓపెన్ స్కూల్ పరీక్షకు 620 మంది వయోజనులు హాజరయ్యారని సాక్షార భారత్ మండల కో-ఆర్డినేటర్ జి.రాంబాబు తెలిపారు. ఆదివారం నిర్వహించిన ఈ పరీక్షలకు మండలంలోని 26 పంచాయతీలకు చెందిన సాక్షార భారత్ కేంద్రాల్లో విద్యను అభ్యసించిన వయోజనులు గతంలో డ్రాపవుట్స్, సీగ్రేడ్ వచ్చిన వారికి పరీక్ష నిర్వహించామన్నారు. ఈ పరీక్షలను మహిళా సమాఖ్య జూనియర్ రిసోర్స్ పర్సన్ బి.గణపతమ్మ, వారి సిబ్బంది పరిశీలించారని రాంబాబు తెలిపారు.

మాడుగుల ఫోన్ నెంబర్లు

పోలీస్‌స్టేషన్	08934-224233
ఎంపీడీఓ	9000 01928
తహసీల్దార్	88977 01286

సినిమా గైడ్

సాయిసిరీమేక్స్	జయ జానకీ నాయక
శ్రీసాయిలక్ష్మి	నేనే రాజు.. నేనే మంత్రి
సాయిలక్ష్మి(ఏసీ)	లై
పూర్ణ	ప్రతిక్షణం

అధ్వానంగా ఆర్.వై.అగ్రహారం-కొత్త అగ్రహారం రోడ్డు

కె.కోటపాడు : మండలంలోని ఆర్.వై.అగ్రహారం-సింగన్నదొరపాలెం శివారు కొత్తఅగ్రహారం గ్రామాల మధ్య రోడ్డు అధ్వానంగా మారడంతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు పొడవునా గోతులు పడడంతో ఆ రహదారి మీదుగా రాకపోకలు సాగించేందుకు అవస్థలు పడుతున్నారు. వర్షపు నీరు గోతుల్లో నిల్వ ఉండడంతో రాత్రి వేళల్లో ఎక్కడ గొయ్యి ఉందో తెలీక తికమక పడతున్నారు. భారీ వర్షం కురిస్తే ఈ రహదారి మీదుగా రెండు గ్రామాలకూ దాదాపుగా రాకపోకుల నిలిచిపోయే పరిస్థితి కూడా ఉత్పన్నమవుతుంది. రోడ్డంతా బురద పేరుకుపోయి నడవలేని పరిస్థితి. దాంతో ఎ.కోడూరు ఉన్నత పాఠశాలకు వెళ్ళేందుకు విద్యార్థులు, ఇతర గ్రామాలకు వెళ్ళేందుకు ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ రహదారి మీదుగా పోతనవలస, ఉగ్గినవలస, ఆర్.వై.అగ్రహారం తదితర గ్రామాలకు చెందిన విద్యార్థులు, రైతులు, ప్రజలు మండల కేంద్రం కె.కోటపాడుకు, ఎ.కోడూరు గ్రామాలకు రాకపోకలు చేస్తుంటారు.



ఆర్.వై.అగ్రహారం నుంచి ఎ.కోడూరు హైస్కూల్‌కు ప్రతి రోజూ వందలాది మంది విద్యార్థులు వెళ్తుంటారు. అలాగే ఈ గ్రామాల నుంచి గవరపాలెం, కేజే పురం, దీక్షుతుల అగ్రహారం, దాలివలస తదితర గ్రామాలకు వ్యవసాయ, ఇతర పనులపై రైతులు తరుచూ రాకపోకలు సాగిస్తుంటారు. అసలే రోడ్డంతా గోతులు, ఆపై వర్షం పడితే ఈ రోడ్డు మీదుగా ప్రయాణం కష్టంగా ఉంటోందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భారీ వర్షాలకు రోడ్డుకు ఒకవైపు ఉన్న చెరువు నీరు రోడ్డుపై ప్రవహిస్తూ మరిన్ని ఇబ్బందులకు గురి చేస్తోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రెండు గ్రామాలకు శాశ్వత తారురోడ్డు నిర్మాణం చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ఈ రహదారిపై రాకపోకలెలా?

బురదమయంగా గ్రామీణ మట్టిరోడ్లు

తారురోడ్డు నిర్మించాలని గ్రామస్థుల వినతి

మాడుగుల రూరల్ : మండలంలోని పలు గ్రామాలకు వెళ్లే మట్టిరోడ్లు అధ్వానంగా ఉన్నాయి. గోతులు పడి చినుకు పడితే చిత్తడిగా మారుతున్నాయి. కాలు వేస్తే జర్రున జారిపోయే ప్రమాదకర పరిస్థితికి చేరుకున్నాయి. దీంతో ఆ వైపుగా రాకపోకలు సాగించే పాదచారులు. ద్విచక్ర వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని జంపెన శివాలయం నుంచి వీరనారాయణం వెళ్లేందుకు సుమారుగా కిలోమీటరున్నర మట్టిరోడ్డు ఉంది. అలాగే కూర్మనాథపురం నుంచి చినకూర్మనాథపురం, డి.గొటివాడ నుంచి ఓ.కె. శ్రీరాంపురం వెళ్లే రోడ్లు రాళ్లు తేలిపోయి అధ్వానంగా తయారయ్యాయి. ఆయా గ్రామాల వారికి మట్టిరోడ్లే శరణ్యం దీంతో నిత్యం అవస్థలు పడుతూనే రాకపోకలు సాగిస్తున్నారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో ఈ రోడ్లు మరింత దారుణంగా తయారయ్యాయి.

ఏళ్లు గడుస్తున్నా తారురోడ్డు నిర్మాణం జరగక తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోందని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా తారురోడ్డు నిర్మాణం చేపట్టాలని కోరుతున్నారు.



బురదమయంగా వీరనారాయణం రహదారి

సనాతన ధర్మాన్ని పాటించాలి : వీహెచ్‌పీ



కార్యక్రమంలో పాల్గొన్న వీహెచ్‌పీ ప్రతినిధులు

మాడుగుల రూరల్ : సనాతన హిందూ ధర్మాన్ని, సంప్రదాయాలను పాటిస్తూ హిందూ వతాభివృద్ధికి కృషి చేయాలని విశ్వ హిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు బంకుపల్లి సత్యనారాయణ అన్నారు. ఆదివారం మండలంలోని ఎం.కోటపాడు రామాలయంలో పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలపై సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందూ ధర్మాన్ని పాటించడం, హిందువులను సమైఖ్య పరచడం, దేవాలయాలపై దాడులను ఖండించడం, గ్రామాల్లో దేవాలయాలను నిర్మించడం, సత్సంగ భజనా కార్యక్రమాలు నిర్వహించడం వంటివి విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో చేపడుతున్నామని చెప్పారు. ఇందుకోసం ప్రత్యేక కమిటీని కూడా ఏర్పాటు చేస్తున్నామన్నారు. అనంతరం మాడుగుల మండల మండల కమిటీని ఏర్పాటు చేశారు.

అధ్యక్షుడిగా పడాల కొండరావు, కార్యదర్శిగా బొడ్డపాటి శ్రీరామ్మూర్తి, కోశాధికారిగా చదలవాడ జయమ్మ నియమితులయ్యారు. కూర్మనాథం, వరహాలు, సత్తిబాబు, శానాపతి కొండలరావు, గంగాధర్, కోట్ని వరహాలరాజు, మజ్జి కొండబాబు, తవ్వా సన్యాసయ్యశెట్టి, వాలంకి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నెలాఖరులో కేంద్ర పరిశీలకుల రాక

రికార్డు పనుల్లో నిమగ్నమైన వీఆర్పీలు



రికార్డులను సరి చేస్తున్న వీఆర్పీలు

చీడికాడ : ఉపాధి హామీ పనులు పరిశీలించేందుకు కేంద్ర ప్రభుత్వ అధికారులు పర్యవేక్షణకై రానున్నారన్న సమాచారం మేరకు ఉపాధి హామీ పథకం జిల్లా, మండల స్థాయి అధికారులు అప్రమత్తమయ్యారు. ఈ మేరకు సిబ్బంది రికార్డులను పూర్తి చేసే పనిలో నిమగ్నమయ్యారు. 2014 నుంచి ఉపాధి పథకం కింద పలు అభివృద్ధి పనులకు నిధులు మంజూరయ్యాయి. తద్వారా జరిగిన పనులను, రికార్డులను పరిశీలించేందుకు ఈ నెల 21 తరువాత నెలాఖరులోగా ఎప్పుడైనా కేంద్ర తనిఖీ అధికారులు రావచ్చుననే సమాచారం రావడంతో మండలంలోని ఆయా గ్రామాల టీఏలు, వీఆర్పీలు ఎంపీడీవో కార్యాలయంలో తమ రికార్డులను సరిచేసుకునే పనుల్లో నిమగ్నమయ్యారు. ఈ నెల 12న రెండో శనివారం అయినప్పటికీ విశాఖపట్నం నుంచి ఏపీడీ ఆంజనేయులు ఎంపీడీవో కార్యాలయానికి వచ్చి వీఆర్పీలతో సమావేశమయ్యారు. రికార్డు పనులు పూర్తయ్యే వరకు ప్రభుత్వ సెలవు దినాలతో సంబంధం లేకుండా ఉదయం నుంచి సాయంత్రం వరకు పని చేయాలని ఆదేశించారు.

సరుగుడు నారుకు పెరిగిన గిరాకీ

తూర్పుగోదావరి జిల్లా నుంచి దిగుమతి

రావికమతం : మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో మండలంలో సరుగుడు నాట్లు జోరందుకున్నాయి. జూలై రెండో వారం వరకు కురిసిన వర్షాలు తరువాత మందగించడంతో నాట్లు స్తంభించిపోయాయి. మూడు రోజులుగా అడపా దడపా కురుస్తున్న వర్షాలకు తిరిగి రైతులు సరుగుడు నాట్లు ప్రారంభించారు. మండలంలోని మరుపాక, రాయవరం, తట్టబంద, తోటకూరపాలెం, కల్యాణపులోవ, కొమిరి, కేబీపీ అగ్రహారం తదితర గ్రామాల్లో సరుగుడు నాట్లు జోరుగా సాగుతున్నాయి. బుచ్చెయ్యపేట మండలం రాజాం, పెదమదీనా, గున్నెంపూడి తదితర గ్రామాలతోపాటు తూర్పుగోదావరి జిల్లా ప్రాంతం నుంచి రైతులు రావికమతానికి సరుగుడు నారు తీసుకొచ్చి



రావికమతం జంక్షన్‌లో సరుగుడు నారు అమ్మకాలు

విక్రయిస్తున్నారు. వర్షాలు పడకముందు వెయ్యి నార్లు ఉండే కట్ట రూ.500 పైబడి పలకగా, ఇప్పుడు రూ.వెయ్యి పలుకుతోంది. వరినాట్లు కూడా ముమ్మరంగా జరుగుతుండటంతో కూలీల రేటు 25 శాతం పెరిగింది. గతంలో ఆడకూలీలకు రూ.150, మగకూలీలకు రూ.300 చెల్లించగా, ఇప్పుడు రూ. 250, రూ.400లకు పెరిగింది.

అటవీ మొక్కలను పరిశీలించిన సీపీఎం నేతలు

దేవరాపల్లి : మండలంలోని అటవీ శాఖ ఆధ్వర్యంలో మొక్కల పెంపకంలో జరిగిన విచారణ జరిపించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. తెనుగుపూడిలో రోడ్డుకు ఇరువైపులా నాటిక మొక్కలను ఆదివారం పరిశీలించారు. చాలా మొక్కలు ఎండిపోయినట్లు గమనించారు. మొక్కల నాటినప్పటి నుంచి వాటికి నీరు పోయలేదని, కానీ ఉపాధి పథకం కింద నీరు పోసినట్లుగా మస్తర్లలో నమోదు చేశారని వారు పేర్కొన్నారు. వనసంరక్షణ సమితి ఆధ్వర్యంలో వేసిన టేకు చెట్లను అటవీశాఖ సిబ్బంది అమ్ముకున్నారని, దీనిపై విజిలెన్స్ అధికారులు విచారణ జరిపితే వాస్తవాలు వెల్లడవుతాయని సీపీఎం మండల కార్యదర్శి సీహెచ్.రాజు తెలిపారు.

చోడవరం ఫోన్ నెంబర్లు

పోలీస్‌స్టేషన్	08934-245033
ఎంపీడీఓ	9959550097
తహసీల్దార్	8500632088

సినిమా గైడ్

సాయిసిరీమెక్స్	జయ జానకి నాయక
శ్రీసాయిలక్ష్మి	నేనే రాజు.. నేనే మంత్రి
సాయిలక్ష్మి(ఏసీ) లై	
పూర్ణ	ప్రతిక్షణం



నేతవానిపాలెంలో శిథిలావస్థకి చేరుకున్న సామాజిక భవనం

శిథిలావస్థలో సామాజిక భవనం

బుచ్చెయ్యపేట : బుచ్చెయ్యపేట శివారు నేతవానిపాలెంలో సామాజిక భవనం శిథిలావస్థకు చేరుకుంది. 1995లో నిర్మించిన ఈ భవనం శ్లాబ్ పెచ్చులుగా ఊడిపోతోంది. సీసీ బీమ్‌లు కూడా పెచ్చులుగా రాలిపోతున్నాయి. తలుపులు, కిటికీలు దెబ్బతిన్నాయి. భవనం మరమ్మత్తులు చేపట్టాలని పలు పర్యాయలు కోరినా ఫలితం లేకుండా పోవడం పట్ల స్థానికులు ఆ వేదన వ్యక్తం చేస్తున్నారు. జడ్పీ ఇంజనీరింగ్ అధికారులు మరమ్మత్తులు చేపట్టేలా చోడవరం ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్.రాజు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

24 పంచాయతీల్లో ఎన్ఏఓఎస్ పరీక్షలు



ఎన్ఏఓఎస్ పరీక్ష రాస్తున్న డ్వాక్రా సభ్యులు

రావికమతం : మండలంలోని 24 గ్రామ పంచాయతీల్లో సాక్షరభారత్ నిర్వహించిన ఎన్ఏఓఎస్ పరీక్షల్లో 240 మంది వయోజనులు పరీక్ష రాశారు. సి గ్రూపునకు చెందిన వారితో పాటు కొత్తవారు కూడా పరీక్షకు హాజరయ్యారని ఎంఈవో రామకృష్ణ తెలిపారు. వీసీవోలు అప్పారావు, రేవతి, సత్యవతి కుమారి తదితరులు పర్యవేక్షించారు.

బుచ్చెయ్యపేటలో...

మండలంలో నిర్వహించిన ఎన్ఏఓఎస్ పరీక్షలకు 436 మంది వయోజనులు హాజరయ్యారు. మండలంలో గ్రామానికి 30 మంది చొప్పున 32 గ్రామ పంచాయతీల్లో గుర్తించిన 960 మందికి గతంలో నిర్వహించిన 14 విడత పరీక్షల్లో 524 మంది పరీక్షలు రాయగా, చివరి విడతలో మిగిలిన అభ్యర్థులు పరీక్ష రాశారని సాక్షరభారత్ మండల కో ఆర్డినేటర్ సంతోష్ తెలిపారు.

ఉత్సవ విగ్రహంలా కేఎం ఛానెల్

- కొమిర శివారులో పూడుకుపోయిన కాలువ
- పదేళ్లుగా ఆయకట్టుకు నీరందని వైనం
- కుడికాలువ ద్వారా నీరందించాలని రైతుల వినతి
- పట్టించుకోని ఇరిగేషన్ అధికారులు



కొమిర శివారులో పూడుకుపోయిన కేఎం ఛానెల్

రావికమతం: చెంతనే కాలువ ఉన్నప్పటికీ అది ఎందుకూ పనికి రాక ఉత్సవ విగ్రహంలా మారింది. ఎక్కడికక్కడ తుప్పలు, మొక్కలతో పూడుకుపోయి పదేళ్లుగా ఆయకట్టు భూములకు సాగునీరందని పరిస్థితి ఏర్పడింది. నాటి పాలకులు, అధికారుల నిర్లక్ష్యం నేడు ఆయకట్టు రైతులకు శాపంగా మారింది. పెద్దేరు జలాశయం ప్రారంభం నుంచి నేటి వరకూ కేఎం ఛానెల్ లో చుక్కనీరు కూడా పారిన దాఖలాలు లేవు.

మండలంలో కొమిర, మత్స్యపురం గ్రామాలకు పెద్దేరు జలాశయం నిర్మాణానికి ముందే స్వర్గీయ తెన్నేటి విశ్వనాథం హయాంలో రాచకట్టు కాలువ నిర్మించారు. తద్వారా కొమిర, మత్స్యపురం, బట్లోవ , చినపాచిల గ్రామాల్లోని 1200 ఎకరాల ఆయకట్టు భూములకు సాగునీరు అందించాలన్నది లక్ష్యం. పెద్దేరు జలాశయ నిర్మాణ సమయంలో ఈ రాచకట్టు కాలువతో పాటు కుడి ప్రధాన కాలువ కూడా నిర్మించారు. రాచకట్టు కాలువ ద్వారా తమ ఆయకట్టు భూములకు సాగునీరు అందదని, ఈ కాలువ రిజర్వాయర్ నిర్మాణానికి ముందు చేపట్టడంతో నీరు పారే అవకాశం లేదని, ఈ దృష్ట్యా కుడి కాలువ నుంచి కేఎం ఛానెల్‌కు సాగునీరు అందించాలని రైతులు విజ్ఞప్తి చేశారు. అయితే రాచకట్టు కాలువ నుంచే సాగునీరు అందిస్తామని, కుడికాలువ నుంచి అవసరం లేదని అధికారులు రైతుల విజ్ఞప్తిని పట్టించుకోలేదు. 2006లో జలాశయం నిర్మాణం పూర్తయి ప్రారంభించే సమయంలో కూడా రైతులు కేఎం ఛానెల్ నుంచి నీరందించేందుకు అధికారులు సుముఖంగా లేరంటూ అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డికి ఫిర్యాదు చేశారు. ఇది తెలిసి ఇరిగేషన్ అధికారులు రైతుల వద్దకు వచ్చి ఈ కాలువకు పెద్దేరు జలాశయం నీరు పారించే బాధ్యత తమదని, ఇచ్చిన పిర్యాదును వెనక్కి తీసుకోవాలని ప్రాధేయపడ్డారు. జలాశయం ప్రారంభిస్తున్నప్పటికీ కాలువల నిర్మాణం పూర్తి కాలేదని, దానిలో భాగంగానే కేఎం ఛానెల్‌ను కూడా పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసి ఆయకట్టు భూములకు సాగునీరందిస్తామని అధికారులు రైతులను మభ్యపెట్టారు. జలాశయం ప్రారంభమైన తరువాత అధికారులు రైతులకిచ్చిన హామీని పక్కన పెట్టేశారు. ఇప్పటి వరకూ కేఎం ఛానెల్ వంకే చూడలేదు. దీంతో కాలువ అభివృద్ధి చెందక తుప్పలు, మొక్కలతో పూడుకుపోయింది. ఆయా గ్రామాల్లో 1200 ఎకరాలకు సాగునీరందడం లేదు. కనీసం కుడికాలువ నుంచైనా తమకు సాగునీరందించాలని కోరుతున్నా అధికారులు స్పందించడం లేదని ఈ ఛానెల్ పరిధిలోని రైతులు చెబుతున్నారు. వర్షాలు పడితేనే తమ భూముల్లో పంటలు వేస్తామని, లేకుంటే బీడుగా వదిలేస్తున్నామని తెలిపారు. ఈ విషయమై ఇరిగేషన్ ఏఈ రమేష్‌ను వివరణ కోరగా, కేఎం ఛానెల్ తన పరిధిలో లేదని, జలాశయం రెగ్యులేటింగ్ అథారిటీయే దాని నిర్వహణ చూస్తోందని చెప్పారు. కాగా తమ తాతల కాలం నుంచి ఉన్న కేఎం ఛానెల్‌ను అభివృద్ధి చేయకుండా అధికారులు వదిలేయడం అన్యాయమని చినపాచిల, మత్స్యపురం గ్రామాలకు చెందిన రైతులు జెర్రిపోతుల సత్తిబాబు, సాసుబిల్లి పైడిబాబు తదితరులు అన్నారు. చోడవరం ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ ఇప్పటికైనా చొరవ తీసుకుని కేఎం ఛానెల్ అభివృద్ధికి చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు.



చిన్నచూపు చూస్తున్నారు



పెద్దేరు జలాశయం నిర్మాణం కోసం మా తాతలు నుంచి దరఖాస్తులు చేశారు. మా కుటుంబ సభ్యులుఈ జలాశయం నిర్మాణం కోసం స్వర్గీయ మాజీ మంత్రి ద్రోణంరాజు సత్యనారాయణ సహకారంతో అప్పటి ప్రధాని పీవీ నరసింహారావు వద్దకు వెళ్లి పెద్దేరు జలాశయం నిర్మాణానికి అనుమతులు మంజూరు చేయించారు. అటువంటిది మా ఆయకట్టు భూములకే సాగునీరు లేకుండా అధికారులు చిన్న చూపు చూస్తున్నారు. ఎన్నోసార్లు ఈ కాలువ అభివృద్ధి కోసం అధికారులు, పాలకుల చుట్టూ తిరిగినా ఎవరూ పట్టించుకోపోవడం దురదృష్టకరం

జెర్రిపోతుల సత్తిబాబు, ఆయకట్టు రైతు, చినపాచిల

ఎవరూ స్పందించడం లేదు



జలాశయం నిర్మాణానికి ముందు నుంచి ఉన్న కేఎం ఛానెల్ అభివృద్ధిని అధికారులు విస్మరించడం అన్యాయం. ఆయకట్టు భూములను అనుకొని కాలువ ఉన్నప్పటికీ చుక్కనీరు ఎప్పుడూ పారలేదు. కోట్లాది రూపాయలు వెచ్చించి జలాశయాన్ని నిర్మించి పూర్వపు ఆయకట్టు కింద ఉన్న తమకు కేఎం ఛానెల్ ద్వారా సాగునీరు ఎందుకు అందించడం లేదో ఇరిగేషన్ అధికారులు సమాధానం చెప్పాలి. ప్రస్తుత ఎమ్మెల్యే రాజు ప్రతిపక్ష ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు ఈ కాలువ అభివృద్ధి కోసం రైతులతో కలిసి ఎన్నోసార్లు ధర్నాల్లో పాల్గొన్నారు. ఇప్పుడు ఆయన కూడా విస్మరించారు.

సాసుబిల్లి పైడిబాబు, ఆయకట్టు రైతు, మత్స్యపురం

మంచాల మోడల్ స్కూల్లో ఆరో తరగతిలో సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

చీడికాడ : మండలంలో మంచాల మోడల్ స్కూల్లో ఆరో తరగతిలో ఖాళీగా వున్న 22 సీట్ల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని స్కూల్ ప్రిన్సిపాల్ తంతి హీరాలాల్ తెలిపారు. ఆదివారం ఆ తరగతిలో 80సీట్లకు గాను 58 భర్తీ అయ్యాయని, మిగిలిన సీట్ల భర్తీకి దరఖాస్తులను కోరుతున్నామని చెప్పారు. విద్యా సంవత్సరం ప్రారంభమైన తరువాత దశలవారీగా సీట్లను భర్తీ చేస్తున్నామని ఆయన చెప్పారు.

ఆసక్తి, అర్హత ఉన్న విద్యార్థుల ఈ నెల 24లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని సంబంధిత కాపీలను మోడల్ స్కూల్ కార్యాలయానికి తీసుకు రావాలని కోరారు. దరఖాస్తు చేసుకున్న వారందరికీ మోడల్ స్కూల్‌లో ఈ నెల 26న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నామన్నారు. ప్రవేశ పరీక్షలో ఉత్తీర్ణులైన వారికి వెంటనే సీట్లు కేటాయిస్తామని చెప్పారు. అలాగే పాఠశాలలో కెమిస్ట్రీ టీజీటీ, ఫిజిక్స్ టీజీటీ ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయని ప్రిన్సిపాల్ హీరాలాల్ తెలిపారు.

ఈ పోస్టుల భర్తీకి సంబంధిత సబ్జెక్ట్‌లో ఎమ్మెస్సీ బీఈడీ చేసిన అభ్యర్థులు దరఖాస్తులను మోడల్ స్కూల్ కార్యాలయానికి నేరుగా అందించాలని, మరిన్ని వివరాల కోసం 7032996534 నంబర్ ద్వారా సంప్రదించాలని కోరారు.

వరి నారుమడులకు అగ్గి, పొడతెగుళ్లు

దేవరాపల్లి : మండలంలోని పలు గ్రామాల్లో వరి నారుమడులకు పొడతెగుళ్లు, అగ్గితెగులు, పాని తెగులు సోకడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. నాగయ్యపేట, సీతంపేట, వైవాడ, తెనుగుబూడి, వెంకటరాజపురం, గర్సింగి, చినగంగవరం, వాకపల్లి గ్రామాల్లో వరి నారుమళ్లకు ఈ తెగుళ్ల బెడద ఎక్కువైంది. ప్రస్తుతం ఆర్‌జీఎల్, స్వర్ణ వరి నారుమడులకు పొడ, అగ్గి తెగుళ్లు సోకుతున్నాయని ఏవో అప్పారావు అన్నారు. పొడ తెగులు నివారణకు హెక్సాకోనజోల్ 2 మిల్లీ లీటర్లమందు ద్రావణం లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. అలాగే అగ్గి తెగులు నివారణకు ట్రైసైక్లోజల్ 0.06 గ్రాముల మందు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని ఆయన సూచించారు.

భక్తశ్రద్ధలతో మోదమాంబకు ఘటాల సమర్పణ



మాడుగుల: మోదమాంబ ఆలయం ఆదివారం కిటలాడింది. ఈ సందర్భంగా అమ్మవారికి వేకువజాము నుంచి ప్రత్యేక పూజలు జరిపారు. క్షీరాభిషేకం చేశారు. అనంతరం మహిళలు కుంకుమ పూజలు జరిపారు. గ్రామానికి చెందిన పలు కుటుంబాల వారు ఘటాలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకుని అమ్మవారికి ఘటాలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారి పాదాల వద్ద పూజలు జరిపారు. ఈ సందర్భంగా పరిసర గ్రామాల భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

ఆంధ్రజ్యోతి

4

నర్సీపట్నం

విశాఖపట్నం। సోమవారం 21 ఆగస్టు 2017

నర్సీపట్నం। గొలుగొండ। నాతవరం। మాకవరపాలెం

ఎంపీడీవోల ఫోన్ నంబర్లు

నర్సీపట్నం	9849900151
గొలుగొండ	9000013921
నాతవరం	9000013925
మాకవరపాలెం	9000013920

సినిమా గైడ్

శ్రీకన్య - ఫిదా
కన్య - దర్శకుడు
కన్యమినీ - వశం
సాయిశ్రీకన్య - ఇదేమి! దెయ్యం
రాజుమూవీమ్యాక్స్ - నక్షత్రం
బంగార్రాజు - గౌతమ్‌నందా

మాకవరపాలేనికి మహర్దశ

ఎనిమిది కిలోమీటర్ల మేరకు అండర్ డ్రైనేజీ నిర్మాణానికి రూ. 2.4 కోట్లతో ప్రతిపాదనలు... పూర్తయిన సర్వే..

మాకవరపాలెం:
మాకవరపాలెం గ్రామానికి మహర్దశ పట్టనుంది. గ్రామంలో మురికి కాలువల స్థానే భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటవుతున్నది. ఇందుకోసం ఇప్పటికే సర్వే పూర్తయింది. ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపించినట్టు పంచాయతీ కార్యదర్శి అప్పల శివరామ్ తెలిపారు.

మాకవరపాలెం గ్రామంలో 4,929 జనాభా ఉంది. గ్రామంలో 12 వార్డులు ఉన్నాయి. ఇక్కడ 36 బోర్లు ఉండగా, రెండు పెద్ద తాగునీటి పథకాలు, మరో మూడు చిన్న నీటి పథకాలు ఉన్నాయి. అలాగే 186 ప్రైవేటు కొళాయిలు ఉండగా, 90 పబ్లిక్ కొళాయిలు ఉన్నాయి. కొన్ని వార్డుల్లో ఉన్న మురుగుకాలువలతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా రాజారావుపేట, రామాలయం వీధి, యాతపేట, కొత్తవీధి మురుగు కాలువులో నీరు నిల్వ ఉండడంతో దోమ పోటుతో బోదకాలు బాధితులు చాలామంది ఉన్నారు. ఒక్క రాజారావుపేట వీధిలో 30 మంది వరకు బోదకాలు బాధితులు ఉన్నారు. మండలంలోని ఒక గ్రామంలో అండర్ డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేస్తామని మూడు నెలల క్రితం ప్రభుత్వం ప్రకటన చేసింది. ఇందులో భాగంగా మాకవరపాలెం గ్రామాన్ని ఎంపిక చేశారు.


మాకవరపాలెంలోని మురుగుకాలువలు


మాకవరపాలెంలో సర్వే పనులు చేసిన దృశ్యం (ఫైల్)

గ్రామంలో మురుగు కాలువలు ఎనిమిది కిలోమీటర్ల మేరకు విస్తరించి ఉన్నాయని పంచాయతీరాజ్ జేఈఈ వీరభద్రరావు తెలిపారు. కిలోమీటరుకి రూ.30లక్షలను కేటాయిస్తున్నట్టు తెలిపారు. ఇప్పటికే సర్వే పూర్తయిందని, ఎనిమిది కిలోమీటర్లకు రూ.2.4 కోట్లు వ్యయం అవుతుందని ప్రతిపాదనలు సిద్ధం చేసినట్టు అధికారులు తెలిపారు. కాలువ వెడల్పు రెండు అడుగుల మేరకు అండర్ డ్రైనేజీ నిర్మాణం చేపట్టనున్నారు. అండర్ డ్రైనేజీ పూర్తయితే దోమల బెడద తగ్గుతుందని ప్రజాప్రతినిధులు అంటున్నారు.



అండర్ డ్రైనేజీ అవసరం

కాగిత బుజ్జి, రాజారావుపేట

గ్రామం చివరిలో ఉండడంతో మురుగునీరు అంతా మా వీధిలోనే ఉంటుంది. దీనికి తోడు చేపల, మాంసం దుకాణాలు ఇక్కడే ఉండడంతో దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి. అందుకే మా వీధిలో బోదకాలు సోకిన వారు 30 మందికి పైగా ఉన్నారు. అండర్ డ్రైనేజీ వస్తే మా వీధివాసులకు దుర్గంధం తప్పుతుంది.



మార్కెట్ దగ్గర దోమ బాధలు తీరుతుంది..

బోళెం గోవింద

సంత మార్కెట్ కొత్తవీధికి దగ్గరగా ఉండడంతో రాత్రి, పగలు అనే తేడా లేకుండా దోమలు కాటు వేస్తున్నాయి. దీనికి తోడు వర్షాలకు కాలువలు పూడికతో కప్పబడి ఉంటాయి. దీంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. అండర్ డ్రైనేజీతో ఇబ్బందులు పోతాయి.

ఇదేనా.. స్వచ్ఛత

కనిపించని డస్ట్‌బిన్‌లు
రోడ్లపైనే చెత్తచెదారాలు
పట్టించుకోని మున్సిపల్ అధికారులు

నర్సీపట్నం టౌన్:
పట్టణంలోని స్వచ్ఛత కార్యక్రమాల నిర్వహణను అధికారులు చెత్తబుట్టలో వేశారు. మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డులలో పారిశుధ్యం లోపించింది. వ్యర్థాలు పారబోసేందుకు చెత్తకుండీలు, తొట్టెలు ఏర్పాటు చేయకపోవడంతో రహదారులు వెంట పడేస్తున్నారు. పేరుకుపోతున్న వీటి నుంచి దుర్గంధం వెలువడుతోంది. పురుగులు, కీటకాలు అందులో నుంచి ఇళ్లలోకి రావడం ప్రజలకు ఇబ్బందికరంగా మారుతున్నది.


కొత్తవీధిలో ఇళ్ల మధ్యలో ఉన్న చెత్తకుప్ప


రామారావుపేటలో అధ్వానంగా ఉన్న దృశ్యం

పట్టణంలోని రామారావుపేట, కొత్తవీధి, శారదానగర్, ఎస్సీకాలనీ, బీసీకాలనీ తదితర ప్రాంతాల్లో వ్యర్థాలు పెద్దఎత్తున రోడ్డుపక్కనే కుప్పలుగా పడిఉన్నాయి. రోజుల తరబడి వీటిని తొలగించడం లేదు. అటుగా వెళుతున్న అధికారులు గాని, పారిశుధ్య కార్మికులు గాని ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంపై పట్టణవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఘనంగా రాజీవ్‌గాంధీ జయంతి

నర్సీపట్నం: మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ జయంతి వేడుకలు ఆదివారం పట్టణంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గ ఇన్‌చార్జి మీసాల సుబ్బన్న నేతృత్వంలో అబీద్‌సెంటర్‌లోని రాజీవ్‌గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి సిద్ధా, పట్టణశాఖ అధ్యక్షుడు నంగిన రమణ, ఎం.శివ, భూషణం, సోమినాయుడు, రాముడు, తదితరులు పాల్గొన్నారు.


అబీద్‌సెంటర్‌లో రాజీవ్‌గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

యూటీఎఫ్ నేతకు సత్కారం

నర్సీపట్నం: ఉపాధ్యాయులకు ఇకపై జిల్లా కేంద్రం నుంచి మరిన్ని సేవలు అందిస్తానని యూటీఎఫ్ జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు దాసరి నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం స్థానిక ఎన్జీవో హోంలో డివిజన్ యూటీఎఫ్ నాయకులు, కార్యకర్తలు దాసరికి వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 15 ఏళ్లుగా నర్సీపట్నం కేంద్రంగా సేవలు అందించానన్నారు. ఎప్పటిలాగానే ఇకపై విశాఖ నుంచి మరిన్ని సేవలు అందిస్తానన్నారు. తాను పనిచేసిన పాఠశాలలను ఆదర్శ పాఠశాలలుగా తీర్చిదిద్దానన్నారు. అనంతరం దాసరిని ఘనంగా సత్కరించి జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు సత్తిబాబు, స్వర్జన్‌రాజు, చిట్టయ్య, రాజుబాబు, అప్పలరాజు, రాఘవకుమారి, శైలజ, కెజియా, గాయత్రి, తదితరులు పాల్గొన్నారు.


దాసరిని సత్కరిస్తున్న యూటీఎఫ్ నాయకులు

740 మంది ఎన్ఐటీ టెస్ట్‌కు హాజరు


తామరంలో ఎన్ఐటీ టెస్ట్‌ను పరిశీలిస్తున్న ఏపీవో రామచంద్రరాజు

మాకవరపాలెం:
మండలంలో సాక్షరభారత్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్ఐటీ టెస్ట్‌కు 740 మంది అక్షరాస్యులు హాజరైనట్టు ఏపీవో రామచంద్రరాజు తెలిపారు. ఆదివారం మండలంలో ఎన్ఐటీ టెస్ట్‌కు అక్షరాస్యులు హాజరైనట్టు తెలిపారు. ఒక్కో పంచాయతీ నుంచి 30 మంది సభ్యులను తీసుకున్నట్టు తెలిపారు. ఈ పరీక్షకు 740 మంది హాజరైనట్టు తెలిపారు. ఇందులో భాగంగానే తామరం, మాకవరపాలెం, కొండలఅగ్రహారం పరీక్ష కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మండల సాక్షరభారత్ కో-ఆర్డినేటర్లు రావాడ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గొలుగొండ మత్స్యకార సొసైటీకి వచ్చేనెల 13న ఎన్నికలు

గొలుగొండ: స్థానిక మత్స్యకారుల సొసైటీకు వచ్చేనెల 13వ తేదీన ఎన్నికను మత్స్యశాఖ అధికారులు నిర్వహిస్తున్నారు. ఈ సొసైటీలో గొలుగొండ, పప్పుశెట్టిపాలెం, సాలికమల్లవరం, వెంకటాపురం, పొగచెట్లపాలెం, ఉగ్గంపేట, రావణాపల్లి, జోగంపేటలకు చెందిన 183 మంది మత్స్యకారులు ఓటర్లుగా ఉన్నారు. ఈ సొసైటీకి వచ్చేనెల 13వ తేదీన గొలుగొండ ప్రాథమికోన్నత పాఠశాలలో ఎన్నిక నిర్వహిస్తారు. ఓటర్లు అందరూ చేతులు ఎత్తి తమకు నచ్చిన వ్యక్తులను ఎన్నకుంటారు. ఎన్నికల్లో పోటీ చేస్తున్న వారు ఇప్పటికే గ్రామాల్లో ముమ్మర ప్రచారం చేస్తున్నారు.

నిలిచిన రోడ్డు పనులతో ఇక్కట్లు


పనులు మధ్యలో నిలిపివేయడంతో అధ్వానంగా ఉన్న నర్సీపట్నం -తుని రోడ్డు

నాతవరం:
నర్సీపట్నం-తుని మార్గంలో ఆర్అండ్‌బీ అధికారులు చేపట్టిన మరమ్మతు పనులను మధ్యలో నిలిపివేయడంతో ప్రయాణికులు నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. గన్నవరం మెట్ట వద్ద సగంలో పనులు నిలిపివేయడంతో ఎదురెదురుగా వచ్చే వాహనాలు తప్పుకోవడం ఇబ్బందిగా ఉంది. ఈ రూట్‌లో చాలాచోట్ల రహదారి పాడైపోవడంతో రూ.62లక్షలు కేటాయించారు. గత నెలలో ఈ నిధులతో చేపట్టిన పనులను అధికారులు మధ్యలోనే నిలిపివేయడంతో ఇబ్బందులు తప్పడం లేదు. ప్రయాణికుల బాధలు దృష్టిలో ఉంచుకుని ఆర్అండ్‌బీ అధికారులు రోడ్డులో పనులు పూర్తిచేయాలని పలువురు కోరుతున్నారు.

పాయకరావుపేట మండలం ఫోన్ నెంబర్లు

పాయకరావుపేట పోలీస్ స్టేషన్	: 08854 254044
ఎంపీడీవో కార్యాలయం	: 9441953611
తహసీల్దార్ కార్యాలయం	: 9441836336
వెలుగు ఏపీఎం	: 9866074067

సినిమా గైడ్

గౌతమ్ : లై
సూర్యమహల్ : జయ జానకి నాయక
సాయిమహల్ : నేనే రాజు నేనే మంత్రి
లక్ష్మీ (ఏసీ) : ఫిదా

బస్సు ఎక్కాలంటే ఓ సాహసమే!


పట్టుజారితే ప్రమాదమే

కళాశాల విద్యార్థుల అవస్థలు

నక్కపల్లి : నక్కపల్లి మండలానికి చెందిన విద్యార్థులు కళాశాల చదువుల నిమిత్తం తుని, పాయకరావుపేట, అడ్డరోడ్డు, ఎలమంచిలికి రాకపోకలు చేస్తుంటారు. నక్కపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సీట్లు లభించిన ఇంటర్ విద్యార్థులు కూడా ఇతర ప్రాంతాలు వెళ్లి చదువుకుంటున్నారు. ఉదయం కళాశాలలకు వెళ్లేటప్పుడు బస్సు ఎక్కాలంటే బాలికలు అవస్థలు అంతాఇంతా కాదు. నక్కపల్లి జంక్షన్‌లో సుమారు 50 నుంచి 60 మంది విద్యార్థులు రాకపోకలు చేస్తుంటారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చే పాసింజర్ బస్సులు అప్పటికే ప్రయాణికులతో కిక్కిరిసి ఉంటాయి. దీంతో బస్సు ఎక్కడం కోసం తోపులాటలు జరుగుతున్నాయి. సాయంత్రం కళాశాలలు విడిచిపెట్టిన తరవాత నక్కపల్లి చేరుకోవడానికి ఎలమంచిలి, అడ్డరోడ్డు జంక్షన్‌లో కొందరు విద్యార్థులు బస్సులు ఎక్కుతుంటారు. ఆ సమయంలో రద్దీ మూడింతలు వుంటుంది. బస్సులో కనీసం నిలబడేందుకు కూడా చోటు లేకపోవడంతో చాలా మంది విద్యార్థులు పుట్‌బోర్డుపైనా, రాడ్లపైనా వేలాడుతూ ప్రయాణించాల్సివస్తోంది. అటువంటప్పుడు పట్టుజారితే చాలా ప్రమాదం జరుగుతుందని చూసేవారు ఆందోళన చెందుతున్నారు. ఒక్కోసారి హైవే జంక్షన్‌లో విద్యార్థులను చూసిన డ్రైవర్లు స్టేజ్ దాటిపోయాక బస్సులు ఆపుతున్న సందర్భాలు కూడా వున్నాయి. విద్యార్థులు పాస్‌పై ప్రయాణిస్తుండడంతో తమను ఎక్కించుకోవడానికి కొందరు ఆర్టీసీ సిబ్బంది పెద్దగా శ్రద్ధ కనిపించడం లేదని విద్యార్థులు ఆరోపిస్తున్నారు. కనీసం విద్యార్థులు పాఠశాలలకు వెళ్లే సమయంలోనూ, తిరిగి వచ్చే సమయంలోనూ ప్రత్యేక బస్సు సర్వీసులు నడపాలని పలువురు సూచిస్తున్నారు.


నక్కపల్లి హైవే జంక్షన్‌లో బస్సు ఎక్కేందుకు విద్యార్థినుల అవస్థలు

మట్టి విగ్రహాలనే పూజించాలి

పి.వెంకటనారాయణ, ఈఓపీఆర్‌డీ, పాయకరావుపేట

ఇంటర్వ్యూ



పాయకరావుపేట : స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా పర్యావరణ పరిరక్షణకు వినాయక చవితి ఉత్సవాల్లో మట్టి విగ్రహాలనే వినియోగించాలని ప్రభుత్వం ఆదేశించిందని ఈఓపీఆర్‌డీ పి.వెంకటనారాయణ తెలిపారు. ఈ మేరకు పీఆర్ కమిషనర్ నుంచి ఉత్తర్వులు వచ్చాయని, ఆ మేరకు గ్రామాల్లో దండోరా వేయిస్తున్నామన్నారు. ఆయనతో నిర్వహించిన ఇంటర్వ్యూ...

ప్ర : ఇంటింటి సర్వే ఎంతవరకు పూర్తయింది ?

జ : మండలంలో పన్నులు కడుతున్న 16,600 అసెస్‌మెంట్లు ఇళ్లు ఉన్నాయి. ఇప్పటి వరకు 7,800 ఇళ్లు, వాటి యజమానుల ఆధార్ నంబర్, ఇతర వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేశాం. చాలా ఇళ్లకు తాళాలు వేసి ఉండడం వల్ల సర్వే ఆలస్యమవుతోంది.

ప్ర : మండలంలో ఎంత పన్ను వసూలయింది ?

జ : మండలంలో ఇంటి పన్నులు, ప్రత్యక్ష పన్నులు 2016-17 ఆర్థిక సంవత్సరం డిమాండ్, పాతబకాయిలు కలిపి రూ.2.99 కోట్లు వసూలు కావాల్సి ఉంది. ఇంటి పన్నులు 65 శాతం వసూలైంది. పది పంచాయతీల్లో 100 శాతం వసూలైంది. ప్రత్యక్ష పన్నులు పాయకరావుపేట పంచాయతీలో 82 శాతం వసూలైంది. మిగిలిన 23 పంచాయతీల్లో వందశాతం వసూలైంది.

ప్ర : గ్రామాల్లో పారిశుధ్య పనులు ఎలా జరుగుతున్నాయి ?

జ : మండలంలోని 14వ ఆర్థిక సంఘం నిధులతో పారిశుధ్య మెరుగు పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ప్రతిరోజూ శుభ్రం చేసిన కాలువలను పంచాయతీ కార్యదర్శులు ఫొటో తీసి ప్రత్యేక యాప్ ద్వారా ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు.

ప్ర : పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో ఉండడంలేదని వస్తున్న ఆరోపణలపై మీ చర్యలు ఏమిటి ?

జ : మండలంలోని 24 పంచాయతీలకు ఏడుగురు కార్యదర్శులు మాత్రమే ఉన్నారు. ఒక్కొక్కరు మూడు, నాలుగు పంచాయతీలకు ఇన్‌చార్జి బాధ్యతలు నిర్వహిస్తున్నారు. వారంలో నిర్దేశించిన రోజుల్లో ఆయా పంచాయతీలో తప్పనిసరిగా కార్యదర్శులు ప్రజలకు అందుబాటులో ఉంటున్నారు.

ప్ర : మట్టి విగ్రహాలపై దండోరా వేయిస్తున్నారా ?

జ : వినాయక ఉత్సవాల్లో గణనాథుని మట్టి విగ్రహాలు వినియోగించేలా ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని కార్యదర్శులకు సూచించడమైంది. మట్టి విగ్రహాలను వినియోగించాలని కోరుతూ గ్రామాల్లో దండోరా వేయిస్తున్నాం. అన్ని గ్రామాల్లో దండోరా వేస్తారు.


అగ్ని ప్రమాదంలో దగ్ధమైన ఇల్లు

బంగారమ్మపేటలో ఇల్లు దగ్ధం

నక్కపల్లి : మండలంలోని బంగారమ్మపేట గ్రామంలో శనివారం రాత్రి 11 గంటలకు జరిగిన అగ్ని ప్రమాదంలో తాటాకు ఇల్లు దగ్ధమైంది. గ్రామానికి చెందిన వాసుపల్లి సింహాచలం ఇంట్లో నిప్పురవ్వలు ఎగసిపడి ఒక్కసారిగా మంటలు వ్యాపించడంతో ఇల్లు కాలిపోయింది. ఇంట్లో ఉన్న పర్నీచర్, సామగ్రి, వంటపాత్రలు, ఆహారపదార్థాలు, దుస్తులు అగ్నికి ఆహుతయ్యాయి. సుమారు రూ.2 లక్షలు ఆస్తినష్టం జరిగినట్టు గ్రామస్థులు, బాధితులు చెబుతున్నారు. బాధిత కుటుంబాన్ని సర్పంచ్ కొవిరి మసేనమ్మ పరామర్శించారు. సర్వసం కోల్పోయిన తమను ప్రభుత్వం ఆదుకోవాలని బాధితులు కోరారు.

రుణాల మంజూరులో అవకతవకలపై ఎమ్మెల్యే ఫిర్యాదు

పాయకరావుపేట : పాయకరావుపేట మండలంలో 2016-17 ఆర్థిక సంవత్సరంలో ఎస్సీ, బీసీ, కాపు కార్పొరేషన్ల ద్వారా సబ్సిడీ రుణాల మంజూరులో వివిధ బ్యాంకుల సిబ్బంది అవకతవకలకు పాల్పడినట్టు వచ్చిన ఆరోపణలపై విచారణ చేపట్టాలని ఎమ్మెల్యే వంగలపూడి అనిత ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయనున్నారు. పాయకరావుపేటలోని ఏపీజీవీబీ, సత్యవరం ఏపీజీవీబీ, ఆంధ్రా బ్యాంకులో 2016-17 ఆర్థిక సంవత్సరంలో మంజూరైన రుణాలపై విచారణ చేయాలని ఆమె కోరారు.

వేతనాల కోసం కూలీల ఎదురుచూపు

కోటవురట్ల: మండలంలో పలువురు ఉపాధి కూలీలు వేతనాల కోసం ఎదురు చూస్తున్నారు. క్షేత్రస్థాయి సిబ్బంది చొరవ చూపకపోవడంతో సకాలంలో వేతనాలు అందక కూలీలు అవస్థలు పడుతున్నారు. ముఖ్యంగా బ్యాంకు ఖాతాలకు ఆధార్ సీడింగ్ జరగలేదన్న నెపంతో తమకు వేతనాలు చెల్లించడం లేదని కూలీలు లబోదిబోమంటున్నారు. ఈ ఏడాది వేసవిలో మండల వ్యాప్తంగా ఉపాధి పనులు చేపట్టారు. అయితే వీటికి సంబంధించి వేతన బకాయిలు రూ.16 లక్షల చెల్లింపులు నిలిచిపోయాయి. బ్యాంకు అధికారులను అడిగితే ఖాతాలకు ఆధార్ అనుసంధానం అయినట్టు చెబుతున్నారని, కానీ ఖాతాల్లో వేతనాలు జమ కాలేదని కూలీలు ఆవేదన వ్యక్తం చేశారు. సుమారు నాలుగు నెలలుగా వేతనాల కోసం తిరుగుతున్నామని కూలీలు ఆవేదన వ్యక్తం చేశారు.

ఈ నెలాఖరులోగా కూలీల బ్యాంకు ఖాతా, పోస్టల్ ఖాతాలకు ఆధార్ నెంబర్ అనుసంధానం చేసే చర్యలను చేపడుతున్నట్టు ఉపాధి అధికారులు చెబుతున్నారు. ఈ విషయమై ఉపాధి ఏపీఓ నాగరాజు వద్ద ప్రస్తావించగా, బ్యాంకు ఖాతాలకు ఆధార్ సీడింగ్ లేకపోవడం వల్ల వేతనాలు జమ కావడం లేదన్నారు. ఈ నెలాఖరులోగా ఈ సమస్య పరిష్కరిస్తానని ఆయన చెప్పారు.

హాకీ క్రీడాకారులకు దుస్తుల పంపిణీ


హాకీ క్రీడాకారులకు టీ షర్ట్స్ పంపిణీ చేస్తున్న దృశ్యం

నక్కపల్లి : మండలంలో హాకీ క్రీడాకారులను ప్రోత్సహిస్తామని నక్కపల్లి హాకీక్లబ్ ప్రతినిధి కొల్నాటి తాతాజీ చెప్పారు. ఆదివారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో స్థానిక హాకీ క్రీడాకారులకు ఎలమంచిలికి చెందిన హాకీ క్రీడాకారుడు వెంకటేశ్వరరావు టీ షర్ట్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తాతాజీ మాట్లాడుతూ సీనియర్ హాకీ క్రీడాకారుల ప్రోత్సాహంతో నక్కపల్లిలో ఈ క్లబ్‌ను ఏర్పాటు చేశామన్నారు. నక్కపల్లిలో హాకీ క్రీడ అభివృద్ధికి తాము కృషి చేస్తామని పీఏసీఎస్ డైరెక్టర్ వీసం నానాజీ హామీ ఇచ్చారు. క్రీడాకారులు ఈ అవకాశాలను సద్వినియోగపర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గొడుగుల బంగార్రాజు తదితరులు పాల్గొన్నారు.

అధ్వాన రహదారులతో అవస్థలు

- పెదరాంభద్రపురం రోడ్డు గోతులమయం
- పెదతీనార్ల రోడ్డులో ప్రయాణం నరకం
- వర్షాలు పడితే నిలిచిపోతున్న నీరు
- ద్విచక్ర వాహనదారులకు ఇబ్బందులు


గోతులతో అధ్వాన్నంగా ఉన్న పెదరాంభద్రపురం, సత్యవరం రోడ్డు


గోతులతో కనబడుతున్న పెదతీనార్ల గ్రామంలోని రోడ్డు

పాయకరావుపేట/నక్కపల్లి : పాయకరావుపేట, నక్కపల్లి మండలాల్లో రహదారులు అధ్వానంగా ఉండడంతో ద్విచక్ర వాహనదారులు, ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. పాయకరావుపేట మండలంలో తాండవ నదికి ఇరువైపులా ఉన్న పలు గ్రామాల ప్రజల రాకపోకలకు పెందరాంభద్రపురం రోడ్డు ప్రధానమైంది. వంతెన నుంచి పెదరాంభద్రపురంలో ఉన్న తుని, పెంటకోట ఆర్అండ్‌బీ రోడ్డు వరకు సుమారు మూడు కిలోమీటర్లున్న ఈ రోడ్డు ఏళ్ల తరబడి నిర్వహణలేక పెద్దపెద్ద గోతులతో అధ్వానంగా మారింది. రోడ్డుకి ఇరువైపులా తుప్పలతో ఇరుకుగా ఉండే ఈ రోడ్డుపై భారీ వాహనాలు వచ్చినప్పుడు ఇతర వాహనాలు తప్పించుకునేందుకు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఇక వర్షం పడిందంటే ఈ రోడ్డుపై ప్రయాణం నరకాన్ని తలపిస్తోంది. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ మండలంలో సుమారు పది గ్రామాలకు చెందిన రైతుల ఉత్పత్తుల వాహనాలు, ప్రజలు రాకపోకలతో నిత్యం రద్దీగా ఉండే పెదరాంభద్రపురం రోడ్డును అభివృద్ధి చేయాలని ప్రజల కోరుతున్నారు. నక్కపల్లి మండలంలోని పెదతీనార్ల మత్స్యకార గ్రామంలో రహదారులు అధ్వానంగా ఉంది. అడుగడుగునా గోతులు మయం కావడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వర్షాలు పడితే రోజుల తరబడి నీరు నిలిచిపోతోంది. రాత్రి వేళల్లో ఈ రోడ్డుపై ప్రయాణించాలంటే గ్రామస్థులు హడలిపోతున్నారు. బైక్‌లపై ప్రయాణించేవారు పల్టీలు కొడుతున్నారు. ఇప్పటికైనా ఈ రహదారి గోతులను పూడ్చాలని పలువురు వాహనదారులు కోరుతున్నారు.

సినిమా గైడ్

సీతాచిత్రమందిర్ - లై
తులసీ చిత్రమందిర్ - నేనే రాజు నేనే మంత్రి
పరమేశ్వరి - జయ జానకి నాయక



బుర్రకథ రూపంలో అవగాహన కల్పిస్తున్న కళాకారులు

హామీలను అమలు చేసిన ఘనత టీడీపీదే

ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు

మునగపాక: ఎన్నికల్లో ఇచ్చిన హామీలను పూర్తిగా అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడిదేనని ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు అన్నారు. మునగపాక వెలుగు కార్యాలయంలో చంద్రన్న బీమా పథకం కింద ఆరుగురికి 25 లక్షల 50 వేల రూపాయల బాండ్లను, రైతు సంక్షేమ పథకంలో 11 మందికి రూ.25వేల చొప్పున రెండు లక్షల 75వేల రూపాయల చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చంద్రబాబు పరిపాలనపై ప్రజలు సంతృప్తిగా ఉన్నారన్నారు. యువకుడిలా నిత్యం పనిచేస్తూ రాష్ట్రాభివృద్ధి కోసం చంద్రబాబు కృషి చేస్తున్నారన్నారు. కొంత మంది పదవీ వ్యామోహంతో లేనిపోని ఆరోపణలు చేస్తున్నారన్నారు. కుటుంబ యజమాని చనిపోతే ఆ కుటుంబం వీధిన పడకుండా చంద్రన్న బీమా పథకం ఉపయోగపడుతుందన్నారు. రైతులను ఆదుకోవడం కోసం వ్యవసాయానికి అనేక రాయితీలు ఇచ్చి వ్యవసాయాభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు. సుజల స్రవంతి పథకంలో మన ప్రాంతానికి తాగు, సాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకుంటున్నారన్నారు. నీటి వనరుల అభివృద్ధి కోసం చెరువులు తవ్వించడం, నీటికుంతలు తవ్వించి సాగునీటిని అభివృద్ధి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీలు ఆడారి మంజు, చేకూరి శ్రీనివాసరాజు, జడ్పీటీసీ దాడి లక్ష్మీ సత్యనారాయణ, దిన్‌బాబు, ఎంపీటీసీ దాడి జమున, టెక్కలి పరుశురాం, ఉల్లింగల గోవింద, కె.వీరరాజశేఖర్, మారిశెట్టి వెంకటరమణ, ఆడారి కాశీబాబు తదితరులు పాల్గొన్నారు.



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు



విద్యార్థులకు మొక్కలు పంపిణీ చేస్తున్న దృశ్యం

పర్యావరణంపై అవగాహన ఉండాలి

మునగపాక: పర్యావరణ పరిరక్షణపై విద్యార్థి దశ నుంచే అవగాహన కల్పించాలని నైరా కళాశాల విద్యార్థులు సూచించారు. అరబుపాలెం గ్రామంలో ప్రాథమికోన్నత పాఠశాలలో ఆదివారం మొక్కలు పంపిణీ, మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. విద్యార్థులకు ఉచితంగా మొక్కలు పంపిణీ చేసి ప్రతి ఇంటి ముందు కనీసం ఒక మొక్కయినా పెంచేవిధంగా విద్యార్థులు, తల్లిదండ్రులు కృషి చేయాలన్నారు. అనంతరం పాఠశాల ఆవరణలోను, పంచాయతీ స్థలంలోను మొక్కలు నాటారు. కార్యక్రమంలో సర్పంచ్ లంబా అప్పారావు, పాఠశాల హెచ్‌ఎం దివాకర్, నైరా కళాశాల విద్యార్థులు పి.వెంకటరమణ, సీహెచ్.వినోద్‌కుమార్, సీహెచ్.రఘు, కె.తిలక్, అభ్యుదయ రైతు శరగడం రామకృష్ణ పాల్గొన్నారు.

ఎత్తిపోతల పథకంపై అవగాహన

అచ్యుతాపురం రూరల్: నీటిపారుదల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో శనివారం రాత్రి ఎత్తిపోతల పథకంపై సుస్థిర యాజమాన్య నిర్వహణపై అవగాహన కల్పిస్తూ బుర్రకథ కళాకారులు ప్రదర్శన నిర్వహించారు. నీటి పారుదల శాఖ డీఈఈ నాంచారయ్య ఆధ్వర్యంలో ఎత్తిపోతల పథకం లాభాలు, వాటిని వినియోగించుకుని వ్యవసాయంలో ప్రయోజనం పొందడం, దుర్వినియోగం వల్ల నష్టాలు వంటి వాటిపై గ్రామస్థులకు బుర్రకథ కళారూపంలో అవగాహన కల్పించారు. యాజమాన్య పద్ధతుల్లో వ్యవసాయ విధానాన్ని కళాకారులు తెలియజేశారు. కార్యక్రమంలో అధికారులు కె.నారాయణ, ఎస్.సూర్యనారాయణ, బి.శ్రీనివాసరావు, చీమలాపల్లి సర్పంచ్ మామిడి శివ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



ధారబోగాపురం వద్ద ఊటగెడ్డపై ఉన్న వంతెనకు
ఒక వైపు రక్షణగోడలేని దృశ్యం

ప్రమాదకరంగా ఊటగెడ్డ వంతెన

రెయిలింగ్ కూలిపోవడంతో ప్రయాణికుల భయాందోళన
రక్షణ గోడ నిర్మించాలని డిమాండ్

రాంబిల్లి: నిత్యం వాహనాల రాకపోకలుతో రద్దీగా ఉండే ఎలమంచిలి బైపాస్ రహదారిలో భోగాపురం వద్ద ఊటగెడ్డపై ఉన్న వంతెన రెయిలింగ్ కూలిపోయి (రక్షణగోడ)ప్రమాదకరంగా మారింది. ఇటీవల సుమారు రూ.2 కోట్లుతో బీసీ రహదారిని నిర్మించిన రహదారులు,భవనాలు శాఖ అధికారులు ప్రమాదకరంగా ఉన్న ఈ వంతెన వద్ద చిన్నపాటి బోర్డు ఏర్పాటు చేసి చేతులు దులిపేసుకున్నారు. రెయిలింగ్ కూలిపోవడంతో గతంలో ఇక్కడ ఒక ట్రాక్టర్,కారు అదుపు తప్పి కింద పడిపోయాయి. మరోవైపు వంతెనకు ఆనుకొని మట్టి కొట్టుకుపోవడంతో కోతకు గురైంది. కోతకు గురైన భాగంలో తుప్పలు మొలిచాయి. సంబంధిత అధికారులు స్పందించి తక్షణం వంతెనకు రెయిలింగ్‌ను నిర్మించడంతోపాటు ఇరువైపులా కోతకు గురైన అంచులను పూడ్చాలని పలువురు వాహనచోదకులు కోరుతున్నారు.

చిరంజీవి అభిమానుల రక్తదానం

అనకాపల్లిటౌన్: ప్రముఖ సినీ హీరో చిరంజీవి జన్మదిన వేడుకలు సందర్భంగా ఆదివారం ఉషా ప్రైమ్ ఆస్పత్రిలో రక్తదాన శిబిరం జరిగింది. చిరంజీవి అభిమానులు నిర్వహించిన ఈ శిబిరాన్ని సీఐ సంపతిరావు విద్యాసాగర్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలన్నారు.



పరీక్ష కేంద్రాన్ని పర్యవేక్షిస్తున్న డీడీ కుమార్



వాడపాలెం పరీక్ష సెంటర్‌ను పరిశీలిస్తున్న ఎంపీడీవో

వయోజనులను విద్యావంతులను చేయాలి

వయోజన విద్యాశాఖ డిప్యూటీ డైరెక్టర్ కుమార్

అచ్యుతాపురం రూరల్: వయోజనులు శతశాతం ఉత్తీర్ణత సాధించేలా గ్రామ సమన్వయకర్తలు కృషి చేయాలని వయోజన విద్యాశాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎన్‌వీఆర్‌వీ కుమార్ పిలుపునిచ్చారు. తిమ్మరాజుపేట, మడుతూరు, భోగాపురం గ్రామాల్లో వయోజన విద్యా అభ్యాసకుల పరీక్ష కేంద్రాలను ఆయన సందర్శించారు. విద్యా వల్ల ప్రయోజనాలను తెలియజేసి వయోజనులకు చదువుపై శ్రద్ధను కలిగేలా సమన్వయకర్తలు కృషి చేయాలని కోరారు. గ్రామాల్లో వయోజనులను చక్కగా చదివిస్తూ విద్యావంతులుగా తయారుచేస్తున్న సమన్వయకర్తలను, మండల సమన్వయకర్త బీలా అప్పారావును ఆయన ప్రశంసించారు. మండలంలోని చీమలాపల్లి గ్రామంలో కేంద్రాన్ని ఎంపీపీ శ్రీనివాసరాజు సందర్శించగా, ఆవసోమవరం గ్రామాల్లో ఎంపీడీవో బలరాం, కొండకర్లలో ఎంఈవో దేవరాయల్ సందర్శించారు. కార్యక్రమంలో క్లస్టర్ రీసోర్సు పర్సన్‌లు ఆత్మకూరి రవి, ఎల్‌వీ రమణ తదితరులు పాల్గొన్నారు.

వయోజనులు సంపూర్ణ అక్షరాసులు కావాలి

రాంబిల్లి: వయోజనులు సంపూర్ణ అక్షరాస్యులు కావాలని ఎంపీడీవో నిర్మల అన్నారు. ఆదివారం మండలంలోని 28 పంచాయతీలలోని సాక్షరభారత్ కేంద్రాలతో వయోజనులకు ఎన్‌ఐఓఎస్ పరీక్షలు నిర్వహించారు. వాడనర్సాపురం, గోవిందపాలెం, వాడపాలెం గ్రామాల్లో వయోజనులు పరీక్ష రాస్తున్న కేంద్రాల్లో ఆమె పరీక్షల తీరును పరిశీలించి మాట్లాడారు. వయోజనులను సంపూర్ణ అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకే ప్రభుత్వం సాక్షరభారత్ కేంద్రాలను ఏర్పాటు చేసిందన్నారు. వయోజనులు ఈ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో నిర్మల కోరారు. 28 పంచాయతీలలోని సాక్షరభారత్ కేంద్రా ల్లో జరిగిన పరీక్షలకు 650 మంది హాజరయ్యారని సాక్షరభారత్ మండల కోఆర్డినేటర్ శ్రీనివాస్ తెలిపారు. పరీక్ష కేంద్రాల ఇన్విజిలేటర్లుగా అంగన్‌వాడీ కార్యకర్తలు వ్యవహరించారు.

ఉపఎన్నిక బరిలో ఆ అభ్యర్థులను తొలగించాలి

ప్రచారంలో అధికార, ప్రతిపక్ష పార్టీల తీరు దారుణం
డబ్బు, మద్యం విచ్చలవిడిగా పంపిణీ
రౌండ్ టేబుల్ సమావేశంలో ప్రజా సంఘాల ప్రతినిధుల ఆగ్రహం



సమావేశంలో ప్రజా సంఘాల నాయకులు

అనకాపల్లి రూరల్ : కర్నూలు జిల్లా నంద్యాల అసెంబ్లీ స్థానం ఉప ఎన్నికల్లో పోటీ చేస్తున్న అధికార, ప్రతిపక్ష పార్టీల అభ్యర్థులను బరి నుంచి తప్పించాలని పలు ప్రజా సంఘాల నాయకులు ఎన్నికల కమిషన్‌ను డిమాండ్ చేశారు. ఇక్కడి కె.గోవిందరావు భవనంలో వివిధ ప్రజా సం ఘాల నాయకులతో ఆది వారం రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఎన్నికల ప్రచారంలో అధికార, ప్రతిపక్ష పార్టీల నాయకులు తాము చేసిన అభివృద్ధిని వివరించి ప్రజలను ఓట్లు అడగడం లేదని, కేవలం వ్యక్తిగత దూషణలతో ప్రచారం సాగిస్తున్నారని విమర్శించారు. అలాగే ఓటర్లను ప్రలోభపెట్టేందుకు డబ్బు, మద్యం విచ్చలవిడిగా పంచుతున్నారని దీనిని దృష్టిలో ఉంచుకొని ఇరు పార్టీలపై ఎలక్షన్ కమిషన్ తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో ప్రజా సంఘాల నాయకులు వై.ఎన్.భద్రం, కనిశెట్టి సురేష్‌బాబు, బొట్టా చిన్నియాదవ్, విత్తనాల పోతురాజు, కోరిబిల్లి శంకరరావు, కోన లక్ష్మణ్, బుగిడి నూకఅప్పారావు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ గృహానికి విశేష స్పందన

● భారీగా దరఖాస్తులు ● వార్డుల్లో అధికారుల అవగాహన సదస్సులు

ఎలమంచిలి : పట్టణంలోని పేదల సొంతింటి కలను సాకారం చేసే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఈ మేరకు ఎన్టీఆర్ గృహ నిర్మాణ పథకానికి భారీగా దరఖాస్తులు వస్తున్నాయి. పట్టణంలోని పేదలకు జి ప్లస్ 3 పద్ధతిలో ఇళ్లు నిర్మించనున్నారు. లబ్ధిదారుడికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ. 3 లక్షల రాయితీ ఇస్తుండగా మిగిలిన మొత్తాన్ని బ్యాంకులు రుణంగా ఇవ్వనున్నాయి. లబ్ధిదారులు ప్రతి నెలా బ్యాంకులకు మొత్తాన్ని చెల్లించేలా ఈ పథకాన్ని రూపొందించారు. మున్సిపాలిటీ ఆవిర్భవించిన నాటి నుంచి నిరుపేదలకు ప్రభుత్వం నుంచి సొంతింటి నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్ రాకపోవడంతో ఏళ్ల తరబడి ఎదురుచూసేవారు. ఎట్టకేలకు టీడీపీ ప్రభుత్వం గృహ నిర్మాణాలకు చర్యలు తీసుకోవడంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వారం రోజుల కిందట మున్సిపల్ కార్యాలయంలో లబ్ధిదారులతో మున్సిపల్ చైర్‌పర్సన్ రమాకుమారి, కమిషనర్ సత్యనారాయణ ప్రజలకు అవగాహన సదస్సులు నిర్వహించారు. పథకం గురించి వారికి పూర్తిగా వివరించారు. ఇంతవరకూ పట్టణంలోని నిరుపేదలు ఇంటి నిర్మాణం కోసం అవసరమైన స్థలాల కోసం కొందరు, పక్కా గృహాల నిర్మాణం కోసం మరికొందరు పాలకులు, కార్యాలయాలు చుట్టూ తిరుగుతూనే ఉన్నారు. ఎట్టకేలకు పట్టణానికి జి ప్లస్ 3 గృహ సముదాయం పథకం మంజూరైంది. అయితే గతంలోనే ఇంటి నిర్మాణ పథకానికి సుమారు రెండు వేల మందికి పైగా దరఖాస్తులు చేసుకున్నారు. వీరిలో అసలైన నిరుపేదల జాబితాను పాలకవర్గ నేతలు తయారు చేశారు. మూడు అంతస్తుల గృహాల సముదాయంలో కేటగిరి 1లో 300 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఒక రకం, కేటిగిరి 2లో 367 చ.అ విస్తీర్ణంలో మరో రకం, కేటగిరి 3లో 430 చ.అ విస్తీర్ణంలో మూడో రకం కింద గృహాలు నిర్మించేలా ప్రభుత్వం నిర్ధేశించింది. ప్రతి గృహానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిపి రూ.3 లక్షల సబ్సిడీ అందివ్వడమే కాకుండా మిగిలిన రుణాన్ని బ్యాంకుల నుంచి ఇచ్చేలా ప్రణాళికలు చేసింది. దీంతో ఏ తరహ గృహం కావాలో నిర్ణయించుకునే అవకాశాన్ని లబ్ధిదారుల స్థోమతను బట్టి నిర్ణయించుకునే అవకాశం కల్పించారు. వీరిలో అధిక శాతం మంది 2, 3 కేటగిరిలకు ప్రాధాన్యంఇస్తున్నారు. ఈ గృహల కోసం స్పందన వస్తున్నప్పటికీ డిపాజిట్ అమౌంట్ చెల్లించాల్సిన సమయానికి వీరిలో ఎంత మంది ముందుకు వస్తారో చూడాల్సి ఉంది.

గుడిని కూల్చినవారిపై చర్యలు తీసుకోవాలి

అనకాపల్లి : దేవాలయాన్ని కూల్చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఆడారి రామస్వామి ట్రస్ట్ ఫౌండర్ చైర్మన్ ఆడారి ఉమాశంకర్ కోరారు. ఈ మేరకు ఎస్పీకి ఫిర్యాదు చేశారు. తన తాత గవరపాలెంలో పంచముఖ గణపతి, అన్నపూర్ణమ్మ, షిర్డీబాబా విగ్రహాలతో ఉన్న గుడిని నిర్మించార న్నారని, దానిని కొందరు కూల్చివేశారని పేర్కొన్నారు.

సినిమా గైడ్

వెంకటేశ్వర- గౌతమ్‌నంద
శ్రీసత్య - లై
రాజా - జయ జానకి నాయక
షిర్డీసాయి - ఆనందో బ్రహ్మ
పర్తిసాయి- ఫిదా
రామచంద్ర : నేనే రాజు నేనే మంత్రి
శ్రీసత్యనారాయణ : ప్రతిక్షణం

సీరియల్స్ ద్వారా దేశభక్తిని పెంపొందిస్తా

రచయిత, అనకాపల్లికి చెందిన కరూర్ వెంకట రమణారావు వెల్లడి

కొత్తూరు : టీవీ సీరియల్స్ ద్వారా ప్రజల్లో దేశభక్తిని పెంపొందించడమే తన లక్ష్యమని రచయిత కరూర్ వెంకట రమణారావు తెలిపారు. అనకాపల్లికి చెందిన ఈయన హైదరాబాద్ నుంచి ఆదివారం ఇక్కడి విచ్చేశారు. దూరదర్శన్‌లో ప్రసారమవుతున్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సీరియల్‌ను ఈయనే రచించారు. అనకాపల్లిలో జన్మించి, ఇక్కడే విద్యాభ్యాసం చేశారు. ఉద్యోగరీత్యా కొంతకాలం చెన్నైలో నివాసం ఏర్పాటు చేసుకుని ప్రస్తుతం హైదరాబాద్‌లో స్థిరపడ్డారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ తన విద్యాభ్యాసం అంతా స్థానిక గాంధీనగరం హైస్కూల్, ఏఎంఏఎల్ కళాశాల, ఆంధ్రా యూనివర్సిటీల్లో సాగిందన్నారు. విద్యాభ్యాసం అనంతరం 1986లో చెన్నైలో ఉద్యోగ రీత్యా స్థిరపడ్డానన్నారు. 2002లో ఉద్యోగ విరమణ అనంతరం హైదరాబాద్ వచ్చి కథలు రాస్తూ స్థిరపడ్డానన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 125వ జయంతి సందర్భంగా ఏప్రిల్ 14 నుంచి దూరదర్శన్ సప్తగిరి చానల్‌లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ (బడుగు జనుల గుండె చప్పుడు) ధారావాహిక ప్రసారమవుతున్నట్టు చెప్పారు. ఈ కథకు సంబంధించి ఇటీవల తెనాలిలోని రామకృష్ణ కళాక్షేత్రంలో మంత్రి నక్కా ఆనందబాబు, ఎమ్మెల్యే గొల్లపల్లి సూర్యారావు, హౌసింగ్ బోర్డు చైర్మన్ వర్ల రామయ్యల నుంచి ప్రశంసలు అందుకున్నట్టు చెప్పారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌కు సంబంధించిన 18 పుస్తకాలను చదివి, సుమారు 200 గంటల పాటు ఇంటర్నెట్‌లో అంబేడ్కర్‌పై పలు అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి ధారావాహిక కథను రచించానని వివరించారు. ఇప్పటి వరకు సందేశం, బొమ్మరిల్లు, అంకుశం, నాతి చరామి, జీవనతరంగాలు తదితర 18 సీరియల్స్‌కు కథలు రాశానన్నారు. 'నాకు తెలిసిన నా భారత దేశం' అనే పుస్తకాన్ని రాస్తున్నట్టు చెప్పారు.



ఎమ్మెల్యే గొల్లపల్లి ద్వారా సత్కారాన్ని అందుకుంటున్న దృశ్యం

ఘనంగా రాజీవ్‌గాంధీ జయంతి



కశింకోట రూరల్ : కశింకోటలో ఆదివారం రాజీవ్‌గాంధీ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు రాజీవ్‌గాంధీ దేశానికి అందించిన సేవలను కీర్తించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కత్తెర శ్రీధర్, సూరా చిన్న, సూరిశెట్టి ఆది సూరిఅప్పారావు, నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

చిరంజీవి అభిమానుల రక్తదానం



అనకాపల్లి టౌన్ : ప్రముఖ సినీ హీరో చిరంజీవి జన్మదిన వేడుకల సందర్భంగా ఆదివారం ఉషా ప్రైమ్ ఆస్పత్రిలో మెగా రక్తదాన శిబిరం ఏర్పాటైంది. చిరంజీవి అభిమానులు నిర్వహించిన ఈ శిబిరాన్ని పట్టణ సీఐ సంపతిరావు విద్యాసాగర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలన్నారు. రక్తదానం చేసిన యువకులను ఆయన అభినందించారు. 22న చిరంజీవి జన్మదినం సందర్భంగా ఉదయం ఎన్టీఆర్ వైద్యాలయంలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేస్తామని చిరంజీవి యూత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గళ్ళా కొండలరావు తెలిపారు. సాయంత్రం పరమేశ్వరీ పార్కు జంక్షన్‌లో చిరంజీవి జన్మదిన వేడుకలు నిర్వహించనున్నామన్నారు. అభిమానులు బొడ్డేడ శ్రీనివాసరావు, మళ్ల శ్రీను, నరెడ్ల మధుబాబు, టీవీకే కుమార్, కొణతాల శ్రీను, ఎ.సతీష్, ఎల్.కన్నాజీ, కె.రాజు, చౌదరి, లింగబాబు తదితరులు పాల్గొన్నారు.

హెచ్చు, తగ్గుల్లో కూరగాయల ధరలు

◆ దిగి రాని ఉల్లి, ◆ రూ.10 వరకు తగ్గిన టొమేటో



అనకాపల్లి టౌన్ : కూరగాయల ధరలు ఈ వారం హెచ్చుతగ్గుల్లో ఉన్నాయి. ఉల్లి ధరలు మాత్రం దిగి రావడం లేదు. ఆదివారం హోల్‌సేల్ మార్కెట్‌లో ఉల్లిపాయలు పది కిలోలు రూ.300కు అమ్మకాలు జరిగాయి. బంగాళాదుంపల బస్తా రూ.420, 28 కిలోల టొమేటో బాక్సు రూ.1100 పలికాయి. దొండకాయలు పది కిలోలు 240, క్యారెట్ 350, క్యాబేజీ 170, బీన్స్ 550, బీట్‌రూట్ 300, మిర్చి 450, గోరుచిక్కుడు 320, బరబాటి 300, చేమదుంపలు 320, దోసకాయ 200, కాకరకాయలు 300, అల్లం బస్తా రూ.2750కు విక్రయించారు. కర్నూలులో వర్షాలు కురవడంతో ఉల్లి పంట తీయడానికి వీలు పడక సరకు రావడం లేదని ప్రముఖ వర్తకుడు యల్లపు రాము తెలిపారు.

ధర పెరిగిన కూరగాయలు : గత వారం కిలో రూ.30కి లభించిన క్యారెట్ ఈ వారం 40కి పెరిగింది. క్యాబేజీ 20 నుంచి 25, కొబ్బరికాయ పెద్దది 12 నుంచి 15, బీట్‌రూట్ 20 నుంచి 40, అల్లం 50 నుంచి 60, చేమదుంపలు 30 నుంచి 40లకు అమ్మకాలు చేపడుతున్నారు.

ధర తగ్గిన కూరగాయలు : టొమేటో గత వారం కిలో రూ.60 పలకగా, ఈ వారం 50కి తగ్గుముఖం పట్టింది. నల్ల వంకాయలు 40 నుంచి 30, బీన్స్ 80 నుంచి 70, మిర్చి 60 నుంచి 50, గోరుచిక్కుడు 40 నుంచి 30, దోసకాయ 30 నుంచి 20, ఆనపకాయ చిన్నది 15 నుంచి 10, ఆనపకాయ పెద్దది 20 నుంచి 15 రూపాయలకు తగ్గాయి.

ధర నిలకడగా ఉన్న కూరగాయలు : ఈ వారం కూడా బంగాళాదుంపలు కిలో రూ.15కు అందుబాటులో ఉన్నాయి. ఉల్లిపాయలు రూ.35, తెల్లవంకాయలు 30, బీరకాయలు 30, బెండకాయలు 30, దొండకాయలు 30, కొబ్బరికాయ చిన్నది 10, బరబాటి 40, కాకరకాయలు 40, అరటికాయలు మూడు 20 రూపాయలకు విక్రయించారు.

సాక్షర భారత్ ద్వారా నిరక్షరాస్యులకు అక్షరజ్ఞానం

సాక్షర భారత్ ఉప సంచాలకులు కుమార్



కొత్తూరు సాక్షర భారత్‌లో పరీక్షలను పరిశీలిస్తున్న దృశ్యం

కొత్తూరు : సమాజంలోని నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా సాక్షర భారత్ ఏర్పాటైందని సాక్షర భారత్ ఉప సంచాలకులు ఎన్‌వీఆర్‌వీ కుమార్ తెలిపారు. మండలంలోని కొత్తూరు సాక్షర భారత్ కేంద్రంలో నిర్వహిస్తున్న పరీక్షలను ఆయన ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిరక్షరాస్యులకు సాక్షర భారత్ కేంద్రాల్లో విద్యను నేర్పించి అక్షరాస్యులుగా తీర్చిదిద్దుతున్నట్టు చెప్పారు. నిరక్షరాస్యులు ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు విద్యను సాక్షర భారత్ కేంద్రాల్లో నేర్చుకోవచ్చునన్నారు. అనంతరం ఆసక్తి కలిగిన వారు డిగ్రీ వరకు కూడా చదువుకోవచ్చునని వివరించారు. ఇందులో భాగంగానే రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల సాక్షర భారత్ కేంద్రాల్లో ఆదివారం మూడో తరగతి పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. అనకాపల్లి మండలంలోని 32 సాక్షర భారత్ కేంద్రాలు ఉన్నాయని, వీటిలో 975 మందికి ఈ పరీక్షలను నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం సత్యనారాయణపురం గ్రామంలోని సాక్షర భారత్ కేంద్రాన్ని పరిశీలించారు. మండల కో-ఆర్డినేటర్ జీవీ లక్ష్మి, విలేజ్ కో-ఆర్డినేటర్లు కె.సత్యవేణి, జి.శేషు కళావతి, పరీక్షల పరిశీలకుడు డి.రమేష్ పాల్గొన్నారు.

నేడు, రేపు లెర్నింగ్ ఔట్‌కంపై ఉపాధ్యాయులకు టెలికాన్ఫరెన్స్

అనకాపల్లి రూరల్ : ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న సెకెండ్ గ్రేడ్ టీచర్లకు సోమ, మంగళవారాల్లో లెర్నింగ్ ఔట్‌కం అనే అంశంపై టెలికాన్ఫరెన్స్ నిర్వహిస్తున్నట్లు మండల విద్యాశాఖాధికారి డి.దివాకర్ తెలిపారు. ప్రతి పాఠశాలలో గల సగం మంది ఉపాధ్యాయులకు సోమవారం, మిగిలిన వారికి మంగళవారం ఈ టెలికాన్ఫరెన్స్ నిర్వహిస్తామన్నారు. కొప్పాక, మర్రిపాలెం, తుమ్మపాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, కొత్తూరులోని ఏఎంఏఏ ఇంగ్లీషు మీడియం హైస్కూల్, అలాగే పట్టణంలో ఎంహెచ్ఎస్ మెయిన్, ఎంహెచ్ఎస్ గవరపాలెం, గాంధీనగరం పాఠశాలల్లో టెలికాన్ఫరెన్స్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఉపాధ్యాయులు తమకు కేటాయించిన తేదీలలో హాజరు కావాల్సిందిగా కోరారు.

వివాదంలో ఉన్న భూమిపై రగడ



కశింకోట రూరల్ : కశింకోటలో వివాదస్పదంగా సర్వే నంబరు 11లోని భూమిలో కొందరు కర్రలు పాతేందుకు ఆదివారం ప్రయత్నించగా వీఆర్వో అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ భూమి వివాదం కోర్టులో ఉన్నందున ఇందులోకి ఎవరూ ప్రవేశించరాదని స్పష్టం చేశారు. నిబంధనలను అతిక్రమించిన వారిపై చట్టపరంగా చర్యలు తప్పవన్నారు.

మరుగు దొడ్ల బిల్లుల కోసం ఎదురుచూపు

అచ్యుతాపురంలో అప్పు చేసి నిర్మించుకున్న లబ్ధిదారులు

డబ్బుల కోసం పదేపదే తిప్పుతున్న పంచాయతీ పాలకులు

అధికారులు తక్షణమే స్పందించాలని వేడుకోలు



నాగరత్నం నిర్మించిన మరుగుదొడ్డి

కశింకోట రూరల్ : మండలంలోని నూతనగుంటపాలెం పంచాయతీ శివారు అచ్యుతాపురంలో మరుగుదొడ్ల బిల్లుల కోసం సుమారు పదిమంది వరకు లబ్ధిదారులు ఎదురు చూస్తున్నారు. స్వచ్ఛభారత్‌లో భాగంగా ప్రతి ఒక్కరూ మరుగుదొడ్డి నిర్మించుకోవాలని ప్రభుత్వం సూచించిన నేపథ్యంలో వీటిని నిర్మించుకున్నామని, ఇప్పుడు బిల్లుల కోసం పదేపదే తిప్పుతున్నారని వాపోతున్నారు. పంచాయతీ కార్యదర్శి చెప్పడంతో అప్పులు చేసి నిర్మించామని, ప్రస్తుతం ఆ డబ్బులకు వడ్డీలు చెల్లించాల్సి వస్తోందని వాపోతున్నారు. అధికారులు స్పందించి చెల్లింపులు చేపట్టాలని వారంతా కోరుతున్నారు.



కట్టిన మరుగుదొడ్డి వద్ద మారేష్

సరుగుడు సాగుపై రైతులు ఆసక్తి



కశింకోట రూరల్ : మండలంలోని పలు గ్రామాల్లో సరుగుడు సాగు జోరుగా సాగుతోంది. ప్రస్తుతం వాతావరణ పరిస్థితులు, వరి, చెరకు పంటలకు తెగుళ్ల బెడదలు తట్టుకోలేక రైతులు ఇటుగా దృష్టి సారించారు. సరుగుడుకు అయితే పెద్దగా పెట్టుబడి ఉండదని పలువురు రైతులు పేర్కొంటున్నారు.


జీసీసీ గొడౌన్ కోసం ఏర్పాటు చేసిన భవనం


తాత్కాలిక గ్యాస్ గొడౌన్ కోసం మార్పు చేసిన జీసీసీ గొడౌన్


గ్యాస్ కోసం గుమిగూడిన వినియోగదారులు(ఫైల్)

గ్యాస్ గొడౌన్ ఏర్పాటయ్యేనా?

◆ వినియోగదారులకు ఇబ్బందులు
◆ తాత్కాలిక గొడౌన్‌లోనైనా గ్యాస్ స్టాకు ఉంచేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్

సీలేరు: సీలేరులో గ్యాస్ గొడౌన్ ఏర్పాటు ప్రతిపాదనలకే పరిమితమైంది. దీంతో వినియోగదారులు సీలేరుకు గ్యాస్ ఏసమయంలో వస్తుందో సరైన సమాచారం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సీలేరులో రెండేళ్ల క్రితం గ్యాస్ గొడౌన్ ఏర్పాటు చేయాలని అప్పటి ఐటీడీఏ పీవో హరినారాయణన్ ప్రతిపాదించారు. చింతపల్లి నుంచి సీలేరుకు గ్యాస్ సరఫరా చేయడంతో అదనంగా రవాణా చార్జీలు వినియోగదారులపై పడుతున్న నేపథ్యంలో సీలేరు, ధారకొండ పరిసర గ్రామాల వినియోగదారులకు సీలేరులో గ్యాస్ గొడౌన్ ఏర్పాటుచేస్తే నిత్యం గ్యాస్ అందుబాటులో వుంటుందని ఈ మేరకు ప్రతిపాదించారు. దీంతో కొత్త గ్యాస్ గొడౌన్ నిర్మించే వరకూ రూ.10 లక్షలతో నిర్మించిన జీసీసీ గొడౌన్‌ను తాత్కాలికంగా వినియోగించుకోవడానికి ఇందుకు అవసరమైన పనులను చేయించాలని పీవో ఆదేశాలు జారీ చేశారు. దీంతో గిరిజన సంక్షేమశాఖ ఇంజనీరింగ్ అధికారులు జీసీసీ గొడౌన్‌ను గ్యాస్ గొడౌన్‌గా మార్చేందుకు రూ.2 లక్షలతో గొడౌన్ చుట్టూ గాలి, వెలుతురు కోసం వెంటిలేటర్స్‌ను అమర్చాడానికి రంధ్రాలను పెట్టించారు. దీనికి అనుకూలమైన గచ్చులను కూడా వేయించారు. తీరా పనులు పూర్తి చేయించిన తరువాత ఇది గ్యాస్ గొడౌన్‌కు అనుకూలంగా లేదని హెచ్‌పీసీఎల్ సంస్థకు చెందిన ఎక్స్‌ప్లోజీవ్ సేఫ్టీ అథారిటీ వారు నిరాకరించడంతో ఇది రెంటికి చెడ్డ రేవడి అయ్యింది. కొత్త గ్యాస్ గొడౌన్ ఏర్పాటు చేయాలని, దీనికోసం జెన్‌కో అధికారులు స్థలం మంజూరు చేయాలని జీసీసీ మేనేజర్ పార్వతమ్మ లిఖితపూర్వకంగా లేఖను ఇచ్చారు. త్వర లోనే స్థలం ఏర్పాటు చేస్తామని జెన్‌కో అధికారులు హామీ ఇచ్చారు. రెండు నెలలు గడుస్తున్నా జీసీసీ అధికారులు గ్యాస్‌గొడౌన్ స్థలం మంజూరుపై దృష్టి సారించకపోవడంతో ఈప్రాంత వినియోగదారులకు గ్యాస్ కష్టాలు తీరలేదు. కొత్త గ్యాస్ గొడౌన్ నిర్మించేంత వరకూ అయినా తాత్కాలికంగా ఏర్పాటు చేసిన గొడౌన్‌లో గ్యాస్ స్టాకు ఉంచేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

వినాయక ప్రతిమల కొనుగోలు సందడి ప్రారంభం

పాడేరురూరల్: ఈనెల25న వినాయక చవితి కావడంతో ఆదివారం పట్టణంలోని వినాయక విగ్రహాలు, అలంకరణ సామగ్రి కొనుగోలుదారులతో చవితి సందడి నెలకొంది. వినాయక చవితిని పురష్కరించుకుని పట్టణంలోని వివిధ పంచాయతీలకు చెందిన ప్రజలతో పాటు జి.మాడుగుల, హుకుంపేట, పెదబయలు, ముంచంగిపుట్టు మండలాలకు చెందిన ప్రజలు పట్టణ కేంద్రానికి ఆదివారం చేరుకోవడంతో మార్కెట్ వినాయక విగ్రహాల కొనుగోలు దారులతో కిటకిటలాడింది. పట్టణంలో వినాయక విగ్రహాల అమ్మకం కోసం ప్రత్యేక దుకాణాలను ఏర్పాటు చేశారు. వర్షం ఒక పక్క నుంచి కురుస్తున్నప్పటికీ వివిధ గ్రామాలు, మండలాల నుంచి వచ్చిన ప్రజలు వినాయక విగ్రహాలను భారీ స్థాయిలో కొనుగోలు చేశారు. వినాయక విగ్రహాలను గ్రామాలకు వాహనాల్లో తరలించారు. ఆదివారం పెదబయలు మండలం పెదకోడాపల్లి కాలనీకి చెందిన వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు మోద మచ్చులు, ఎస్.సింహాచలం, ఎం.వినయ్‌కుమార్, మోద వెంకటరమణ, పాటూరు రామకృష్ణ తదితరులు 10 అడుగుల వినాయక విగ్రహాన్ని కొనుగోలుచేసి మేళతాళాలతో విగ్రహాన్ని


కొనుగోలు చేసిన విగ్రహాలను గ్రామాలకు తరలిస్తున్న దృశ్యం


అమ్మకాలకు సిద్ధంగా ఉన్న వినాయక విగ్రహాలు

గ్రామానికి తరలించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ నవరాత్రులను విజయవంతంగా చేపట్టేందుకు రూ.లక్ష వరకు ఖర్చు చేస్తున్నామని, ఈనెల 31న భారీ అన్నసమారాధన కార్యక్రమాన్ని చేపడుతున్నామని నిర్వాహకులు తెలిపారు. ఈ ఏడాది వినాయక ప్రతిమలు రూ.20 నుంచి రూ.20 వేల వరకు అమ్మకాలు చేపడుతున్నారు. పట్టణంలోని ప్రతీ వీధిలో చవితి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ ప్రతినిధులు, యువత డెకరేషన్‌లు చేస్తున్నారు. భారీగా విద్యుత్ అలంకరణలు చేపడుతున్నారు. పట్టణంలోని సినిమా హాలు సెంటర్, పాతబస్టాండ్, సతకంపట్టు, గుడివాడ, లోచలిపుట్టు, పాతపాడేరు, కొత్తపాడేరు, పి.గొందూరు, తలారిసింగి ప్రాంతాల్లో భారీ విగ్రహాల ఏర్పాటుకు ఉత్సవ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు చేస్తున్నారు. దీంతో పట్టణం ఆదివారం జనాలతో కళకళలాడింది. వినాయక చవితి సందడి కనిపించింది.

పాడేరులో పారిశుధ్యలోపం

అవస్థలు పడుతున్న పట్టణ ప్రజలు

పాడేరురూరల్: అల్పపీడన ప్రభావంతో గడిచిన ఐదు రోజులుగా వర్షం కురవడంతో పట్టణంలోని ప్రధాన రహదారులు బురదమయం కాగా లోచలిపుట్టు, గుడివాడ తదితర ప్రాంతాలు చెత్తలతో నిండి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలోని లోచలిపుట్టు వీధిలో ఉన్న గిరిజన సంక్షే బాలుర ఆశ్రమ పాఠశాల(నంబర్-1) వద్ద చెత్తపేరుకుపోవడంతో దోమల బెడద అధికమై విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నామన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల గేటు వద్ద వర్షానికి రహదారి బురదమయం కావడంతోపాటు చుట్టు పక్కల ప్రజలు చెత్తను గేటు వద్ద వేయడంతో ఆ ప్రాంతం చెత్తమయంగా మారింది.


లోచలిపుట్టులో రహదారిపై చెత్తాచెదారం


ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద పేరుకుపోయిన చెత్త

ఉపాధి రికార్డులు పక్కాగా నిర్వహించాలి

ఎంపీడీవో భాగ్యారావు

చింతపల్లి: ఉపాధి హామీ పథకం రికార్డులను ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు పక్కాగా నిర్వహించాలని చింతపల్లి ఎంపీడీవో కె.భాగ్యారావు అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మండలంలో సామాజిక తనిఖీ పూర్తి కాగానే రికార్డుల నిర్వహణను ఫీల్డ్ అసిస్టెంట్లు విడిచిపెడుతున్నారన్నారు. గ్రామంలో జరుగుతున్న పనులు, మస్టర్ అన్నీ ఎప్పటికప్పుడు రికార్డుల్లో పొందుపరచాలన్నారు. రెండు రోజుల్లో జాతీయ బృందం జిల్లాలో పర్యటించనుందన్నారు. పనులు, రికార్డులను బృందం సభ్యులు తనిఖీ చేస్తారన్నారు. రికార్డులు అసంపూర్తిగా వుంటే చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. 2016-17 రికార్డుల్లో ఇప్పటివరకూ నిర్వహించిన పనులన్నింటి వివరాలను పొందుపరచాలన్నారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి చర్యలు


జేఈ చంద్రశేఖరరావు

గూడెంకొత్తవీధి: విద్యుత్ సమస్యలు పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని చింతపల్లి సబ్‌స్టేషన్ జేఈ చంద్రశేఖరరావు తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వర్షాకాలం విద్యుత్ లైన్లపై చెట్ల కొమ్మలు పడి విద్యుత్ సరఫరాకు తరచూ అంతరాయం కలుగుతోందన్నారు. దీంతో నర్సీపట్నం-చింతపల్లి-ధారకొండ 33కేవీ, 11కేవీ విద్యుత్‌లైన్లు దిగువనున్న చెట్లకొమ్మలను తొలగించే కార్యక్రమం చేపడుతున్నామన్నారు. రెండు రోజులుగా జీకేవీధి-ధారకొండ మధ్యలో జంగిల్ క్లియరెన్స్ పనులు చేపడుతున్నామన్నారు. ఇన్సులేటర్లు, విద్యుత్ తీగలు, స్తంభాలను మరమ్మతులు చేశారన్నారు. అందరికీ విద్యుత్ కార్యక్రమంలో భాగంగా ప్రతీ కుటుంబానికి విద్యుత్ కనెక్షన్ ఇస్తారన్నారు. విద్యుత్‌ను నిరంతరం సరఫరా చేయడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. గ్రిడ్‌లేని గ్రామాలకు సైతం సోలార్ విద్యుత్ సౌకర్యం కల్పిస్తున్నామని తెలిపారు.

జీకేవీధి ఎంపీడీవోగా రవిరత్నకుమార్

చింతపల్లి: గూడెంకొత్తవీధి ఎంపీడీవోగా రవి రత్నకుమార్ నియమితులయ్యారు. జీకేవీధిలో పనిచేస్తున్న ఎంపీడీవో సత్యనారాయణ దీర్ఘకాల సెలవుపై వెళ్లారు. దీంతో ఎంపీడీవో పోస్టు ఖాళీగా వుండడంతో చింతపల్లి ఈవోపీఆర్‌డీ రవిరత్నకుమార్‌కు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ సీఈవో ఉత్తర్వులను జారీచేశారు. సోమవారం ఆయన బాధ్యతలను స్వీకరించనున్నారు.

స్టూడెంట్ కోఫోఖాన్ శిక్షణకు 83 మంది హాజరు


కోఫోఖాన్ కరాటే శిక్షణలో పాల్గొన్న విద్యార్థులు

పాడేరురూరల్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో ఆదివారం నిర్వహించిన ఇంటర్ నేషనల్ స్టూడెంట్ కోఫోఖాన్ కరాటే శిక్షణ కార్యక్రమానికి ఏజెన్సీ మండలాలకు చెందిన 83 మంది విద్యార్థులు హాజరయ్యారని కరాటే క్లబ్ ఇన్‌స్ట్రక్టర్ వెలుసూరి అప్పన్న తెలిపారు. ఆదివారం ఏర్పాటు చేసిన ఈ శిక్షణ తరగతికి ముఖ్య అతిథిగా నేషనల్ కరాటే ఇన్‌స్ట్రక్టర్ బాకూరు పాండురాజు హాజరయ్యారు. బ్లాక్‌బెల్టు సాధించిన విద్యార్థులకు సూచనలు అందించారు. అనంతరం జూనియర్ విద్యార్థులకు ప్రాథమిక కరాటే, స్కోరింగ్ పోటీలను నిర్వహించారు. ఆ పోటీల్లో ప్రతిభను కనపరిచిన 11 మంది విద్యార్థులను ఎంపికచేశారు.


దమ్ము పడుతున్న రైతులు


వరి ఆకు తీస్తున్న మహిళలు

ఊపందుకున్న వరినాట్లు

దమ్ములు, ఆకుతీతతో రైతులు బిజీబిజీ
పెరిగిన కూలిరేట్లతో ఇబ్బందులు

- దమ్ములు, ఆకుతీతల్లో నిమగ్నమైన రైతులు
- పెరిగిన కూలి రేట్లు
- కూలీలు దొరక్క అన్నదాత అవస్థలు

చీడికాడ : మండలంలో అడపా దడపా కురుస్తున్న వర్షాలకు పలు గ్రామాల్లో వరినాట్లు ఊపందుకున్నాయి. మండలంలోని 23 పంచాయతీల్లో 5986 ఎకరాల్లో వరిసాగు అవుతుతున్నట్లు రెవెన్యూ, వ్యవసాయ అధికారులు అంచనా వేశారు. జూన్ నెలలో వరి విత్తనాలు వేస్తున్నప్పుడు వర్షాలు అనుకూలంగా పడినప్పటికీ జూలైలో సరైన వర్షాలు కురవక వరి ఆకు మడులు ఎండిపోయే పరిస్థితికి చేరుకున్నాయి. దీంతో పలువురు ఆయకట్టు రైతులు, సాగునీటి సంఘాల ప్రతినిధులు ఇరిగేషన్ అధికారులను సాగునీటి కోసం విజ్ఞప్తి చేయడంతో జూలై నెలాఖరున కోనాం జలాశయ దిగువ గేటు నుంచి 50 క్యూసెక్కులు, ఎగువ గేటు నుంచి 30 క్యూసెక్కుల నీటిని విడిచిపెట్టారు. దిగువ కాలువల్లో ఎక్కువగా పూడిక లేకపోవడంతోపాటు అడపాదడపా వర్షాలు కురుస్తుండడంతో సుమారు 14 గ్రామాల్లో వరినాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఎగువ కాలువలో పూడిక తీయకపోవడంతో సాగునీరు పూర్తిస్థాయిలో అందడం లేదని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో తొమ్మిది గ్రామాల్లో వరినాట్లు మందకొడిగా సాగుతున్నాయి. నాలుగు రోజులుగా అడపాదడపా వర్షాలు కురుస్తుండడంతో రైతులు దమ్ములు, వరి నాట్లు వేసే పనుల్లో నిమగ్నమయ్యారు. రైతులందరూ ఒకేసారి పొలం పనులు చేపట్టడంతో దీన్ని ఆసరాగా తీసుకున్న కూలీలు మాత్రం కూలి రేట్లను పెంచేస్తున్నారు. దీంతో సామాన్య రైతులు ఇబ్బందులు పడుతున్నారు. కూలీల కొరత ఎక్కువగా ఉండడంతో తప్పనిసరి పరిస్థితుల్లో పక్క గ్రామాల నుంచి కూలీలను తీసుకు రావాల్సిన పరిస్థితి నెలకొంటోంది.

మంచాల మోడల్ స్కూల్లో
ఆరో తరగతిలో సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

చీడికాడ : మండలంలో మంచాల మోడల్ స్కూల్లో ఆరో తరగతిలో ఖాళీగా వున్న 22 సీట్ల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని స్కూల్ ప్రిన్సిపాల్ తంతి హీరాలాల్ తెలిపారు. ఆదివారం ఆ తరగతిలో 80సీట్లకు గాను 58 భర్తీ అయ్యాయని, మిగిలిన సీట్ల భర్తీకి దరఖాస్తులను కోరుతున్నామని చెప్పారు.

ఆసక్తి, అర్హత ఉన్న విద్యార్థుల ఈ నెల 24లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని సంబందిత కాపీలను మోడల్ స్కూల్ కార్యాలయానికి తీసుకు రావాలని కోరారు. దరఖాస్తు చేసుకున్న వారందరికీ మోడల్ స్కూల్‌లో ఈ నెల 26న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నామన్నారు. అలాగే పాఠశాలలో కెమిస్ట్రీ టీజీటీ, ఫిజిక్స్ టీజీటీ ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయని ప్రిన్సిపాల్ హీరాలాల్ తెలిపారు.

ఈ పోస్టుల భర్తీకి సంబంధిత సబ్జెక్టులలో ఎమ్మెసీ బీఈడీ చేసిన అభ్యర్థులు దరఖాస్తులను మోడల్ స్కూల్ కార్యాలయానికి నేరుగా అందించాలని, మరిన్ని వివరాల కోసం 7032996534 నంబర్ ద్వారా సంప్రదించాలని కోరారు.

భక్తశ్రద్ధలతో మోదమాంబకు ఘటాల సమర్పణ



మాడుగుల: మోదమాంబ ఆలయం ఆదివారం కిటలాడింది. ఈ సందర్భంగా అమ్మవారికి వేకువజాము నుంచి ప్రత్యేక పూజలు జరిపారు. క్షీరాభిషేకం చేశారు. అనంతరం మహిళలు కుంకుమ పూజలు జరిపారు. గ్రామానికి చెందిన పలు కుటుంబాల వారు ఘటాలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకుని అమ్మవారికి ఘటాలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారి పాదాల వద్ద పూజలు జరిపారు. ఈ సందర్భంగా పరిసర గ్రామాల భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

పిక్కల మామిడి గరువు వద్ద తొట్టి ఆటో బోల్తా

దేవరాపల్లి : దేవరాపల్లి పినకోట రహదారిలో పిక్కల మామిడి గరువు వద్ద తొట్టి ఆటో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ చాకచక్యంగా తప్పించుకున్నాడు. పినకోట పంచాయతీ చింతపాక, కొరపర్తి గ్రామాలకు నర్సీపట్నం నుంచి కోవెల ఫౌండేషన్ సంస్థ మామిడి మొక్కలను తొట్టి ఆటోలో తరలించింది. తిరిగి వస్తుండగా పిక్కల మామిడి గరువు వద్ద ఘాటీ ఎక్కుతుండగా అదుపు తప్పి బోల్తా పడింది.


బోల్తా పడిన తొట్టి ఆటో

109 మంది కంటి వైద్య పరీక్షలు

దేవరాపల్లి : మండలంలోని బి.కింతాడలో ఆదివారం నిర్వహించిన కంటి వైద్య శిబిరంలో 109 మందికి కంటి పరీక్షలు జరిపినట్లు వైద్యాధికారి భాను తెలిపారు. శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో 30 మందికి ఆపరేషన్లు అవసరమని గుర్తించి వారిని విశాఖపట్నం తరలించారు. సర్పంచ్ బూరే బాబూరావు, ఆర్గనైజర్ రాజు, సమరసత సేవా ఫౌండేషన్ మండల ధర్మ ప్రచారకర్త గ్రటెడ్డి రాము తదితరులు పాల్గొన్నారు.



కంటి పరీక్షలు జరుపుతున్న వైద్యులు

మాడుగులలో జోరు వాన

మాడుగుల: మాడుగుల మండల కేంద్రంలో ఆదివారం వర్షం కురిసింది. శనివారం రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా చినుకులు పడుతూనే ఉన్నాయి. ఆదివారం ఉదయం దాదాపు అరగంట సేపు భారీ వర్షం కురిసింది. ఆ తరువాత సాయంత్రం వరకూ జల్లులు పడుతూనే ఉన్నాయి.


మాడుగులలో వర్షం పడుతున్న దృశ్యం

ఈ అధ్వాన రహదారికి మోక్షమెన్నడు?

కోతకు గురైన ఖండివరం-వి.మాడుగుల రోడ్డు
ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు

చీడికాడ: మండలంలోని ఖండివరం నుంచి వి.మాడుగుల వరకూ గల ఐదు కిలోమీటర్ల తారురోడ్డు అడుగడుగునా కోతకు గురైంది. ఎక్కడికక్కడ గోతులు పడ్డాయి. దీంతో వాహనచోదకులు అవస్థలు పడుతున్నారు. కె.కోటపాడు, దేవరాపల్లి, చీడికాడ మండలాలకు చెందిన వివిధ రాజకీయ పార్టీల నాయకులే కాకుండా వ్యాపారులు, ఉద్యోగులు ఇదే రహదారిపై ప్రయాణాలు సాగిస్తుంటారు. ముఖ్యంగా మాడుగులలోని కళాశాలలకు విద్యార్థులు ఈ రోడ్డు గుండానే వెళుతుంటారు. పాడేరు వెళ్లాలన్నా ఇదే ప్రధాన రహదారి కావడంతో రోడ్డుకు అడుగడుగునా గోతులు పడి ప్రయాణికులు ఇబ్బందిపడుతున్నారు. ఖండివరం గ్రామానికి చెందిన పలువురు రైతులు తమ పంట పొలాల నుంచి వ్యవసాయ ఉత్పత్తులను తెచ్చుకొనేందుకు, రోగులు మాడుగుల పెద్దాస్పత్రికి వెళ్లాలంటే ఇదే ముఖ్యమైన రహదారి కావడంతో ఈ గతుకుల రహదారిలో ప్రయాణం నరకయాతనగా ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేయించాలని ఖండివరం గ్రామానికి చెందిన రెడ్డి దేముడు, రొంగలి దేముడునాయుడు తదితరులు కోరుతున్నారు.


భారీగా కోతకు గురైన ఖండివరం-వి.మాడుగుల రహదారి

వయోజనులకు పరీక్షలు

చీడికాడ : మండలంలోని 22 పంచాయతీల్లో వయోజనులకు ఆదివారం ఎన్ఐఓఎస్ పరీక్షలు నిర్వహించామని సాక్షర భారత్ మండల కో ఆర్డినేటర్ గొర్లి రవి తెలిపారు. 690 మంది పరీక్షలు రాయాల్సి ఉండగా 437 మంది హాజరయ్యారు. మహిళా సమతా సొసైటీ జేఆర్పీ పి.రమణమ్మ, కార్యకర్త డి.మాధవి తదితరులు పర్యవేక్షించారు.

వరి నారుమడులకు అగ్గి, పొడ తెగుళ్లు

దేవరాపల్లి : మండలంలోని పలు గ్రామాల్లో వరి నారుమడులకు పొడతెగులు, అగ్గితెగులు, పాసి తెగులు సోకడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. నాగయ్యపేట, సీతంపేట, రైవాడ, తెనుగుబూడి, వెంకటరాజపురం, గర్సింగి, చినగంగవరం, వాకపల్లి గ్రామాల్లో వరి నారుమళ్లకు ఈ తెగుళ్ల బెడద ఎక్కువైంది. ప్రస్తుతం ఆర్‌జేఎల్, స్వర్ణ వరి నారుమడులకు పొడ, అగ్గి తెగుళ్లు సోకుతున్నాయని ఏవో అప్పారావు అన్నారు. పొడ తెగులు నివారణకు హెక్సాకోనజోల్ 2 మిల్లీ లీటర్లమందు ద్రావణం లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. అలాగే అగ్గి తెగులు నివారణకు ట్రైసైక్లోజల్ 0.06 గ్రాముల మందు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని ఆయన సూచించారు.

మూలకు చేరిన రక్షిత నీటి పథకం

- హుద్‌హుద్ సమయంలో దెబ్బతిన్న పైపులు, విద్యుత్ కనెక్షన్లు
- మూడేళ్లుగా నేతవానిపాలెంలో తాగునీటి ఎద్దడి
- పట్టించుకోని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు

బుచ్చెయ్యపేట : మండల కేంద్రానికి కూతవేటు దూరంలో కేబీ రోడ్డు ఆనుకుని ఉన్న రక్షిత మంచినీటి పథకం మూడేళ్లుగా మూలకు చేరింది. అయినా పట్టించుకునే నాథుడు లేక బుచ్చెయ్యపేట శివారు నేతవానిపాలెం గ్రామస్థులు తాగునీటి సమస్యతో సతమతమవుతున్నారు.

హుద్‌హుద్ తుఫాన్ ధాటికి రక్షిత పథకం విద్యుత్ కనెక్షన్, మోటారు నుంచి ట్యాంకుకు వెళ్లే పైపులైన్ కనెక్షన్ దెబ్బతిన్నాయి. అప్పటి నుంచి ఈ ట్యాంకు ద్వారా గ్రామంలోని కుళాయిలకు తాగునీరందక ఆ కుళాయిలు నిరుపయోగంగా మారియి. పథకానికి మరమ్మతు చేయించాలని గ్రామస్థులు కోరుతున్నా అధికారులు అదిగో, ఇదిగో అంటూ కాలక్షేపం చేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

మండల కేంద్రమైన బుచ్చెయ్యపేట గ్రామ పంచాయతీ పరిధి 11వ వార్డు శివారులో గల నేతవానిపాలెంలో 20 ఏళ్ల క్రితం పదివేల లీటర్ల సామర్థ్యం గల రక్షిత


మూడేళ్లుగా పని చేయని వాటర్ ట్యాంకు


నిరూపయోగంగా కుళాయిలు

మంచినీటి ట్యాంక్‌ను ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు నిర్మించారు. ట్యాంకు వద్ద మూడు కుళాయిలతోపాటు, 11వ వార్డులో పాఠశాల వీధి వరకు పైపులైన్‌లు వేశారు. ఈ గ్రామంలో నాలుగు వందల మంది జనాభా ఉన్నారు. మూడేళ్ల క్రితం సంభవించిన హుద్‌హుద్ తుఫాన్ ధాటికి విద్యుత్ మోటార్ కనెక్షన్, పైప్‌లైన్లు దెబ్బ తిన్నాయి. వీటి మరమ్మతు గురించి అధికారులు పట్టించుకోకపోవడంతో వాటర్ ట్యాంక్ పని చేయడం లేదు. కుళాయిలు నిరుపయోగంగా మారాయి.

గ్రామంలో ఉన్న రెండు బోర్లు ప్రజల తాగునీటి అవసరాలను తీర్చలేకపోతున్నాయి. దీంతో పక్కనే ఉన్న దిబ్బిడికి వెళ్లి మంచినీళ్లు తెచ్చుకోవాల్సి వస్తోందని నేతవానిపాలెం మహిళలంటున్నారు.

ఇలా నీటి కోసం ఆ గ్రామం వెళితే అక్కడి వారితో తరచూ గొడవ పడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు స్పందించి రక్షిత నీటి పథకానికి మరమ్మతులు చేయించి తాగునీటి సమస్య పరిష్కరించాలని 11వ వార్డు సభ్యుడు వియ్యపు ముత్యాలు, గ్రామానికి చెందిన బిల్లకుర్తి వరహాలమ్మ తదితరులు కోరుతున్నారు.

మాకు న్యాయం చేయండి

ఎమ్మెల్సీ మాధవ్‌కు దివ్యాంగ బాలల విద్యాబోధకుల వినతి


ఎమ్మెల్సీ మాధవ్‌కు వినతిపత్రం ఇస్తున్న సహిత ఉపాధ్యాయుల సంఘం నాయకులు

చోడవరం: వేతనాల పెంపులో తమకు జరిగిన అన్యాయాన్ని సరిదిద్ది తమకు న్యాయం జరిగేలా చూడాలని జిల్లా దివ్యాంగబాలల విద్యాబోధకులు సహిత ఉపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు బీఉ రాజు ఎమ్మెల్సీ మాధవ్‌కు విజ్ఞప్తి చేశారు. ఆదివారం చోడవరం పర్యటనకు వచ్చిన ఆయనను కలిసిన సహిత ఉపాధ్యాయులు దీర్ఘకాలంగా విధులు నిర్వహిస్తున్న తమకు, ఇతర ఉద్యోగులతో పోలిస్తే చాలా అన్యాయం జరిగిందని వివరించారు. తమ వేతనాల పెంపు ఆశాస్త్రీయంగా జరిగిందని, వ్యత్యాసాలను సరిదిద్ది గతంలో మంత్రి ప్రకటించిన విధంగా వేతనాలు అమలు చేయాలని మాధవ్‌కు విజ్ఞప్తి చేశారు.

విఘ్నేశ్వర ఆలయంలో అన్న సమారాధన

చోడవరం టౌన్: పట్టణంలోని స్వయంభూ విఘ్నేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం అన్నసమారాధన నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు కొడమంచిలి గణేష్, అర్చకుడు చలపతి కార్యసిద్ధి విఘ్నేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు జరిపారు. ఈ కార్యక్రమంలో బాలగణపతి సేవాసంఘం సభ్యులు, సకలా సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

మండల సర్వసభ్య సమావేశం రేపు

చోడవరం: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 22న మంగళవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో జీవీ చిట్టిరాజు తెలిపారు. ఉదయం 10.30 గంటలకు ప్రారంభం కానున్న ఈ సమావేశానికి మండలంలోని పంచాయతీ సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు అంతా హాజరు కావాలని, అధికారులు పూర్తి సమాచారంతో రావాలని ఆయన కోరారు.

మరుగుదొడ్ల బిల్లులు చెల్లించాలి

ఆర్.శివరాంపురం లబ్ధిదారుల వినతి


ఆర్.శివరామపురంలో మరుగుదొడ్డి

బుచ్చెయ్యపేట : గ్రామంలో రెండేళ్ల క్రితం పూర్తియిన వ్యక్తిగత మరుగుదొడ్లకు బిల్లులు చెల్లించాలని మండలంలోని ఆర్.శివరాంపురానికి చెందిన 60 మంది లబ్ధిదారులు ఎంపీడీవో

టి.కొండలరావును కోరు తున్నారు. నిర్మాణాలు చేసిన వెంటనే బిల్లులు చెల్లిస్తామని భరోసా ఇచ్చిన అధికారులు నిర్మాణాలు పూర్తిచేసి రెండేళ్లు గడిచినా చెల్లింపులు చేయకపోవడంతో అప్పుల ఊడిలో కూరుకుపోయాని నమ్మి రాజుబాబు, చిన్నారావు, అప్పలరాజు, మొల్లి సింహాచలం, కొండలరావు, అప్పారావు, రాజు, చందక చిన్న, జోగా రాజు తదితరులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాధికారులు ఇచ్చిన టార్గెట్‌లు చేరుకోవడానికై తమపై ఒత్తిడి తీసుకొచ్చి ఐఎస్‌ఎల్ నిర్మాణాలు చేయించిన మండలాధికారులు చెల్లింపుల్లో జాప్యం చేస్తున్నారన్నారు. ఇప్పటికైనా తమకు బిల్లులు చెల్లించాలని వారు కోరుతున్నారు.

ప్రతి ఒక్కరూ పోటీతత్వం అలవరచుకోవాలి

ఆర్మీ నమూనా ర్యాలీలో ఎస్‌ఐ మల్లేశ్వరరావు


నమూనా ర్యాలీకి హాజరైన అభ్యర్థులు


బహుమతులు అందజేస్తున్న ఎస్‌ఐ మల్లేశ్వరరావు

చోడవరం రూరల్: ప్రస్తుత పరిస్థితుల్లో నెగ్గుకు రావాలంటే ప్రతి ఒక్కరూ పోటీ తత్వాన్ని అలవరచుకోవాలని చోడవరం ఎస్‌ఐ కె.మల్లేశ్వరరావు అన్నారు. మండలంలోని ఖండిపల్లి గ్రామంలో గణేష్ స్పోర్ట్సు అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం ఆర్మీ నమూనా ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని ఎస్‌ఐ మల్లేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్యక్రమ నిర్వాహకులు పుల్లేటి గణేష్ అభ్యర్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించడంతోపాటు 1600 మీటర్ల పరుగు పందెంలో ప్రతిభ చూపిన ఐదుగురికి జేహెచ్ స్పోర్ట్సు ఆర్థిక సహకారంతో బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో చోడవరం ప్రభుత్వ జూనియర్ కళాశాల పీడీ గోతిరెడ్డి రాంబాబు, ఇతర ప్రైవేట్ కళాశాలల పీడీలు, విశాఖ, విజయనగరం ,శ్రీకాకుళం, తూర్పుగోదావరి తదితర జిల్లాలకు చెందిన సుమారు 150 మంది అభ్యర్థులు ఈ నమూనా ర్యాలీలో పాల్గొన్నారు.

సరుగుడు నారుకు పెరిగిన గిరాకీ

తూర్పుగోదావరి జిల్లా నుంచి దిగుమతి

రావికమతం : మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో మండలంలో సరుగుడు నాట్లు జోరందుకున్నాయి. జూలై రెండో వారం వరకు కురిసిన వర్షాలు తరువాత మందగించడంతో నాట్లు స్తంభించిపోయాయి. మూడు రోజులుగా అడపా దడపా కురుస్తున్న వర్షాలకు తిరిగి రైతులు సరుగుడు నాట్లు ప్రారంభించారు. మండలంలోని మరుపాక, రాయవరం, తట్టబంద, తోటకూరపాలెం, కల్యాణపులోవ, కొమిరి, కేబీపీ అగ్రహారం తదితర గ్రామాల్లో సరుగుడు నాట్లు జోరుగా సాగుతున్నాయి. బుచ్చెయ్యపేట మండలం రాజాం, పెదమదీనా, గున్నెంపూడి తదితర గ్రామాలతోపాటు తూర్పుగోదావరి


రావికమతం జంక్షన్‌లో సరుగుడు నారు అమ్మకాలు

జిల్లా ప్రాంతం నుంచి రైతులు రావికమతానికి సరుగుడు నారు తీసుకొచ్చి విక్రయిస్తున్నారు. వర్షాలు పడకముందు వెయ్యి నార్లు ఉండే కట్ట రూ.500 పైబడి పలకగా, ఇప్పుడు రూ.వెయ్యి పలుకుతోంది. వరినాట్లు కూడా ముమ్మరంగా జరుగుతుండటంతో కూలీల రేటు 25 శాతం పెరిగింది. గతంలో ఆడకూలీలకు రూ.150, మగకూలీలకు రూ.300 చెల్లించగా, ఇప్పుడు రూ. 250, రూ.400లకు పెరిగింది.

ప్రశాంతంగా సాక్షరభారత్ పరీక్ష


రోలుగుంట సాక్షర భారత్ కేంద్రంలో పరీక్ష రాస్తున్న అభ్యర్థులు

రోలుగుంట : మండలంలోని పలు గ్రామాల్లో గల సాక్షరభారత్ కేంద్రాల్లో వయోజనులకు ఆదివారం పరీక్ష నిర్వహించారు. జేపీ అగ్రహారం, కుసర్లపూడి, జానకిరాంపురం, కొండపాలెం గ్రామాల్లోని కేంద్రాలను జిల్లా సాక్షరభారత్ అదనపు ప్రాజెక్టు అధికారి రాజు పరిశీలించారు. మండల కోఆర్డినేటర్ కిల్లాడ గోవింద్ మాట్లాడుతూ మండలవ్యాప్తంగా 630 మందికి పరీక్ష నిర్వహించాల్సి ఉండగా 540 మంది వయోజనులు హాజరయ్యారని తెలిపారు. ఆయన రోలుగుంట, శరభవరం, బుచ్చెంపేట, బీబీ పట్నం, రత్నంపేట, వడ్డిప, కొంతలం గ్రామాల్లో సాక్షర భారత్ కేంద్రాలను పరిశీలించారు.

పోలీస్ యాప్‌పై యువతకు అవగాహన

చోడవరం టౌన్: చోరీల నిరోధానికి పోలీస్‌శాఖ అందుబాటులోకి తీసుకువచ్చిన లాక్డ్ హౌస్ మోనిటరింగ్ సిస్టం యాప్ రిజిస్ట్రేషన్‌పై యువతకు ఆదివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. చోడవరం సర్కిల్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో సీఐ ఎం.శ్రీనివాసరావు, ఎస్‌ఐ కె.మల్లేశ్వరరావు యాండ్రాయిడ్ మొబైల్స్ ద్వారా యాప్ రిజిస్ట్రేషన్ తదితర అంశాలపై వివరించారు. అలాగే కమ్యూనిటీ పోలీస్ ఆఫీసర్‌గా చేరేందుకు ఆసక్తి గల యువకుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో క్రైం ఎస్‌ఐ ఎంవీ రమణ, పట్టణానికి చెందిన సుమారు 30 మంది యువకులు పాల్గొన్నారు.


యువకులకు అవగాహన కల్పిస్తున్న సీఐ శ్రీనివాసరావు

చోరీలకు ఇక చెక్

అందుబాటులోకి ఎల్‌హెచ్‌ఎంఎస్ యాప్... తాళం వేసిన ఇళ్లపై సీసీ కెమెరాల నిఘా..
ఇప్పటివరకు యాప్‌లో 400 మంది పేర్లు నమోదు.. ప్రజల ఆస్తులకు పోలీస్ భద్రత



సమాచారం చెప్పిన వారింటిలో కెమెరాలను అమర్చుతున్న పట్టణ ఎస్‌ఐ అప్పన్నబాబు



యాప్‌ను డౌన్‌లోడ్ చేసిన సీఐ సింహాద్రినాయుడు

నర్సీపట్నం టౌన్: నేరాల నియంత్రణ, ప్రజల ఆస్తుల రక్షణకు పోలీస్ యంత్రాంగం ప్రత్యేక చర్యలు చేపట్టింది. పట్టణంలోని ప్రధాన మార్గాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. ప్రస్తుతం మరో అడుగు ముందుకేసి ప్రత్యేక యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చారు. తాళం వేసిన ఇళ్లల్లో దొంగతనాలు జరగకుండా నివారించేందుకు చర్యలు చేపట్టారు. ప్రజలు సైతం లాక్ట్ హౌస్ మానిటరింగ్ సిస్టమ్ (ఎల్‌హెచ్‌ఎంఎస్) యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవడం ద్వారా ఉత్తమ ఫలితాలు సాధించే అవకాశం ఉంది.

మున్సిపాలిటీలో 65 వేల జనాభా ఉంది. దాదాపు 35వేల నివాసగృహాలు ఉన్నాయి. నర్సీపట్నం వ్యాపార కేంద్రంగా గుర్తింపు పొందింది. ప్రతిరోజు లక్షల్లో వ్యాపార లావాదేవీలు సాగుతాయి. ఇతర ప్రాంతాల నుంచి వచ్చి పలువురు స్థిరపడ్డారు. సెలవులు, ఇతర శుభ కార్యాలయాలకు హాజరయ్యేందుకు పలువురు తమ ఇళ్లకు తాళాలు వేసి వెళుతుంటారు. వీటిపైనే దొంగలు అధికంగా కన్నేస్తున్నారు. పట్టణ శివారులోని కాలనీల్లో తాళాలు వేసి ఉన్న ఇళ్లనే లక్ష్యంగా చేసుకుని దొంగతనాలకు పాల్పడుతున్నారు.

రూ.లక్షల్లో సొత్తు అపహరణ

పట్టణ పరిధిలో ఏటా లక్షల్లోనే ప్రజల ఆస్తులు అపహరణకు గురవుతున్నాయి. 2016లో పట్టణ పరిధిలో 25 దొంగతనాలు జరగ్గా వాటిలో రూ.8,46,500 మేర నగదు, వస్తువులు అపహరణకు గురికాగా పోలీసులు రూ.7,29,500 మేర ఆస్తులను రికవరీ చేశారు. 2017 జనవరి నుంచి జూలై వరకు రూ.4,47,296 మేర నగదు, వస్తువులు అపహరణకు గురికాగా ఇప్పటివరకు లక్షా 61,696 మేర ఆస్తులను రికవరీ చేశారు. ఇవి కేవలం పోలీసులకు వచ్చిన ఫిర్యాదులు మాత్రమే. ఫిర్యాదు చేయనివి మరెన్నో..

ప్రత్యేక యాప్ రూపకల్పన

దొంగల సమస్యను గుర్తించిన పోలీసు అధికారులు వీటికి అడ్డుకట్ట వేసేందుకు ఎల్‌హెచ్‌ఎంఎస్ యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చారు. పట్టణంలో ఇప్పటివరకు 400 మంది ఈ యాప్ ద్వారా తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. మరోవైపు దీనిపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఈయాప్‌ను రిజిస్ట్రేషన్ చేసుకోవడం ద్వారా చాలావరకు సమస్యలు తీరే అవకాశం ఉంది. ఈయాప్‌లో వివరాలు నమోదు చేసుకున్న వారు ఊరు వెళ్లేటప్పుడు పోలీస్‌శాఖకు తెలియజేస్తే వారు ఆయా ఇళ్ల ముందు బందోబస్తు ఏర్పాటు చేస్తారు. అలా దొంగలకు అడ్డుకట్ట వేసే అవకాశం ఉంది. మరోవైపు సీసీ కెమెరాలను సైతం పట్టణంలో అబీద్‌సెంటర్‌లో ఏర్పాటు చేశారు. పట్టణంలో ప్రతియేటా దొంగతనాలు జరుగుతున్నాయి.

ప్రతిఒక్కరూ విధిగా రిజిస్ట్రేషన్ చేసుకోండి

ఎస్.సింహాద్రినాయుడు, పట్టణ సీఐ, నర్సీపట్నం



ఎల్‌హెచ్‌ఎంఎస్ యాప్‌ను మొదటిసారిగా నర్సీపట్నం పరిధిలో అమలుకు శ్రీకారం చుడుతున్నాం. ప్రధానంగా ఈయాప్‌ను పురవాసులు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవడం ఎంతో మంచిది. రిజిస్ట్రేషన్ చేసుకోవడాన్ని బట్టి ప్రభుత్వం వాటికి కావాల్సిన సీసీ కెమెరాలు, మోడెమ్ వంటి పరికరాలు కేటాయిస్తున్నది. ఊర్లకు వెళ్లేవారు ఈ యాప్ ద్వారా రిక్వెస్ట్ చేస్తే పోలీస్‌సిబ్బంది ఇంటికి వెళ్లి సీసీ కెమెరాలు బిగిస్తారు. ఆ తర్వాత స్థానిక పోలీస్ కంట్రోల్ రూమ్ నుంచి నిరంతరం నిఘా ఉంచుతాం. దీనిపై కళాశాలలు, కాలనీలకు వెళ్లి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. కరపత్రాలు పంపిణీ చేయడానికి చర్యలు తీసుకుంటాం.

ఎన్ఐవోఎస్ పరీక్షకు 253 మంది హాజరు



యరకన్నపాలెం సాక్షరభారత్ కేంద్రంలో పరీక్షల రాస్తున్న వయోజనులు

నర్సీపట్నం టౌన్: మండలంలోని ధర్మసాగరం, గబ్బాడ, యరకన్నపాలెం, అమలాపురం, నీలంపేట, ఒ.ఎల్.పురం, వేములపూడి, చెట్టుపల్లి, గురందొరపాలెం పంచాయతీల్లో ఆదివారం వయోజనులకు ఐదో విడత పరీక్షలు నిర్వహించామని సాక్షరభారత్ మండల సమన్వయకర్త కె.దావీద్ తెలిపారు. తొమ్మిది పంచాయతీల్లో నిర్వహించిన పరీక్షలకు 253 మంది వయోజనులు హాజరై పరీక్షలు రాశారన్నారు. ఆరు నెలలకొకసారి నిర్వహించే ఈ పరీక్షల వలన ఎంతోమంది అక్షరాస్యులుగా మారుతున్నారన్నారు.

ప్రభుత్వ పాఠశాలలకు గ్యాస్ కనెక్షన్‌ల మంజూరు

నాతవరం: మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు త్వరలో గ్యాస్ కనెక్షన్లు పంపిణీ చేయనున్నామని ఎంఈవో టి.అమృత్‌కుమార్ తెలిపారు. మండల కేంద్రం నుంచి ఇండేన్ గ్యాస్‌ను విద్యార్థుల సంఖ్యను బట్టి సబ్సిడీతో సరఫరా చేయనున్నామన్నారు. ఈనెల 21,22 తేదీలలో ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు టెలికాన్ఫరెన్స్‌కు ఆర్‌ఓటి సెంటర్‌కు హాజరు కావాలని కోరారు. ఉపాధ్యాయులు పాఠశాలలు మూతపడకుండా టెలికాన్ఫరెన్స్‌కు రెండు బ్యాచ్‌లుగా హాజరుకావాలని ఆయన కోరారు.

వరి నాట్లుకు కూలీల కొరత



మాకవరపాలెంలో వేస్తున్న వరినాట్లు

మాకవరపాలెం: వర్షాలు కురియడంతో అందరూ ఒక్కసారే దమ్ములు పడుతుండడంతో కూలీల కొరత ఏర్పడింది. ఒక్కసారిగా దమ్ములు ప్రారంభం కావడంతో వరినాట్లు వేసే కూలీల దగ్గర నుంచి దమ్ము పట్టే ట్రాక్టర్ల వరకు డిమాండ్ పెరిగింది. గతంలో దమ్ము పట్టే ట్రాక్టరుకు రూ.600 ఉండేది. ప్రస్తుతం గంటకు రూ.700 నుంచి రూ.800 తీసుకుంటున్నారని రైతులు చెబుతున్నారు. అలాగే వరినాట్లు వేసే కూలీల రేట్లు పెంచడంతో రైతులు విలవిలలాడుతున్నారు. నాట్లు వేసే ఆడ కూలీకి రూ.150 నుంచి రూ.200,మగవారికి రూ.300తోపాటు ఒక మద్యం బాటిల్, మధ్యాహ్నం భోజనం రైతులే సమకూరుస్తున్నారు. దీనికి తోడు స్థానికంగా కూలీలు దొరకడం లేదని రైతులు వాపోతున్నారు. ఉపాధి పథకం వచ్చి రైతులకు కూలీల కొరత ఏర్పడిందని రైతులు అంటున్నారు. ప్రస్తుతం మాకవరపాలెం, తామరం, బయ్యవరం, పైడిపాల, లచ్చన్నపాలెం, పీపీఅగ్రహారం, జి.కోడూరు గ్రామాల్లో కూలీలు ఎక్కువగా ఉండడంతో రైతులు పక్క గ్రామాల నుంచి అధికంగా కూలీ చెల్లించి కూలీలను తీసుకు రావలసి వస్తున్నదని అంటున్నారు. ఈ ఏడాది గత ఏడాది కంటే పెట్టుబడులు భారీగా పెరుగుతాయని రైతులు పేర్కొంటున్నారు.

తారు రోడ్లకు నిధులు మంజూరు



వెంకయ్యపాలెం వెళ్లే మట్టి రోడ్డు

మాకవరపాలెం: మండలంలో రెండు కొత్త రోడ్లకు రూ.కోటి 80 లక్షలు మంజూరైనట్టు రామన్నపాలెం సర్పంచ్ చుక్కా పోతురాజు తెలిపారు. రామన్నపాలెం నుంచి చిన రాచపల్లి గ్రామానికి కొత్తగా రూ.45 లక్షలతో తారురోడ్డు మంజూరైందన్నారు. రామన్నపాలెం సెంటర్ నుంచి వెంకయ్యపాలెం రోడ్డుకు రూ.కోటి 35 లక్షలు మంజూరైనట్టు తెలిపారు. కొత్త రోడ్డు పనులకు నిధులు మంజూరు చేసిన మంత్రి అయ్యన్నపాత్రుడుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

హైవోల్టేజ్‌తో 18 టీవీలు, ఫ్యాన్లు దగ్ధం



హైవోల్టేజ్‌తో దగ్ధమైన టీవీలు, బల్బులను చూపిస్తున్న మహిళలు

కృష్ణాదేవి పేట: పాతకేడీపేటలో విద్యుత్ హైవోల్టేజ్‌తో ఆదివారం వినియోగదారులకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఏపీఈపీడీసీఎల్ అధికారులకు ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోలేదని గ్రామస్థులు వాపోతున్నారు. ఆదివారం ఉదయం ఎప్పటిలాగే వినియోగదారులు టీవీలు, ఫ్యాన్లు, బల్బులు వేసుకున్నారు. ఉదయం 11 గంటలకు ఒక్కసారిగా హైవోల్టేజీ విద్యుత్ సరఫరా కావడంతో గ్రామంలో గ్రామంలోని 20 ఇళ్లలో టీవీలు, ఫ్యాన్లు, గ్రైయిండర్లు, మిక్సీలు, తదితర విద్యుత్ పరికరాలు కాలిపోయాయి. గ్రామంలోని గజ్జి సత్తిబాబుకు చెందిన టీవీ, ఫ్యాన్లు, మిక్సీ, బల్బులు, రామోజీ కొండబాబుకు చెందిన రెండు టీవీలు, బల్బులు, గళ్లా మల్లేశ్వరావు, కత్తుల మణిమ్మ, పోలుమూరి శరభయ్య, బొప్పన అప్పారావు, దాకమూరి చిన్నయ్య, మజ్జి జయరాం, సేనాపతి అప్పారావు తదితర్లు టీవీలు, బల్బులు, మిక్సీలు తదితర గృహోపకరాలు హైవోల్టేపీతో దగ్ధమయ్యాయి. వీరిలో కొంతమంది పేదలు వాయిదాల పద్ధతిపై వీటిని తీసుకున్నారు. హైవోల్టేజీతో కాలిపోవడంతో విద్యుత్ వినియోగదారులు లబోదిబోమంటున్నారు. సంబంధిత అధికారులు స్పందిచి తగిన న్యాయం చేయాలని కోరుతున్నారు.

నేడు కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు

నర్సీపట్నం టౌన్: బీసీ, ఎస్సీ, ఎస్టీ, కాపు, మైనార్టీ కార్పొరేషన్ల రుణాలకు దరఖాస్తులు చేసుకున్న అభ్యర్థులకు సోమవారం మున్సిపల్ కార్యాలయ ఆవరణలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నామని మున్సిపల్ కమిషనర్ జె.సురేంద్ర ఆదివారం తెలిపారు. ఈనెల 18న ఇంటర్వ్యూలు నిర్వహించినప్పటికీ అధిక సంఖ్యలో అభ్యర్థులు హాజరుకానందున సోమవారం మరలా నిర్వహిస్తున్నామన్నారు. అభ్యర్థులు ఈ విషయం గమనించి ఉదయం 9గంటలకు తమ ఒరిజినల్ ధ్రువపత్రాలతో హాజరు కావాలని ఆయన కోరారు.

ఆంధ్రజ్యోతి
పాయకరావుపేట
5
విశాఖపట్నం । సోమవారం, 21 ఆగస్టు 2017
పాయకరావుపేట । నక్కపల్లి । కోటవురట్ల । ఎస్.రాయవరం

డీలర్లకు గ్యాస్ సర్వే బాధ్యతలు


గ్యాస్ సర్వే చేపడుతున్న డీలర్లు

నక్కపల్లి : అందరికీ గ్యాస్ కనెక్షన్ ఉండాలన్న ఉద్దేశంతో మరోసారి సర్వే చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ సారి గ్యాస్ కనెక్షన్ల సర్వే బాధ్యతలను రేషన్ డిపో డీలర్లకు ప్రభుత్వం అప్పగించింది. ఇప్పటికే నగదు రహిత లావాదేవీలు, ఈపోస్ విధానంతో సరుకుల పంపిణీ చేయడంలో అవస్థలు పడుతున్న డీలర్లపై అదనపు పని అప్పగించారు. నక్కపల్లి మండలంలోని పలు గ్రామాల్లో డీలర్లు ఈ సర్వే చేపడుతున్నారు. గ్యాస్ కనెక్షన్ లేని వారికి అడ్డురోడ్డుగానీ, పాయకరావుపేట గ్యాస్ ఏజెన్సీలకు వెళ్లి దరఖాస్తులు అందజేయాలని సూచిస్తున్నారు.

నేడు యాళ్ల సురేష్ జన్మదిన వేడుకలు

పాయకరావుపేట : పాయకరావుపేట ఉప సర్పంచ్ యాళ్ల సురేష్ జన్మదిన వేడుకలు సోమవారం నిర్వహించనున్నట్లు ఆయన అభిమానులు తెలిపారు. ఆయన జన్మదినం సందర్భంగా పలు కార్యక్రమాలు నిర్వహణకు పంచాయతీ వార్డు సభ్యులు, అభిమానులు ఏర్పాట్లు చేశారు.

ప్రశాంతంగా ఎన్ఐఓఎస్ పరీక్ష


జానకయ్యపేటలో పరీక్షలు రాస్తున్న మహిళలు


మంగవరంలో పరీక్షలు జరుగుతున్న దృశ్యం


కాగితలో పరీక్షలు రాస్తున్న అభ్యసకులు

పాయకరావుపేట : సాక్షర భారత్ కేంద్రాల్లో విద్య నేర్చుకుంటున్న వయోజనులకు ఆదివారం ఎన్ఐఓఎస్ పరీక్షలు ప్రశాంతంగా జరిగింది. మంగవరంలో జరిగిన పరీక్షను సాక్షర భారత్ మండల కో-ఆర్డినేటర్ ఎ.నాగేశ్వరరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 15వ దశ అక్షరాస్యతా పరీక్షకు అభ్యాసకుల నుంచి విశేష స్పందన లభించిందని అన్నారు. పాయకరావుపేట మండలంలోని 24 పంచాయతీల్లో ఒక్కో పంచాయతీ నుంచి 30 మంది చొప్పున 730 మంది వయోజనులు పరీక్షలకు హాజరయ్యారని తెలిపారు. పరీక్షలో ఉత్తీర్ణులైనవారికి ధ్రువీకరణ పత్రాలు త్వరలో అందజేస్తామని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో సాక్షరభారత్ సిబ్బంది కట్టా వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

నక్కపల్లిలో 900 మంది హాజరు

నక్కపల్లి : సాక్షరభారత్ కార్యక్రమంలో భాగంగా నక్కపల్లి మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం ఎన్ఐఓఎస్ 15వ రౌండ్ పరీక్షలు నిర్వహించారు. గ్రామాల్లోని సాక్షరభారత్ కేంద్రాల్లో చదువునేర్చుకుంటున్న అభ్యాసకులకు ఈ పరీక్ష నిర్వహించారు. మండలం పరిధిలో 900 మంది పరీక్షలు రాసినట్టు మండల కో ఆర్డినేటర్ నాగేశ్వరరావు చెప్పారు. ఎంపీడీవో పిడుగు ఉమామహేశ్వరరావు ఈ పరీక్షా కేంద్రాలను పరిశీలించారు.

ఎస్.రాయవరంలో 809 మంది హాజరు

ఎస్.రాయవరం : ఎస్.రాయవరం మండలంలో ఎన్ఐఓఎస్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. సాక్షర భారత్ కేంద్రాల పరిధిలో పలు పంచాయతీల్లో 15వ రౌండ్ పరీక్షలు నిర్వహించారు. ఈ మండలంలో 840 మంది అభ్యాసకులు పరీక్షలు హాజరు కావాల్సి ఉంది. అయితే 809 మంది పరీక్షలు రాశారని సాక్షరభారత్ మండల కో-ఆర్డినేటర్ తెలిపారు. పరీక్ష కేంద్రాలను ఈవోఆర్డీ కొండలరావు తదితరులు పరిశీలించారు.

కేశవరం పాఠశాలకు స్వచ్ఛ పురస్కార్

పాయకరావుపేట : మండలంలోని కేశవరం మండల పరిషత్ పాఠశాల స్వచ్ఛ విద్యాలయ పురస్కార్‌కు ఎంపికైంది. ఈ మేరకు వచ్చే నెల ఒకటో తేదీన ఢిల్లీలో పురస్కారం ప్రదానం చేయనున్నారు. జిల్లా నుంచి మూడు పాఠశాలలు ఎంపికైన సంగతి తెలిసిందే. పురస్కారం అందుకునేందుకు ఢిల్లీకి ప్రధానోపాధ్యాయుడుతో పాటు ఒక విద్యార్థి వెళ్లనున్నారు.

మంగవరంలో నేడు ఏకాహం

పాయకరావుపేట : మండలంలోని మంగవరం గ్రామంలో చిట్టిపైడమ్మతల్లి పండుగ సందర్భంగా సోమవారం ఉదయం 6 గంటల నుంచి మంగళవారం ఉదయం 6 గంటల వరకు అమ్మవారి ఆలయంలో ఏకాహం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.


జగ్గన్నపేట గ్రామంలో ఇరుకుగా ఉన్న ప్రధాన రహదారి


అసంపూర్తిగా ఉన్న పంచాయతీ భవనం

అభివృద్ధికి దూరంగా జగ్గన్నపేట

గ్రామంలో మౌలిక వసతుల కరువు
ఇరుకైన రహదారులు
డ్రైనేజీ వ్యవస్థ లేక ఇబ్బందులు

అచ్యుతాపురం రూరల్: మండలంలో జగ్గన్నపేట గ్రామం అభివృద్ధికి ఆమడదూరంలో ఉంది. మండలంలో ఒక చివరకు విసిరేసినట్లుగా ఉండే ఈ గ్రామంలో కనీస అవసరాల కోసం ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. 1200 జనాభా గల ఈ గ్రామంలో ఇరుకు రోడ్లతో రాకపోకలకు అవస్థలు పడుతున్నారు. అదేవిధంగా డ్రైనేజీలు, గ్రామ అవసరాలకు వినియోగించుకునేందుకు కల్యాణ మండపాలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలో రహదారులు ఇరుకుగా ఉండడంతో వాహనాల రాకపోకలు సాధ్యం కావడం లేదు. రోడ్డు విస్తరణకు కూడా వీలు లేకుండా ఉంది. రోడ్డును ఆనుకునే ఇళ్లు ఉండడంతో చాలామంది తమ మంచాలు, ఇంటి సామగ్రి, వాహనాలు పార్కింగ్ చేయడంతో రహదారి మరింతగా కుదించుకుపోతోంది. గ్రామం మధ్యలో కొన్ని చోట్ల రోడ్లు విశాలంగా ఉన్నా ప్రధాన రహదారి మాత్రం చాలా ఇరుకుగా ఉంది. గ్రామంలో ఇళ్ల నిర్మాణం జరగాలంటే నిర్మాణ సామగ్రి తీసుకువచ్చేందుకు సైతం మార్గం లేదు. అదేవిధంగా గ్రామం లోతట్టుగా ఉండడంతో వర్షం కురిస్తే పలు ప్రాంతాలు జలమయమవుతున్నాయి. వర్షపు నీరు పారేందుకు డ్రైనేజీలు లేక తమ ఇళ్లలోకి వర్షపు నీరు చేరుతోందని పలువురు వాపోతున్నారు. గ్రామంలో డ్రైనేజీలు నిర్మించాలని, రోడ్లు విస్తరించాలని, ప్రజల సౌకర్యార్థం రెండు కల్యాణ మండపాలు నిర్మించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ప్రభుత్వం నిధులు విడుదల చేయాలి



రోడ్డుకు ఇరువైపులా గ్రావెల్ పూడిస్తే రోడ్డు వెడల్పు అవుతుంది. అయితే పంచాయతీ నిధులు గ్రామంలో కేవలం పారిశుధ్యం నిర్వాహణ, విద్యుత్ పనులు చేయడానికే సరిపోతున్నాయి. గ్రామ అభివృద్ధి కోసం ప్రభుత్వం మరిన్ని నిధులు మంజూరు చేయాల్సి ఉంది.

గ్రామ సర్పంచ్ మారిశెట్టి మాధురి వెంకట్

వర్షాకాలంలో ముంపునకు గురవుతున్నాం



వర్షాకాలంలో ముంపు సమస్యతో బాధ పడుతున్నాం. రెండు రోజులు వర్షాలు కురిస్తేచాలు ఇళ్లల్లోకి నీరు వచ్చి చేరుతుంది. వర్షాకాలం మా కంటిపై కునుకు ఉండదు. గ్రామం లోతట్టు ప్రాంతం కావడంతో వర్షపు నిల్వ ఉండిపోతోంది. గ్రామంలో వేసిన రోడ్లు ఇళ్ల కంటే ఎత్తులో ఉన్నాయి. మా గ్రామం ముంపు బారిన పడకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి.

ఆడారి నూకాలమ్మ, గ్రామస్థురాలు

రైల్వే స్టేషన్‌లో స్వచ్ఛ భారత్


రైల్వే స్టేషన్ శుభ్రం చేస్తున్న అధికారులు, సిబ్బంది

ఎలమంచిలి: ఎలమంచిలి రైల్వే స్టేషన్‌లో ఆదివారం రైల్వే అధికారులు, సిబ్బంది కలిసి స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో భాగంగా స్టేషన్ పరిసరాలను నిరంతరం పరిశుభ్రంగా ఉంచుకోవాలని తుని రైల్వే అధికారి రత్నం అన్నారు. స్టేషన్ ఆవరణలోని పరిసరాలను పరిశుభ్రం చేశారు. కార్యక్రమంలో స్టేషన్ మేనేజర్ బి.అప్పారావు, అనకాపల్లి ఎస్ఈ దేవసహాయం, వి.శ్రీరాములు, సిబ్బంది పాల్గొన్నారు.


అగ్నిప్రమాదాలపై అవగాహన కలిగిస్తున్న సిబ్బంది

అగ్నిప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి

ఎలమంచిలి: ఎలమంచిలి పట్టణంలోని మామిడి అపార్ట్‌మెంట్‌లో ఆదివారం అగ్నిమాపకదళ సిబ్బంది అవగాహన సదస్సును నిర్వహించారు. అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు కానీ గ్యాస్, తదితర ప్రమాదాల జరిగే సమయంలో తీసుకోవలసిన నివారణ చర్యలను వివరించారు. కార్యక్రమంలో అపార్ట్‌మెంట్ సంఘం ప్రతినిధులతోపాటు పలువురు మహిళలు అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.


ఎలమంచిలి చేరుకున్న జీపుజాతా

అగ్రిగోల్డ్ బాధితులను ఆదుకోవాలి

ఎలమంచిలి: అగ్రిగోల్డ్ బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని ఏఐటీయూసీ, సీపీఐ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ఎలమంచిలి పట్టణంలో వీరంతా జీపుజాతా నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ అగ్రిగోల్డ్ బాధితుల సమస్యల పరిష్కారానికి సీపీఐ, బాధితుల సంఘం ఆధ్వర్యంలో ఇచ్ఛాపురం నుంచి అనంతపురం వరకూ బస్సు యాత్ర నిర్వహిస్తున్నట్టు తెలిపారు. సోమవారం ఉదయం ఈ బస్సు యాత్ర అనకాపల్లి చేరుకుంటుందని తెలిపారు. బాధితులంతా పాల్గొని ఈ యాత్రను విజయవంతం చేయాలని కోరారు. ఆగ్రిగోల్డ్ ఆస్తులను విక్రయించి ఖాతాదారులకు న్యాయం జరిగేలా ప్రభుత్వం చొరవ చూపాలని కోరారు. కార్యక్రమంలో నేతలు ఏసుదాసు, పీఎన్‌వీ రాజు, కే రామారావు తదితరులు పాల్గొన్నారు.


రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న పప్పల చలపతిరావు


కేకు కట్ చేస్తున్న సుందరపు విజయ్‌కుమార్

ఘనంగా సుందరపు జన్మదిన వేడుకలు

రక్తదానం చేసిన అభిమానులు

ఎలమంచిలి: టీడీపీ నేత సుందరపు విజయ్‌కుమార్ జన్మదిన వేడుకలు ఆదివారం ఎలమంచిలి పట్టణంలో ఘనంగా నిర్వహించారు. సుందరపు యువసేన సభ్యులు, ప్రజాప్రతినిధులు సుందరపు అభిమానుల నడుమ పట్టణంలోని గురవప్ప కల్యాణ మండపంలో నిర్వహించిన వేడుకల్లో భాగంగా ఎన్టీఆర్‌ట్రస్ట్ వైద్యుల పర్యవేక్షణలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఎమ్మెల్సీ పప్పల చలపతిరావు ప్రారంభించారు. పెద్ద ఎత్తున యువకులు, సర్పంచ్‌లు రక్తదానం చేశారు. సుందరపు నేతలు, అభిమానుల నడుమ కేక్ కట్‌చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎమ్మెల్సీ పప్పల చలపతిరావు మాట్లాడుతూ సుందరపు చేస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమన్నారు. సుందరపు విజయ్‌కుమార్ మాట్లాడుతూ ఆపన్నులకు చేయూతనందించడంలో ఎంతో సంతృప్తి లభిస్తుందన్నారు. సేవా కార్యక్రమాలను చేపడుతున్న మాజీ కార్పొరేటర్ రవికుమార్ సేవలను సుందరపు కొనియాడారు. అనంతరం ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో సుందరపు కుటుంబ సభ్యులు, వైస్ ఎంపీపీ గొన్నాబత్తుల నాగేశ్వరావు, సర్పంచ్‌లు లవుడు లోవరాజు, గెంజి శ్రీనివాసరావు, ఇత్తంశెట్టి నాయుడు, నేతలు అన్నం బాబ్జీ, గొర్లె నానాజీ, అనపర్తి రాజు, చిట్టి టబాబు, నాలుగు మండలాల నేతలు, యువకులు పాల్గొన్నారు.

రాజీవ్ గాంధీ జయంతి


రాజీవ్ గాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

ఎలమంచిలి: ఎలమంచిలి పట్టణంలో ఆదివారం దివంగత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతిని నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ స్థానిక నేతలు రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాజీవ్ గాంధీ సేవలను పలువురు వక్తలు కొనియాడారు. కార్యక్రమంలో నేతలు రామసత్యం, శేఖర్, ఈశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

గోవర్ధనగిరిపై పచ్చదనానికి ప్రాధాన్యం

కొత్తూరు : సత్యనారాయణపురం పంచాయతీ మూలపేట గోవర్ధనగిరిపై గ్రామ టీడీపీ నాయకుడు కోరాడ మహేష్‌బాబు, దాడి రామకృష్ణ ఆధ్వ ర్యంలో ఆదివారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మహేష్‌బాబు మాట్లాడుతూ గోవర్ధనగిరిపై మిత్రుల సహకారాలతో 200 మొక్కలు నాటుతున్నట్టు చెప్పారు. అనకాపల్లి గ్రామీణ బ్రాహ్మణ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు మాధావాచార్యులు, విశ్వనాథం, సూర్య ప్రకాశరావు, మనోహర్, కేశవస్వామి, రామారావు పాల్గొన్నారు.

మట్టి వినాయక విగ్రహాల పంపిణీ

అనకాపల్లి టౌన్ : గ్రీన్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం జీవీఎంసీ ప్రధాన ఉన్నత పాఠశాల ఎదుట మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. ముఖ్య అతిథులుగా హాజరైన ప్రముఖ వైద్యులు కె.విష్ణుమూర్తి, కె.వి. సత్యవతి మాట్లాడుతూ వినాయక పూజకు మట్టి ప్రతిమలనే వాడాలన్నారు. పర్యావరణ పరిరక్షణకు గ్రీన్‌క్లబ్ కృషిని ప్రశంసించారు.

చెత్త వదలదు.. మురుగు కదలదు!

- కశింకోట మేజర్ పంచాయతీలో క్షీణించిన పారిశుధ్యం
- ఎటుచూసినా దుర్గంధభరిత వాతావరణం
- అవస్థలు పడుతున్న నివాసితులు
- పట్టించుకోని పాలకులు


బ్యాంకు వీధిలో మురుగు


మసీదు వీధిలో చెత్త


కనకమహాలక్ష్మి వీధిలో కాలువల దుస్థితి


పూసర్ల వీధి దుస్థితి


కొత్తపేట రోడ్డులో..


కశింకోట వ్యూ

కశింకోట రూరల్ : మేజర్ పంచాయతీ కశింకోటలో పారిశుధ్యం క్షీణించింది. మొత్తం 18 వార్డులు, సుమారు 17 వేల మంది జనాభా ఉన్న ఈ పంచాయతీకి వివిధ పన్నులు, సేవల రూపేణా ఆదాయం బాగానే సమకూరుతోంది. అయినప్పటికీ ఊరి పరిశుభ్రతపై పాలకులు దృష్టి సారించలేకున్నారు. ఏ వీధి చూసినా చెప్పకుప్పలే దర్శన మిస్తున్నాయి. డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో రోడ్లపైకి మురుగు చేరి తిష్ఠవేస్తోంది. కాలువల్లో పూడిక తొలగించకపోవడంతో మురుగు పారడం లేదు. ఫలితంగా ఎటుచూసినా దుర్గంధభరిత వాతావరణమే దర్శనమిస్తోంది. దీనికితోడు చెత్త కుప్పలు మరింత అధ్వానం గా మారాయి. వీటిపై పందులు దొర్లుతూ పాడుచేస్తున్నాయి. వీటి సంచారాన్ని చూపి పలువురు భయపడుతున్నారు. ఇదిలావుంటే, వీధి కుక్కల స్వైరవిహారం ఇక్కడ ఎక్కువే. గుంపుల్లా ఇవి పరుగు తీస్తుండడంతో ఎవరిమీద దాడిచేస్తాయోనని హడలిపోతున్నారు. పంచా యతీ దుస్థితి ఇంతదారుణంగా ఉన్నా ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా తీర్చిదిద్దుదాం, అంతా సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండేలా చూద్దామన్న ఆలోచన చేయకపోడంపై అంతా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



చెత్తను సరిగా తొలగించడం లేదు

పారిశుధ్య కార్మికులు సకాలంలో చెత్తను తొలగించకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పందుల స్వైరవిహారం మరింత భయపెడుతోంది. దోమలు విజృంభిస్తుండడంతో అంటువ్యాధుల భయం వెంటాడుతోంది.

- దాకారపు దారవరలక్ష్మి, ఐద్వా జిల్లా జాయింట్ సెక్రటరీ, కశింకోట



వీధుల్లో డస్టుబిన్లు ఏర్పాటు చేయాలి

ప్రతి వీధిలో అధికారులు చెత్తను వేసే తొట్టెలు ఏర్పాటు చేయాలి. ఎప్పటికప్పుడు డ్రైనేజీలను శుభ్రం చేయాలి. అప్పుడే దోమల బారినుంచి రక్షణ కలుగుతుంది. ఈ సమస్యలపై పంచాయతీ పాలకులు తక్షణమే స్పందించాలి.

- మరిసా వెంకటరమణమ్మ, గృహిణి



స్వచ్ఛభారత్ మాటలకే పరిమితం

స్వచ్ఛభారత్ పేరిట పరిశుభ్రతపై అధికారులు, పాలకులు పదేపదే నినాదాలు చేస్తున్నా ఆచరణలో మాత్రం కానరావడం లేదు. అసలే వర్షాకాలం కావడంతో అంటువ్యాధుల భయం వెంటాడుతోంది. ఈ సమస్యపై తక్షణమే ప్రత్యేకదృష్టి సారించాల్సి ఉంది.

- గూటాల రమేష్, గ్రామస్థులు

ఉప ఎన్నిక బరిలో ఆ అభ్యర్థులను తొలగించాలి

- ప్రచారంలో అధికార, ప్రతిపక్ష పార్టీల తీరు దారుణం
- ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు డబ్బు, మద్యం విచ్చలవిడిగా పంపిణీ
- రౌండ్ టేబుల్ సమావేశంలో ప్రజా సంఘాల ప్రతినిధుల ఆగ్రహం


సమావేశంలో పాల్గొన్న ప్రజా సంఘాల నాయకులు

అనకాపల్లి రూరల్ : కర్నూలు జిల్లా నంద్యాల అసెంబ్లీ స్థానం ఉప ఎన్నికల్లో పోటీ చేస్తున్న అధికార, ప్రతిపక్ష పార్టీల అభ్యర్థులను బరినుంచి తప్పించాలని పలు ప్రజా సంఘాల నాయకులు ఎన్నికల కమిషన్ను డిమాండ్ చేశారు. ఇక్కడి కె.గోవిందరావు భవనంలో వివిధ ప్రజా సంఘాల నాయకులతో ఆదివారం రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఎన్నికల ప్రచారంలో అధికార, ప్రతిపక్ష పార్టీల నాయకులు తాము చేసిన అభివృద్ధిని వివరించి ప్రజలను ఓట్లు అడగడం లేదని, కేవలం వ్యక్తిగత దూషణలతో ప్రచారం సాగిస్తున్నారని విమర్శించారు. అలాగే ఓటర్లను ప్రలోభపెట్టేందుకు డబ్బు, మద్యం విచ్చలవిడిగా పంచుతున్నారని దీనిని దృష్టిలో ఉంచుకొని ఇరు పార్టీలపై ఎలక్షన్ కమిషన్ తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో ప్రజా సంఘాల నాయకులు వై.ఎన్.భద్రం, కనిశెట్టి సురేష్‌బాబు, బొట్టా చిన్నియాదవ్, విత్తనాల పోతురాజు, కోరిబిల్లి శంకరరావు, కోన లక్ష్మణ్, బుగిడి నూకఅప్పారావు పాల్గొన్నారు.

మట్టి వినాయక విగ్రహాల పంపిణీ

అనకాపల్లి టౌన్ : గ్రీన్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం జీవీఎంసీ ప్రధాన ఉన్నత పాఠశాల ఎదుట మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. ముఖ్య అతిథులుగా హాజరైన ప్రముఖ వైద్యులు కె.విష్ణుమూర్తి, కె.వి.సత్యవతిలు మాట్లాడుతూ వినాయక పూజకు ప్రతి ఒక్కరూ మట్టి ప్రతిమలనే వాడాలన్నారు. పర్యావరణ పరిరక్షణకు గ్రీన్‌క్లబ్ చేస్తున్న కృషిని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో అందరినీ భాగస్వాములను చేస్తున్న ఫణిభూషన్‌శ్రీధర్ సేవలు స్ఫూర్తిదాయకం అన్నారు. అంతకుముందు పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. క్లబ్ ప్రతినిధులు పెంటకోట ఉమామహేశ్వరరావు, యల్లపు సూరి అప్పారావు, దాడి వాసు, కె.గోవిందరావు, కాండ్రేగుల సత్యనారాయణ, కర్రి హనుమంతురావు, అటవీ రేంజర్ బి.వినోద్‌కుమార్, ఏఎంఏఎల్ కళాశాల ఎన్‌సీసీ అధికారి ఏఎస్ఎన్ మూర్తి, ఎన్‌సీసీ విద్యార్థులు పాల్గొన్నారు.



వినాయక విగ్రహాలు అందిస్తున్న డాక్టర్ విష్ణుమూర్తి, సత్యవతిలు



గోవర్ధనగిరిపై పచ్చదనానికి ప్రాధాన్యం

కొత్తూరు : సత్యనారాయణపురం పంచాయతీ మూలపేట గోవర్ధనగిరిపై గ్రామ టీడీపీ నాయకుడు కోరాడ మహేష్ బాబు, దాడి రామకృష్ణ ఆధ్వర్యంలో ఆదివారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మహేష్‌బాబు మాట్లాడుతూ గోవర్ధనగిరిపై మిత్రుల సహకారాలతో 200 మొక్కలు నాటుతున్నట్టు చెప్పారు. అనకాపల్లి గ్రామీణ బ్రాహ్మణ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు గోపినంబాళ మాధావాచార్యులు, ఉప్పల విశ్వనాథం, సూర్య ప్రకాశరావు, కె.మనోహర్, శివ, కోటి, శర్మ, సత్యనారాయణ, కేశవస్వామి, ఉప్పల రామారావు పాల్గొన్నారు.